ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 285 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | ఆదివారం 11 జనవరి 2026 | పేజీలు : 8 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

## నెలాఖరులో పబ్లిక్ ఇష్యూకు యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్

**హైదరాబాద్ :** ప్రైమ్ ఫ్యూల్ బ్రాండ్‌తో ఆటో ఎల్‌పీజీ గ్యాస్‌ను విక్రయించే యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నట్టు తెలిపింది. జనవరి చివరి వారంలో ఇష్యూకు వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రమోటర్ ఎంఎస్ బనాని వెల్లడించా రు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బనాని మాట్లాడుతూ..

## భారత్ కోకింగ్ కోల్ ఐపీఓ. నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి!

**దిల్లీ:** ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్‌ఎస్‌ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు

# హైవే.. రద్దీ

## కిటకిటలాడుతున్న బస్టాండ్లు





- హైదరాబాద్-విజయవాడ హైవేపై సంక్రాంతి వాహనాల రద్దీ
- ట్రాఫిక్ తప్పాలంటే ఈ దారుల్లో వెళ్లండి
- సంక్రాంతి సందర్భంగా నేషనల్ హైవేలపై భారీగా పెరిగిన వాహనాల రద్దీ
- ఈ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులకు కీలక సూచనలు చేసిన పోలీసులు



## బయటపడ్డ ఉగ్ర బంధం

- పాక్‌లో ఒకే వేదికపై హమాస్, లష్కరే తోయిబా అగ్రనేతలు...
- పాక్‌లో లష్కరే తోయిబా నేతలతో వేదిక పంచుకున్న హమాస్ కమాండర్
- హమాస్‌కు కొత్త కార్యక్షేత్రంగా మారుతున్న పాకిస్థాన్
- గాజా సహాయం పేరుతో ఉగ్ర కార్యకలాపాలకు భారీగా నిధుల సేకరణ
- నిఘా సంస్థల కళ్లుగప్పేందుకు డిజిటల్ వాలెట్ల వినియోగం

## పురపాలక ఎన్నికలపై ప్రధాన పార్టీల

# ఫోకస్



- భిన్న ఫలితాలతో మరింత అప్రమత్తం
- పార్టీల నాయకులు పుర బరిలో సమర్థులను నిలిపేందుకు సమాయత్తం
- పురపాలక ఎన్నికల్లో 75 రకాల గుర్తులు
- అభ్యర్థులు చెల్లించాల్సిన 'డిపాజిట్'లు ఎంతంటే?
- రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు చకచకా ఏర్పాట్లు
- ఈ నెల 12న తుది జాబితా ప్రకటించనున్న ఎస్ఈసీ
- పురపాలక ఎన్నికల్లో 75 రకాల గుర్తులు ఉంటాయని ప్రకటించిన అధికారులు

హైదరాబాద్

రాష్ట్రంలో ఇప్పటికే పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి. మరోవైపు నగర, పురపాలికల్లో ఎన్నికల ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితాను ప్రకటిం చనుంది. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సిబ్బంది శిక్షణకు సంబంధించి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులను ప్రకటించింది. ఈ మేరకు మొత్తం 75 రకాల గుర్తు లున్నాయి. అభ్యర్థుల డిపాజిట్‌లను కూడా ఖరారు చేశారు. పురపా లికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ. 1,250, ఇతరులు రూ. 2,500, కార్పొరేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ. 2,500, ఇతరులకు రూ. 5 వేలుగా అధికారులు నిర్ణయించారు. మున్సిపల్ - మిగతా3లో



## తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

- 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నాను
- ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం
- మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది
- విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను FRBM పరిమితుల నుంచి మినహాయించాలి

హైదరాబాద్


తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో - మిగతా3లో



## చరిత్రపై దాడులకు ప్రతీకారం తీర్చుకోవాలి

- మన పూర్వీకులు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు
- ఎన్నో పరీక్షలు, కష్టనష్టాలను ఎదుర్కొన్నారు
- ప్రపంచంలో జరిగిన దాడులు, యుద్ధాలకు కొన్ని దేశాలు తమ ఇష్టారీతిగా బలప్రయోగానికి దిగడమే కారణం
- అజిత్ డోభాల్ కీలక వ్యాఖ్యలు

## చైనా, పాక్‌కు చెక్



- కొత్త నేవీ బేస్ ఏర్పాటు చేయనున్న ఇండియన్ నేవీ..
- కొత్తగా ఏర్పాటు కానున్న నేవీ బేస్..
- ఇప్పటికే అక్కడ ఉన్న డాక్ కాంప్లెక్స్‌కు ఉపయోగపడుతుంది
- ఆధునిక గన్స్, ఆయుధాలు ఉంచేందుకు అవకాశం ఉంది

# భూ భారతి పేరుతో ఏజెంట్ల దందా..

- స్లాట్ బుకింగ్ ఏజెంట్ల అక్రమ దందా
- అమాయకులే లక్ష్యంగా అడ్డగోలు దోపిడీ
- తప్పిదాలుంటే తహసీల్దార్ల పేర్లతో వసూళ్లు
- పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా రేట్లు
- భూ భారతి అక్రమాలకు అధికారుల అండ?



హైదరాబాద్

గతంలో ధరణి.. ప్రస్తుతం భూ భారతి.. పేరు ఏదైతేనేం వారి వసూళ్లకు అంతు ఉండదు. తాము చేసిందే స్లాటు, చెప్పిందే రేటు అన్నట్లుగా వైఖరి ఉంటుంది. డాక్యుమెంట్ రైటర్లు, స్లాట్ బుకింగ్ ఏజెంట్లు, మీ సేవా కేంద్రాలు. చేసే పని ఒకటే అయినా వసూళ్లలో మాత్రం ఎవరి తీరు వారిదే. భూముల క్రయ విక్రయాల్లో వారిదే కీలకం. అధికారులకు, క్రయవిక్రయదారులకు వారధిగా ఉంటూ అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. భూ భారతి పోర్టల్ ద్వారా అక్రమాలకు పాల్పడ్డ వైనం జిల్లాలో వెలుగుచూడగా స్లాట్ బుకింగ్ కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో వసూళ్లు, వాటి పని తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నా యి. భూముల క్రయ విక్రయాలకు వచ్చే అమాయకులు, అవసరార్థులే లక్ష్యంగా కొందరు డాక్యుమెంట్ రైటర్లు, - మిగతా3లో

# మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు

- రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది?
- శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా?
- రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు
- 'కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణా యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలి.
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్

తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఎంతో కష్టపడితే తప్ప మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని.. అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను ప్రచురించడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. - మిగతా3లో



ధర్మఘంట

## సంపాదకీయం

# కాలుష్య కట్టడి ఎలా...

ముంబై నగర వాయు కాలుష్య సంక్షోభంపై బాంబే హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడానికి ప్రధాన కారణం డేటా లేకపోవడం . నిబంధనల అమలు లో వైఫల్యమేనని స్పష్టమవుతోంది. గాలి నాణ్యత క్షీణతకు, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొనడం అందరి దృష్టిపథంలో ఉంది. అదే సమయంలో అసలు దానికి సంబంధం ఉందో లేదో నిర్ధారించే డేటా సేకరణ మాత్రం జరగలేదు. అది యాధృచ్ఛికమో.. లేక నిజంగానే కనెక్షన్ ఉందో తెలీదు కానీ.. ప్రభుత్వం " గాలి కాలుష్యకారకమైన వ్యాధులపై పోరాటానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం.." అని చెబుతూ ఉంటుంది. సెన్సార్లు పనిచేయకపోవడం అన్నది గాలి కాలుష్యం విషయానికి సంబంధించిన ఆందోళనలో ఒక పరిపాటిగా మారిపోయింది. కాలుష్య నియంత్రణ సెన్సార్లు అనేకచోట్ల పని చేయడం లేదని బాంబే హైకోర్టు స్వయంగా గుర్తించింది. నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నివారణ మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక డేటా అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తున్నా, జనం అనుభవిస్తున్న కాలుష్యం మాత్రం వేరే కథ చెబుతోంది. జనసాంద్రతకు అనుగుణంగా సెన్సార్ నెట్‌వర్క్ లేకపోవడంతో, కోర్టులు కూడా సరైన సమాచారం లేని శూన్య స్థితిలో నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది.పాండమిక్ తర్వాత మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సంక్షోభం వాయు కాలుష్యమే అయినప్పటికీ, దీనిపై తగినంత శ్రద్ధ లేకపోవడం విచారకరం. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో శ్వాస పీల్చడం అంటే రోజుకు పదుల సంఖ్యలో సిగరెట్లు తాగడంతో సమానమని వార్తలు వస్తున్నా, జనం దాన్ని అలవోకగా తీసుకుంటున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యే కాదు, పెరుగుతున్న వైద్య ఖర్చుల వల్ల దేశంపై భారీ ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ముక్కలు ముక్కలుగా ఉన్న నిబంధనలు, ఆచరణకు సాధ్యం కాని విధానాల వల్ల వాయు స్వచ్ఛత లక్ష్యాలు నెరవేరడం లేదు.ఈ పరిస్థితికి చాలా కారణాలున్నాయి. సరైన నియంత్రణలు లేకపోవడం...వాటిని అమలు చేయడంలో సమన్వయ లోపం, ఆశావహ విధానాలు లేకపోవడం.. వాస్తవికత ఆధారంగా పనిచేయకపోవడం ఇవన్నీ కారణాలే. స్వచ్ఛమైన గాలి కోసం మనం విధించుకునే లక్ష్యాలు..వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతుల్యం కూడా అవసరమే. నా దృష్టిలో, ఇవన్నీ రెండు ప్రధాన లోపాలున్నాయి. ఒకటి డేటా లేకపోవడం.. అదే ముఖ్యమైంది. ఇక రెండోది ప్రత్యక్ష ఆర్థిక ప్రోత్సాహకాలు, జరిమానాలు లేకపోవడం. (కాలుష్య నియంత్రణకు సంబంధించి) ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఇతర కారణాలు సహా మిగతా అన్ని అంశాలు..ఈ మొదటి లోపాన్ని సరిదిద్దకుండా పరిష్కరించలేము. కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి వార్డులో, ప్రతి లోకాలిటీలో తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక సెన్సార్లను ఏర్పాటు చేయాలి. కేవలం ముంబైని మాత్రమే కాకుండా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ మొత్తాన్ని ఒకే 'ఎయిర్ షెడ్'గా పరిగణించి అధ్యయనం చేయాలి. సముద్రపు గాలుల వల్ల కాలుష్యం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుతుందో తెలిస్తేనే మూలాలను అరికట్టగలం. 2023లో ఎమి బాంబే, ఔఇఇఖీఎ వంటి సంస్థలు ఇచ్చిన నివేదికలను ఇప్పటికైనా అమలు చేయాలి. వీటితో పాటు, కాలుష్యం తగ్గించే వారికి పన్ను రాయితీలు ఇవ్వడం, ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం వంటి 'ఫిస్కల్ ఇన్సెంటివ్స్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. బలమైన రాజకీయ సంకల్పం లేకపోతే, మనం పీల్చే గాలిని చూస్తూ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోతాం.శ రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరోవైపు ప్రపంచానికే పొగమంచు రాజధానిగా పేరుపొందిన చైనా రాజధాని బీజింగ్ గడచిన దశాబ్ద కాలంలో వాయు నాణ్యతను గణనీయ స్థాయిలో మెరుగుపరుచుకుంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ఈ గండం నుంచి గట్టెక్కడానికి చైనీస్ ఎంబసీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న దరిమిలా ఉత్పన్నమయ్యే వాయు కాలుష్యంపైన ఎలా పోరాడాలో భారత్, చైనాకు తెలుసునని చైనీస్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి రాత్రికి రాత్రే రాదని, కాని దాన్ని సాధించగలమని ఆమె తెలిపారు. డిసెంబర్ 15న ఢిల్లీలో వాయు ప్రమాణ సూచి(ఏక్యూ) 447 ఉండగా బీజింగ్‌లో 67 పాయింట్లు ఉంది. ఈ రెండు స్క్రీన్‌షాట్లను ఆమె తన పోస్టులో షేర్ చేశారు.మొదటి దశలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు బీజింగ్ తీసుకున్న చర్యలను ఆమె వివరిస్తూ ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లే పాత వాహనాలను తొలగించి యూరో 6 నిబంధనలను కఠినంగా అమలు చేసినట్లు ఆమె చెప్పారు. లైసెన్స్-ప్లేట్ లాటరీలు, బేసి, సరి సంఖ్య తేదీల్లో వాహనాలపై ఆంక్షలు, మెట్రో, ప్రజారవాణా వ్యవస్థలో భారీ పెట్టుబడులు పెట్టడం, విద్యుత్తు బస్సులు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున తీసుకురావడం వంటి చర్యలను ఆమె సూచించారు.రెండవ దశలో పారిశ్రామిక పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. బీజింగ్‌లో 3,000కు పైగా భారీ పరిశ్రమల మూసివేత లేక వేరే ప్రాంతాలకు తరలింపు జరిగినట్లు చెప్పారు. చైనాలోని అతి పెద్ద ఉక్కు తయారీ సంస్థల్లో ఒకటైన షౌగాంగ్‌ని వేరే చోటుకు తరలించడంతో 20 శాతం వాయు కాలుష్యం తగ్గినట్లు వివరించారు.

# నేషన్ వాంట్స్ టూ నో!

ఆలోచన సరైంది కాకపోతే ఆచరణ వ్యర్థమవుతుంది. సంకల్పం మంచిది కాకుంటే ఫలితం బెడిసి కొడుతుంది. ప్రజా ప్రయోజనాలు పట్టకుండా.. స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా మారి ఒక్కటైన ఏ బంధమైనా ఎక్కువకాలం నిలబడదు. దేశభక్తి ముసుగు వేసుకొన్న ఓ పార్టీ, నా కంటే దేశభక్తుడే లేడంటూ రంకెలేసే ఓ జర్నలిస్టు గురించే ఈ ఉపోద్ఘాతమంతా! పరస్పర ప్రయోజనాల మధ్య వాటాల పంపిణీ కుదరకపోవడంతో తెగదెంపులు చేసుకొన్న ఆ ఇద్దరి ఆసక్తికర కథ ఇది.

'కూరిమి గల దినములలో నేరములెన్నడును గలుగ నేరవు. మరియా కూరిమి విరసంబైనను నేరములే తోచుచుండు' అన్నట్టు.. మొన్నటివరకూ ఆ పార్టీని అకాశానికెత్తి, ఆ పార్టీ పెద్దలు ఏంచేసినా దేశ శ్రేయస్సు కోసమేనంటూ కలరింగ్ ఇచ్చిన ఆ అరుపుల జర్నలిస్ట్ ఉన్నట్టుండి ప్లేటు ఫిరాయించాడు. అప్పటివరకూ భుజాన మోసిన పార్టీనే లక్ష్యంగా చేసుకొంటూ వాక్బాణాలు సంధిస్తున్నాడు. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంపై సర్వత్రా చర్చ మొదలైంది. అయితే, కౌటిల్యుడికి కూడా అందని ఓ కుటిల ఆర్థిక-అసూయాపర్వం ఈ విరసంలో దాగున్నదని జర్నలిస్టు వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఆ కథా కమామీషు పూర్తిగా అర్థం కావాలంటే ఓ 20 ఏండ్ల వెనక్కి వెళ్లాలి.

మనం ఇప్పుడు మాట్లాడుకుంటున్న ఆ అరుపుల జర్నలిస్ట్ ఈశాన్య రాష్ట్రమైన అసోం నుంచి వచ్చాడు. విద్యాభ్యాసం తదితరాల గురించి వదిలిపెడితే, దేశంలోని ప్రఖ్యాత ఇంగ్లీష్ మీడియా ఛానళ్లలో ఆయన పనిచేశాడు. ఓ ప్రధాన ఛానల్‌లో ప్రైమ్‌టైమ్‌లో ప్రసారమైన 'నేషన్ వాంట్స్ టూ నో' అనే షోలో ఈ జర్నలిస్ట్ అరిచిన అరుపులకు ఆయనకు పెద్ద క్రేజ్ వచ్చిపడింది. దేశభక్తి ముసుగేసుకొన్న ఓ పార్టీని మోస్తూ.. తనకు తానుగా ఓ గొప్ప దేశభక్తుడిగా ఫీలయ్యే ఈ జర్నలిస్ట్ జీవితం 2014లో మలుపుతిరిగిందనే చెప్పాలి. తాను మోసే పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడంతో ఈ జర్నలిస్టు ఆడింది ఆట.. పాడింది పాటగా సాగింది. అంతే కాదండోయ్.. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీని తొలిసారిగా ఇంటర్వ్యూ చేసింది కూడా ఈ అరుపుల మహాశయుడే.

హనీమూన్ పీరియడ్: అప్పటికే పలు ఛానళ్లలో యాంకర్‌గా పనిచేసి అనుభవాన్ని గడించిన ఈ అరుపుల జర్నలిస్టు.. ఓ ఇంగ్లీష్ న్యూస్ ఛానల్‌ను స్వతహాగా ప్రారంభించాలనుకున్నాడు. అంతే, 'రాజు తలుచుకొంటే..' అన్నట్టు అరుపుల జర్నలిస్ట్ ప్రారంభించే ఛానల్‌లో దేశభక్తి ముసుగు పార్టీకి చెందిన ఓ కీలక నేత ప్రధాన పెట్టుబడిదారిగా చేరాడు. ఓ ప్రధాన సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉన్నత హోదాలో పనిచేసిన మరొక వ్యక్తి కూడా సహ పెట్టుబడిదారిగా చేరడంతో నిధులకు లోటు లేకుండాపోయింది. 2017లో ప్రారంభమైన ఈ ఛానల్‌లో పొద్దస్తమానం ముసుగు పార్టీ భజనే. ఆ పార్టీని విమర్శించేవారిని లైవ్‌లోనే చీల్చిచెండాడుతూ స్వామిభక్తిని చాటుకోవడమే లక్ష్యమన్నట్టు ఈ జర్నలిస్ట్ వ్యవహరించేవాడు. తమ రాజకీయ ప్రయోజనాలు కాపాడుతున్న సదరు జర్నలిస్టుకు కూడా ఆ పార్టీ ఆర్థికంగా ఎంతో ఊతమిచ్చింది. సొంతంగా నిలదొక్కుకొనే స్థాయి రావడంతో తొలి పెట్టుబడిదారులకు ఎంతో కొంత లాభాలను ముట్టజెప్పి.. ఛానల్‌ను పూర్తిగా నియంత్రణలోకి తెచ్చుకున్నాడు. ఆ తర్వాత హిందీ, బెంగాలీ, కన్నడలోనూ అదే బ్రాండ్ పేరిట ఇతర ఛానళ్లను ప్రారంభించాడు. అలా 2017లో మొదలైన ఈ అరుపుల జర్నలిస్టు సొంత మీడియా నెట్‌వర్క్ హనీమూన్ పీరియడ్ 2024 లోక్‌సభ ఎన్నికల వరకూ నిరాటంకంగా సాగింది. తేడా కొట్టిందిక్కడ..: 2024 లోక్‌సభ ఎన్నికల్లో దేశభక్తి ముసుగు పార్టీకి అనుకోని షాక్ తగిలింది. సింగిల్ మెజారిటీతో మూడోసారి అధికారంలోకి వస్తామనుకొంటే, మిత్రపక్షాల మద్దతు తప్పనిసరైంది. దీంతో ఆ పార్టీ కారణాలను వెతికే పనిలో పడింది. హిందీ బెల్ట్‌లో అనుకున్నన్ని సీట్లు రాలేదని గ్రహించింది. అరుపుల జర్నలిస్టును నమ్మే స్థితిలో ఎవరూ లేరని, అతని అతి ప్రచారమే ఒకవిధంగా తమ కొంప ముంచిందని విశ్లేషణకు వచ్చింది. ఇదే సమయంలో బెంగాల్, కర్ణాటకల్లో తన ప్రత్యర్థి పార్టీలతో ప్రకటనల కోసం అరుపుల జర్నలిస్టు ప్రయత్నాలు ముమ్మరం చేశాడని ముసుగు పార్టీ పెద్దలకు ఎవరో ఉప్పందించారు. దీంతో అరుపుల జర్నలిస్టును వదిలించుకోవడమే గాకుండా, తమకు మంచి ప్రచారం కల్పించే మార్గాలను ముసుగు పార్టీ పెద్దలు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే అరుపుల జర్నలిస్టుకు సమ ఉజ్జీలుగా చెప్పుకొనే ప్రధాన హిందీ న్యూస్ ఛానల్ ఆజ్‌తక్‌లో పనిచేసే యాంకర్లు సుధీర్ చౌదరీ, అంజనా ఓం కశ్యప్‌పై, అలాగే అంబానీకి చెందిన మరో ఛానల్ న్యూస్ 18లో పనిచేసే మరో లేడీ యాంకర్ రుబికా లియాఖత్‌కు ముసుగు పార్టీ ఆశీర్వాదం లభించింది. అంతేకాదు, సుధీర్‌కు ఏకంగా ప్రభుత్వ మీడియా ఛానల్‌ను అప్పగించింది ఆ ముసుగు పార్టీ. అయితే, తనను కాదని తన దగ్గర ఓనమాలు నేర్చుకొన్నవారికి ముసుగు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించడం అరుపుల జర్నలిస్టుకు నచ్చలేదు. పార్టీ కోసం తాను ఇంత చేస్తే.. తనను నట్టేట ముంచేస్తారా? అనే భావన ఆ జర్నలిస్టులో క్రమంగా పెరిగింది. అగ్గికి ఆజ్యం పోసినట్టు.. ఇటీవల కలెక్షన్ల వర్షం కురిపించిన ఓ బాలీవుడ్ గూఢచారి సినిమాలో ముంబై పేలుళ్ల సీన్‌ను అడ్డుపెట్టుకొని తనను ముసుగు పార్టీ పెద్దలు పరోక్షంగా టార్గెట్ చేయడాన్ని అరుపుల జర్నలిస్టు జీర్ణించుకోలేకపోయాడు. దీంతో ముసుగు పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌తోనే వాగ్వివాదానికి దిగాడు. అయితే, ఊహించనివిధంగా ఈ అరుపుల జర్నలిస్టుకు అటునుంచి బెదిరింపులు వచ్చాయి. గతంలో నమోదైన కేసుల చిట్టా బయటపడుతుందని అటువైపు వారు బ్లాక్‌మెయిల్‌కు దిగారు. దీంతో పాలుపోని అరుపుల జర్నలిస్టు తన రూటు మార్చాడు. అందుకే ఆ ఛేంజ్: గడిచిన 20 ఏండ్లుగా గుర్తుకురాని జర్నలిజం విలువలు.. ఉన్నట్టుండి గుర్తొచ్చినట్టు నటించడం ప్రారంభించాడు ఈ అరుపుల జర్నలిస్ట్. ఆరావళి మైనింగ్, కార్మిక చట్టాలు, ఢిల్లీ కాలుష్యం, ఇండిగో సంక్షోభం, కుల్‌దీప్‌సింగ్ సెంగార్.. ఇలా ఏ విషయాన్ని తీసుకున్నా ముసుగు పార్టీని టార్గెట్ చేస్తూ మాటల తూటాలు పేల్చడం మొదలుపెట్టాడు. మొన్నటివరకూ ముసుగు పార్టీని ఆకాశానికి ఎత్తిన ఈ అరుపుల జర్నలిస్ట్.. ఉన్నట్టుండి యూటర్న్ తీసుకోవడమేంటని? అందరూ చర్చించుకోవడం మొదలెట్టారు. తాను స్వతంత్ర జర్నలిస్టునని, దేశం కోసమే మాట్లాడుతానని నమ్మించే ప్రయత్నాలు మొదలుపెట్టాడు అరుపుల జర్నలిస్ట్. అయితే, అప్పటికే, జరగాల్సిన నష్టం జరిగింది. అరుపుల జర్నలిస్టును నమ్మే స్థితిలో ఇప్పుడు ఎవరూ లేరు. అయితే, అరుపుల జర్నలిస్టును నమ్మని జనం.. అతను చెప్తున్న తాజా విషయాలను మాత్రం విశ్వసిస్తున్నారు. ఎందుకో తెలుసా.. అవన్నీ నిజాలు కాబట్టి!! మొత్తంగా ప్రజా ప్రయోజనాలు పట్టకుండా.. స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా మారి ఒక్కటైన ఈ బంధం ప్రస్తుతానికైతే విచ్ఛినమైంది. అయితే, భవిష్యత్తులో ఈ బంధం తిరిగి ఒక్కటైనా ఆశ్చర్యపోనవసరం లేదు. ఎందుకంటే.. ఈ రెండూ దొందూ దొందే బాపతు కాబట్టి!!



# దేశాధినేతలనూ ఎత్తుకెళ్తున్న అమెరికా

రాత్రికి రాత్రి మనుషులు మాయం కావడం ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో సర్వ సాధారణ విషయం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని పోలీసులు రాత్రికి రాత్రే మనుషులను ఎత్తుకెళ్లేవాళ్లు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చట్టబద్ధమైన పోలీసులు చట్ట వ్యతిరేకంగా ఎత్తుకెళ్తే విచిత్రంగా అనిపించేది. ఒక్క తెలంగాణ అనే కాదు అన్ని రాష్ట్రాల్లో పోలీసులు ఇప్పుడు ఇలా మనుషులను ఎత్తుకెళ్లడం మాములు విషయంగా మారింది. వెనిజులా అధ్యక్షుడు, వారి భార్యను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు వారి సైన్యం ఇలా ఎత్తుకెళ్లడం ఈ కాలం నాటి వింతే. సార్వభౌమత్వం కలిగిన ఒక దేశాధ్యక్షుడిని మరో దేశాధ్యక్షుడు ఇలా ఎత్తుకెళ్లడం నాగరిక ప్రపంచంలో అరుదు. 'కర్ర ఉన్నవాడిదే బర్రె' అని అమెరికా పాలకులు నిరూపిస్తున్నారు. నోబెల్ శాంతి కోసం తనకన్నా మించిన వారు లేరని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించుకున్నారు. నోబెల్‌కు అర్హత ఉందని చెప్పుకొన్న పాలకుడు అచ్చం బందిపోటు దాడిలా ఒక దేశంపై బలగాలతో విరుచుకుపడి ఏకంగా ఆ దేశ అధ్యక్షుడిని, అతని భార్యను అమానుషంగా తమ దేశానికి ఎత్తుకువెళ్లాడు. వెనిజులా అధ్యక్షుడు భారీ ఎత్తున ప్రమాదకర మాదక ద్రవ్యాలను అమెరికాకు చేరవేస్తున్నారనేది అమెరికా ఆరోపణ. ఈ ఆరోపణల్లో నిజానిజాలు అమెరికాకే తెలియాలి. ఒకవేళ నిజమనుకున్నా తమ దేశంలోకి మాదక ద్రవ్యాలు రాకుండా అమెరికా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవచ్చు. దేశంలోకి మాదక ద్రవ్యాలు తీసుకువస్తున్న వారిని కఠినంగా శిక్షించి అడ్డుకట్ట వేయవ చ్చు. అంతేకానీ, ఒక దేశాధ్యక్షుడిని ఏ విధంగా కిడ్నప్ చేస్తా రు. మాది శక్తివంతమైన దేశం కాబట్టి ప్రపంచం లో ఎక్కడైనా ఏమైనా చేస్తామని బెదిరించడమే. ఒకరకంగా ఇది ఇస్లామిక్ టెర్రరిజం లాంటిదే. తమకు నచ్చకపోతే ప్రపంచంలో ఎక్కడైనా విధ్వంసం సృష్టిస్తామనే టెర్రరిస్టుల ప్రకటనకు, అమెరికా వ్యవహార తేడా లేదు. ప్రపంచంలో అత్యధికంగా క్రూడాయిల్ నిల్వలు ఉన్న దేశం వెనిజులా. సాధారణంగా క్రూడాయిల్ ఉన్న దేశాలు అంటే సౌదీ అరేబియా పేరు మొదట గుర్తుకువస్తుంది. కానీ, సౌదీ అరేబియా కన్నా వెనిజులా దేశంలోనే క్రూడాయిల్ నిల్వలు ఎక్కువ. వెనిజులాలో 3003 బిలియన్ బారెల్స్ క్రూడాయిల్ నిల్వలున్నాయి. ఇది ప్రపంచం మొత్తం క్రూడాయిల్ నిల్వల్లో 17 శాతంపైనే. సౌదీ అరేబియాలో 267 బిలియన్ బారెల్స్, ఇరాన్‌లో 267 బిలియన్ బారెల్స్, కెనడాలో 163, ఇరాక్‌లో 145 బిలియన్ బారెల్స్ క్రూడాయిల్ నిల్వలున్నాయి. వెనిజులాపై అమెరికా కన్ను పడటానికి ఆ దేశంలోని క్రూడాయిల్ నిల్వలే ప్రధాన కారణం. ఇరాక్ జీవాయుధాలు కలిగి ఉన్నదని, వీటివల్ల ప్రపంచానికి ముప్పు అని అమెరికా ప్రకటించి ఇరాక్‌పై దాడిచేసి నేలమాళిగలో దాగిన సద్దాం హుస్సేన్‌ను అమెరికా సైన్యం పట్టుకొని హత్య చేసింది. ఆ తర్వాత ఇరాక్‌లో జీవాయుధాలు దొరికాయా? అంటే ఏమీ దొరకలేదు. ఒకవేళ నిజంగానే అమెరికాను భయపెట్టే స్థాయిలో సద్దాం హుస్సేన్ తమ దేశంలో జీవాయుధాలు పెట్టుకొని ఉంటే అమెరికా తమ దేశంపై దాడి చేసినప్పుడు నేలమాళిగలో ఎం దుకు దాగుంటాడు. అమెరికాపై ఆ జీవాయుధాలు ప్రయోగించేవాడు కదా? ఆయిల్‌పై పెత్తనం కోసం ఇరాక్‌పై దాడి చేసేందుకు జీవాయుధాలు అనేది ఒక సాకు మాత్రమే. ఇప్పు డు వెనిజులాపైనా కుంటిసాకులే చెప్తున్నారు. ప్రపంచంలో మరో దేశం ఇలా చేయలేదు, మేం కాబట్టి చేశాం అని ట్రంప్ తన చర్యను సమర్థించుకుం టున్నారు. ప్రస్తుతానికి వెనిజులాను అమెరికానే పాలిస్తుందని, ఆ దేశంలోని చమురు వ్యాపారాన్ని అమెరికా కంపెనీలు నిర్వహిస్తాయని ట్రంప్ ప్రకటించారు. క్రూడాయిల్ కోసమే ఈ దాడులని ట్రంప్ చెప్పకనే చెప్పారు. క్రూడాయిల్ నిల్వలు భారీగా ఉన్న అన్ని దేశాలపై అమెరికా ఏదో రకంగా పెత్తనం చెలాయిస్తున్నది. తమ మాట వినకపోతే ఆ దేశ పాలకులను కిడ్నాప్ చేస్తారు, ఆ దేశాన్ని అస్తవ్యస్తం చేయడానికి అమెరికా ఏ మాత్రం వెనుకాడదు. అలా అని క్రూడాయిల్ ఉన్న



ఇస్లామిక్ దేశాలన్నీ గొప్ప ప్రజాస్వామిక దేశాలు, అమెరికా మాత్రమే రౌడీ పాలకుల దేశమని చెప్పలేం. అశ్వ బలమే ప్రధాన బలంగా ఉన్న కాలంలో ఇండియాతో సహా అనేక దేశాలపై ముస్లిం పాలకులు దాడులు చేసి, సంపద దోచుకోవడంతో పాటు అధికార బలంతో బలవంతంగా మత మార్పిడి చేశారు. చివరికి టెర్రరిజం ద్వారా ప్రపంచంపై పెత్తనానికి ఇస్లామిక్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. దీనిలో ఎక్కువగా నష్టపోయింది ఇండియానే. అప్పటివరకు టెర్రరిజంను ఇండియా సమస్యగా చూశారు. ట్విన్ టవర్స్‌పై విమాన దాడి తర్వాత టెర్రరిజాన్ని ప్రపంచ సమస్యగా చూస్తున్నారు. అశ్వాల స్థానంలో ఆయుధాలు వచ్చినప్పుడు ఆయుధ సంపద ఉన్న దేశాలది పైచేయి అయింది. తన ఆయుధ సంపద ద్వారా అమెరికా ప్రపంచం మీద ఆధిపత్యం చెలాయిస్తున్నది. అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్య సమితి నియమ నిబంధనలు టెర్రరిస్టులు పట్టించుకోరు, అమెరికా పట్టించుకోదు. వెనిజులాపై అమెరికా దాడిచేసి ఆ దేశ అధ్యక్షుడిని కిడ్నాప్ చేయడంపై రష్యా, చైనా వంటి దేశాలు ఖండించాయి. ఇండియా మౌనంగానే ఉంది. ఇప్పుడు ప్రపంచంలో అన్ని దేశాలు తమ ప్రయోజనం తాము చేసుకుంటున్నాయి. ఒకప్పుడు హైదరాబాద్ మహా నగరాన్ని నలుగురైదుగురు పేరు మోసిన రౌడీలు అనధికారికంగా పాలించేవారు. సాధారణ పౌరులకు తమ కుటుంబ సమస్యలు తమకుంటాయి. మనకెందుకులే అని మౌనంగా ఉంటారు. ఈ మౌనం వల్లనే రౌడీల హవా సాగేది. బస్తీల్లో రౌడీలకు భయపడినట్టుగా ఇప్పుడు అమెరికా దాదాగిరి విషయంలో మనకెందుకు అని అన్ని దేశాలు తమ ప్రయోజనాలు తాము చూసుకుంటున్నాయి. నూతన సంవత్సరంలో పరిణామాలు చూస్తుంటే మరింత ప్రమాదం వైపు ప్రపంచం పయనిస్తున్నదనిపిస్తున్నది. అన్నీ మంచి శకునములు అనిపించడంతో కొత్త సంవత్సరం మొదటి రోజు అన్ని దేశాల స్టాక్ మార్కెట్ ఇండెక్స్‌లు దూసుకువెళ్లాయి. మన నిఫ్టీ ఏకంగా కొత్త రికార్డు సృష్టించింది. వెనిజులా ఉదంతంతో పరిణామాలు తారుమారు అయాయి.

# బయటపడ్డ ఉగ్ర బంధం

పాకిస్థాన్ మరోసారి ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారుతోందన్న వాదనలకు బలం చేకూరుస్తూ ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్‌కు చెందిన సీనియర్ కమాండర్ ఒకరు, పాకిస్థాన్‌లో నిషేధిత ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) నేతలతో కలిసి ఒకే వేదికను పంచుకున్నారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ బహిరంగ సభకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు ఇప్పుడు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. ఈ వీడియోలలో కనిపించిన వ్యక్తిని హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్‌గా గుర్తించారు. లష్కరే తోయిబాకు రాజకీయ ముసుగుగా భావించే పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఘటనపై ఉగ్రవాద నిరోధక నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హమాస్, లష్కరే తోయిబా నేతలు కలిసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు పెను ముప్పుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం గానీ, సైన్యం గానీ



ఇంతవరకు స్పందించలేదు. ఇటీవల కాలంలో హమాస్ పాకిస్థాన్‌లో తన ఉనికిని పెంచుకుంటోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది కూడా నాజీ జహీర్.. జైషే మహ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా వంటి ఉగ్రసంస్థల కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నాడు.

**గాజా పేరుతో నిధుల సేకరణ**

మరోవైపు, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని అడ్డం పెట్టుకుని పాకిస్థాన్‌లోని జైషే మహ్మద్, లష్కరే తోయిబా వంటి ఉగ్రసంస్థలు భారీగా నిధులు సేకరిస్తున్నాయని ఏథెన్స్‌కు చెందిన 'జియోపొలిటికో' అనే సంస్థ తన నివేదికలో వెల్లడించింది. గాజాకు మానవతా సహాయం అనే పేరుతో ఈ నిధుల సేకరణ జరుగుతోందని, వీటిని భారత్‌పై ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అంతర్జాతీయ ఆర్థిక పర్యవేక్షక సంస్థ ఎఫ్ఏటీఎఫ్ నిఘానుంచి తప్పించుకునేందుకు ఈ ఉగ్రసంస్థలు తమ పంథా మార్చుకున్నాయి. బ్యాంకు ఖాతాలకు బదులుగా నేరుగా డిజిటల్ వాలెట్లలోకి నిధులు సేకరిస్తున్నాయి. జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుమారుడు హమ్మద్ అజార్, సోదరుడు తల్హా అల్-సైఫ్ ఈ నిధుల సేకరణ కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తున్నారని ఆ నివేదిక పేర్కొంది. ఈ పరిణామాలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# చరిత్రపై దాడులకు ప్రతీకారం తీర్చుకోవాలి

**న్యూఢిల్లీ:** దేశ చరిత్రలో గతంలో ఎన్నో దాడులు, అణిచివేతలు జరిగాయని, వాటికి ప్రతీకారం తీర్చుకోవాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ అన్నారు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని, ప్రతీకారం మంచిదే అయినా దానిని ప్రేరణ శక్తిగా మలుచుకోవాలని సూచించారు. ఇందుకోసం దేశ సైనిక, ఆర్థిక పాటవం, సామాజిక భద్రతను బలోపేతం చేసుకోవాలని అన్నారు. మన పూర్వీకులు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారని, ఎన్నో పరీక్షలు, కష్టనష్టాలను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు, ధీరత్వం పుణికిపుచ్చుకోవాలన్నారు. ఢిల్లీలో శనివారంనాడు జరిగిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో యువతను ఉద్దేశించి అజిత్ డోభాల్ మాట్లాడారు.

'మీరు అదృష్టవంతులు, ఇండిపెండెంట్ ఇండియాలో మీరు పుట్టారు. భారతదేశం వలసవాదుల గుప్పిట్లో ఉన్నప్పుడు నేను పుట్టాను' అని 81 ఏళ్ల డోభాల్ అన్నారు. దేశవ్యాప్తంగా 3,000 మంది యువ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భగత్‌సింగ్‌ను ఉరి తీశారని, సుభాష్ చంద్రబోస్




తన జీవితాంతం కష్టపడ్డారని, స్వాతంత్ర్య సముపార్జన కోసం మహాత్మాగాంధీ సత్యాగ్రహం చేశారని డోభాల్ అన్నారు. ప్రపంచంలో జరిగిన దాడులు, యుద్ధాలకు కొన్ని దేశాలు తమ ఇష్టారీతిగా బలప్రయోగానికి దిగడమే కారణమని అన్నారు. 'మీరు శక్తిమంతులైతేనే స్వేచ్ఛగా మనగలుగుతారు. ఆత్మవిశ్వాసం లేకుండా ఎంత శక్తి ఉన్నా, ఆయుధ సంపత్తి ఉన్నా వృథా. అలాంటి గొప్ప నాయకులు మనకు ఉండటం మనం చేసుకున్న అదృష్టం' అని డోభాల్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. ఆయన పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణ మన అందరికీ స్ఫూర్తి అని డోభాల్ అన్నారు. నాయకత్వం గొప్పతనాన్ని వివరిస్తూ నెపోలియన్ అన్న మాటలను ఆయన గుర్తుచేశారు. ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు కూడా తాను భయపడనని, కానీ ఒక సింహం నాయకత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతానని నెపోలియన్ చెప్పేవారని అన్నారు. మనది ప్రగతిశీల సమాజమని, మనం ఇతరుల నాగరికత, ఆలయాలపై దాడులు చేయమని అన్నారు. భారతదేశంపై గతంలో జరిగిన దాడులను ప్రస్తావిస్తూ, ఈ దాడుల్లో లెక్కకుమించి ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, వేలాది ఆలయాలు ధ్వంసమయ్యాయని, గ్రామాలను దోచుకున్నారనీ, మన నాగరికతను అణిచివేశారని అన్నారు. చరిత్ర మనకు సవాళ్లు విసురుతోందన్నారు. అయితే ఇందుకు తగిన ఫైర్ ఇవాల్టి యువతలో ఉందన్నారు. ప్రతీకారం అనేది మంచి పదం కానప్పటికీ, అది శక్తిమంతమైనదని అన్నారు. దేశం కోసం మనం ప్రతీకారం తీర్చుకోవాలి, అందుకోసం విలువలతో కూడిన సమున్నత భారతదేశాన్ని పునర్నిర్మించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

# స్వదేశీ వస్తువులను, మాతృభాషను ప్రజలు ప్రోత్సహించాలి

స్వదేశీ వస్తువులకు, మాతృభాషకు ఉన్న ఔనత్యాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ మరోసారి నొక్కిచెప్పారు. ప్రజలు స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని, అలాగే ఇంట్లో మాతృభాషలోనే మాట్లాడాలని కోరారు. మనం ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే, ఆత్మనిర్భర్ ఏకైక మార్గమని అన్నారు. అయితే దాన్ని విజయవంతం చేయాడానికి ఏకైక మార్గం స్వదేశీ తెలిపారు. 2047 నాటికి భారత్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని, స్వదేశీ వస్తువులను తయారు చేయడానికి వ్యాపారులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం రాజస్థాన్ జోధ్‌పుర్‌లో జరిగిన మహేశ్వరి గ్లోబల్ కన్వెన్షన్‌లో ఆయన ప్రసంగించారు.

"మనం అన్ని రకాల భాషలను నేర్చుకోవాలి, ఇది పురోగతికి అవసరం. కానీ మనం మన మాతృభాషను మర్చిపోకూడదు. తల్లిదండ్రులు తమ పిల్లలతో మాతృభాషలోనే మాట్లాడాలి. భారత సంస్కృతి, చరిత్ర గురించి వారికి తెలియజేయాలి. మాతృభాషతో పాటు అన్ని భాషలను నేర్చుకోవాలి. మహేశ్వరి సమాజానికి చెందిన దాతల జాబితా చాలా పెద్దది. దేశానికి అవసరమైనప్పుడల్లా దోహదపడిన సమాజం. వారు ఉద్యోగ అన్వేషకులు కాదు, ఉద్యోగ సృష్టికర్తలు. స్వాతంత్ర్యం తర్వాత రామాలయ ఉద్యమంలో ప్రాణాలను త్యాగం చేసిన మొదటి ఇద్దరు సోదరులు మహేశ్వరులు అనే వాస్తవం నుంచి సాంస్కృతిక పునరుజ్జీవనానికి వారి సహకారం ప్రాముఖ్యతను అంచనా వేయవచ్చు."

ఈ సందర్భంగా అమిత్ షా ఒక స్టాంపును కూడా విడుదల చేశారు. అందరం ఐక్యతతో ముందుకు నడవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ రాష్ట్ర పురోగతికి సమాజం చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. భారత్ పెద్ద ఎత్తున జరిగే సామాజిక వర్గాల సమావేశాలు దేశాన్ని విడదీయవని, పైగా అవి దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయని కేంద్ర



హోంమంత్రి అమిత్ షా అన్నారు. అన్ని వర్గాలు స్వయం సమృద్ధి సాధించినప్పుడే దేశ స్వావలంబన సాధ్యమన్నారు. "కొందరు తమకు తామే ప్రగతిశీలవాదులమని చెప్పుకునేవారు, 'మహేశ్వరి ఎక్స్‌పో' లాంటి పెద్ద ఎత్తున జరిగే సామాజిక సమావేశాలను విమర్శిస్తుంటారు. వ్యక్తిగతంగా నేను కూడా అలాంటి విమర్శలను చాలా ఎదుర్కొన్నాను. కానీ నా నమ్మకం ఏమిటంటే, ఇలాంటి సామాజిక నిర్మాణాలు భారత్‌ను మరింత బలపరుస్తాయే కానీ, ఏనాడూ విడదీయవు. ప్రతి సామాజిక వర్గం తమలోని అణగారిన వర్గాల సంక్షేమం, భద్రత పట్ల బాధ్యత తీసుకుంటే, దేశం మొత్తానికి మేలు జరుగుతుంది."

దేశానికి స్వతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' ఉత్సవాలు జరుపుకున్నాం. ఈ ఉత్సవాల వెనుక 4 ప్రధాన లక్ష్యాలు ఉన్నాయని అమిత్ షా పేర్కొన్నారు. అవి: ఒకటి 1857 నుంచి 1947 వరకు జరిగిన స్వాతంత్ర్య సంగ్రామం గురించి యువతకు తెలియజేయడం. రెండోది గత 75 ఏళ్లలో దేశం సాధించిన అద్భుత విజయాలను వివరించడం, మూడోది 140 కోట్ల భారతీయుల్లో జాతీయ భావాన్ని, భారతీయతను బలోపేతం చేయడం. నాలుగోది 2047 ఆగస్టు 15 నాటికి, భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి ప్రపంచంలోని అన్ని రంగాల్లో భారత్ అగ్రస్థానంలో నిలవాలనే ప్రధాని మోదీ సంకల్పాన్ని నెరవేర్చడం. ఇక చివరిగా సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలి. అప్పుడే 2047 నాటికి భారత్ ప్రతి రంగంలోనూ, ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మారుతుందని అమిత్ షా పేర్కొన్నారు.

# చైనా, పాక్‌కు చెక్

మరో నేవీ బేస్ (నౌకాదళ స్థావరం) ఏర్పాటు చేసేందుకు భారత నౌకాదళం సిద్ధమైంది. పొరుగునే ఉండి, ప్రమాదకరం గా మారుతున్న చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ కు చెక్ పెట్టే ఉద్దేశంతో కొత్త నేవీ బేస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పశ్చిమ బెంగాల్ తీరం, బంగాళాఖాతంలోని, హల్దియాలో కొత్త నేవీ బేస్ ఏర్పాటు చేయాలని ఇండియన్ నేవీ భావిస్తోంది. ఇక్కడ స్వల్ప స్థాయి యుద్ధ నౌకల్ని మోహరించ నుంది. దీని ద్వారా భారత తీర రక్షణ దళం మరింత బలపడనుంది. కొత్తగా ఏర్పాటు కానున్న నేవీ బేస్.. ఇప్పటికే అక్కడ ఉన్న డాక్ కాంప్లెక్స్ కు ఉపయోగపడుతుంది. అది కూడా తక్కువ స్థాయి నిర్మాణాలు, నౌకల ద్వారా త్వరగా సేవలందించేందుకు వీలవుతుంది. ఇక్కడ ఫాస్ట్ ఇంటర్ సెప్టార్ క్రాఫ్ట్, 300 టన్నుల న్యూ వాటర్ జెట్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్ వంటివి నిలిపేందుకు వీలుంటుంది. 40-50 నాట్ల వేగంతో వచ్చే నౌకల్ని కూడా నిలిపి ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తారు. అలాగే, ఆధునిక గన్స్, ఆయుధాలు ఉంచేందుకు అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో హిందూ మహా సముద్రం, బంగాళాఖాతంలో చైనా నేవీ దూకుడు చర్యలకు దిగుతోంది. అలాగే బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాట్లు కూడా జరుగుతున్నాయి. దీంతో సముద్ర జలాల్లో ట్రాఫిక్ పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త బేస్ భారత నౌకదళానికి అదనపు బలంగా మారుతుంది. ఇక్కడ వంద మంది



వరకు నేవీ ఆఫీసర్లు, నావికా సిబ్బంది పని చేస్తారు. ఇది కోల్ కతాకు దాదాపు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది.

## హైవే.. రద్దీ

విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. అయితే సాధారణంగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు 1 గంటలో చేరుకోవచ్చు. కానీ గత ఏడాది సంక్రాంతి సమయంలో భోగి ముందు రోజు 3-4 గంటల సమయం పట్టింది. అంతకు 2 రోజుల ముందు కూడా చాలా సమయం పట్టింది. ఇవాల్టి నుంచే సెలవులు ప్రారంభమవుతుండటంతో ఈ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. మరోవైపు జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరం నుంచి తమ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడే బదులు దానికి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం.

**ఈ మార్గాల్లో వెళ్తే సులువుగా :**

హైదరాబాద్ నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నార్కట్‌పల్లి వరకు వెళ్లి, అద్దంకి నేషనల్ హైవేపై నుంచి వెళ్తుంటారు. ఒకవేళ వీరు విజయవాడ హైవే మీదుగా వస్తే హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజా వద్ద రద్దీలో చిక్కుకొనే అవకాశం ఉంటుంది. ఈ నార్కట్‌పల్లి మీదుగా వెళ్లడం వల్ల పదుల కిలోమీటర్లు దూరం పెరిగినా, హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే మీదుగా వెళ్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. అలాగే ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలనుకునే వారు బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకొని నాగార్జునసాగర్ హైవేపైకి వెళ్తే సరిపోతుంది.

హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లే వారు ఓఆర్ఆర్ పైకి వెళ్లి ఘట్‌కేసర్‌లో ఎగ్జిట్ తీసుకొని వరంగల్ హైవేలోకి ప్రవేశించొచ్చు. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ వైపు నుంచి కూడా నేరుగా భువనగిరికి చేరుకోవచ్చు.

ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. నార్కట్‌పల్లి దాటితే వీరికి ట్రాఫిక్ తిప్పలు తప్పినట్లే.

చౌటుప్పల్‌లో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. ఆరోజు చౌటుప్పల్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. పండగ వేళ ఈ ట్రాఫిక్ బాధలు తప్పాలంటే ఇలా కొత్త మార్గాల్లో వెళ్లడం ద్వారా ప్రయాణం సాఫీగా సాగుతుంది.

శుక్రవారం సాయంత్రమే మొదలైన రద్దీ : శుక్రవారం సాయంత్రం నుంచి హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. ఈ రోజు నుంచి విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో సంక్రాంతి సంబురాలను సొంత ఊళ్లోలకు జరుపుకునేందుకు పల్లెకు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో వాహనాలకు అంతరాయం కలగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు.

కిటకిటలాడుతున్న బస్టాండ్లు : హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం నుంచి ఎంజీబీఎస్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీ నగర్ బస్టాండ్లు రద్దీతో కిటకిటలాడుతున్నాయి. సొంతూళ్లకు వెళ్తున్న వారితో బస్సులు నిండిపోయాయి. రద్దీకి అనుగుణంగా టీజీఎస్ ఆర్టీసీ అదనపు బస్సులు నడుపుతున్నా సరిపోవడం లేదు. ఇలా ఒక్కసారిగా రద్దీ పెరగడంతో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక ప్రైవేట్ వెహికల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. వారు ఇదే అదునుగా టికెట్ ధరలను డబుల్ చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## ఏదో ఒకరోజు 'హిజాబ్' ధరించిన మహిళే ప్రధాని అవుతుంది

"ఏదో ఒక రోజు హిజాబ్ ధరించిన మహిళ కచ్చితంగా భారతదేశానికి ప్రధానమంత్రి అవుతుంది. ఇది నా కల" అని ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మహారాష్ట్ర లోని షోలాపుర్‌లో శుక్రవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసం గించారు. భారత రాజ్యాంగం



కల్పించిన సమానత్వాన్ని, సమ్మిళితత్వాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ఎవరినైనా అత్యున్నత పదవిలో కూర్చోబెడు తుందని, మతంతో సంబంధం లేకుండా ఎవరైనా ప్రధాని కావచ్చని ఆయన ఉద్ఘాటించా రు. అయితే ఒవైసీ వ్యాఖ్యలపై బీజేపీ, శివసేన నేతలు తీవ్రస్థాయిలో ౦ండిపడ్డారు.

**పాకిస్థాన్‌తో పోలిక**

ఒవైసీ తన ప్రసంగంలో పొరుగు దేశం పాకిస్థాన్ రాజ్యాంగంతో భారత రాజ్యాంగాన్ని పోల్చి మాట్లాడారు. "పాకిస్థాన్ రాజ్యాంగం ప్రకారం, కేవలం ఒక మతానికి చెందిన వ్యక్తి మాత్రమే ఆ దేశానికి ప్రధాని కాగలరు. కానీ అంబేద్కర్ రాసిన మన రాజ్యాంగం అలా కాదు. భారతదేశంలో ఏ పౌరుడైనా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మేయర్ కావచ్చు. అందుకే ఏదో ఒక రోజు హిజాబ్ కట్టుకున్న మా ఆడబిడ్డ ఈ దేశానికి ప్రధాని అవుతుందని నేను నమ్ముతున్నాను" అని ఒవైసీ అన్నారు.

**ప్రేమ గెలుస్తుంది**

ముస్లింలపై జరుగుతున్న విద్వేష ప్రచారంపైనా ఒవైసీ స్పందించారు. "ముస్లింలపై మీరు చిమ్ముతున్న విషం ఎక్కువ కాలం సాగదు. విద్వేషాన్ని వ్యాప్తి చేసే వారి అంతం త్వరలోనే చూస్తాం. ఏదో ఒక రోజు ప్రేమ సాధారణమవుతుంది. అప్పుడు ప్రజలకు అర్థమవుతుంది, తమ మెదళ్లను ఎలా విషపూరితం చేశారో వారు గ్రహిస్తారు" అని వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్‌పైనా ఫైర్**

ఇదే సభలో మాజీ కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం, కాంగ్రెస్ పార్టీపై కూడా ఒవైసీ విరుచుకుపడ్డారు. ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లకు బెయిల్ రాకపోవడానికి కాంగ్రెస్ తెచ్చిన చట్టాలే కారణమని ఆరోపించారు. "కాంగ్రెస్ హయాంలోనే యుఏపీఏ చట్టాన్ని కఠినతరం చేశారు. ఉగ్రవాదం నిర్వచనాన్ని మార్చింది మీరే. ఆనాడు నేను చెప్పాను, ఈ చట్టం దుర్వినియోగం అవుతుందని హెచ్చరించాను. ఈరోజు అదే చట్టం వల్ల ఇద్దరు యువకులు ఐదేళ్లుగా జైల్లో మగ్గుతున్నారు. వారికి బెయిల్ రావడం లేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ కాంగ్రెస్ నాయకుడైనా ఐదేళ్లు జైల్లో ఉన్నారా?" అని ప్రశ్నించారు.

**హిమంత కౌంటర్**

ఒవైసీ వ్యాఖ్యలపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తనదైన శైలిలో స్పందించారు."రాజ్యాంగపరంగా ఎవరికీ అడ్డంకి లేదు. ఎవరైనా ప్రధానమంత్రి కావచ్చు. కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి. భారతదేశం హిందూ నాగరికత కలిగిన దేశం. మేము ఎప్పుడూ ఒకటే నమ్ముతాం. భారత ప్రధానమంత్రి ఎప్పుడూ ఒక హిందువే అయి ఉంటారు. దీనిపై మాకు పూర్తి విశ్వాసం ఉంది" అని హిమంత బిశ్వ శర్మ తేల్చిచెప్పారు.

**మీ పార్టీ అధ్యక్షురాలిని చేయగలరా? - బీజేపీ**

ఒవైసీ వ్యాఖ్యలకు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా గట్టి కౌంటర్ ఇచ్చారు. "రాజ్యాంగం ఎవరినీ అడ్డుకోదు. హిజాబ్ ధరించిన వారు కూడా ప్రధాని కావొచ్చు. కానీ మియాన్ ఒవైసీ, మీకు నేను ఒక సవాల్ విసురుతున్నా. ముందుగా ఒక 'పస్మాండా' ముస్లిం మహిళను లేదా హిజాబ్ ధరించిన మహిళను మీ పార్టీ అధ్యక్షురాలిగా చేయండి. దేశం గురించి తర్వాత మాట్లాడుదురు గాని, ముందు మీ పార్టీలో ఆ పని చేసి చూపించండి" అని 'ఎక్స్' వేదికగా ఎద్దేవా చేశారు.

**పీఎం పోస్ట్ ఖాళీ లేదు - శివసేన**

శివసేన అధికార ప్రతినిధి షైనా ఎన్‌సీ కూడా ఒవైసీకి చురకలు అంటించారు. "ప్రస్తుతానికి ప్రధానమంత్రి కుర్చీ ఖాళీగా లేదు. నరేంద్ర మోదీ ప్రజాదరణ ఏంటో అందరికీ తెలుసు. ముందు మీ ఎంపీలను గెలిపించుకోండి. ఆ తర్వాత ప్రధాని పదవి గురించి కలలు కనండి. భవిష్యత్తులో మహిళా ప్రధానిని మేము కూడా కోరుకుంటాం. కానీ అది కులం, మతం, వస్త్రధారణ ఆధారంగా కాదు, కేవలం ప్రతిభ ఆధారంగా ఉండాలి" అని ఆమె స్పష్టం చేశారు.

# భూ భారతి పేరుతో ఏజెంట్ల దందా..

-మొదటిపేజీ తరువాయి

స్లాట్ బుకింగ్ ఏజెంట్లు అక్రమ దందాకు తెరలేపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. భూముల క్రయవిక్రయాలు జరగాలంటే మొదటగా తమకు అనుకూలమైన తేదీలో స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ స్లాట్‌లను సొంతంగానూ చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ, చాలా మందికి అవగాహన లేకపోవడంతో డాక్యుమెంట్ రైటర్లను, మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తుంటారు. వీరు స్లాట్ బుక్ చేసి డాక్యుమెంట్ ఫైల్ తయారు చేసి తహసీల్దార్ వద్దకు పంపిస్తారు. తహసీల్దార్ దీనిని పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. కాగా, ఈ పనికి మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రూ.200 చొప్పున తీసుకోవాల్సి ఉంటుంది. కొన్ని చోట్ల మీసేవా కేంద్రాల్లో జీఎస్టీ, ఇతర ట్యాక్స్‌ల పేరుతో రూ.300 వరకు తీసుకుంటుండగా ప్రైవేటుగా పెట్టుకున్న స్లాట్ బుకింగ్ కేంద్రాల నిర్వాహకులు మాత్రం రూ.1000 నుంచి రూ. 1500 పైనే తీసుకుంటున్నారన్న ప్రచారం ఉంది.

**రశీదుల ఎడిటింగ్‌తోనూ మోసాలు..**

జిల్లాలో కొన్ని చోట్ల స్లాట్ బుకింగ్ ఏజెంటు చలాన్ రశీదులను ఎడిట్ చేసి ఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంపు డ్యూటీకి సంబంధించిన ప్రింట్ అవుట్ తీసిన తర్వాత ఉదాహరణకు దానిపై రూ.10వేలు ఉంటే దానిని స్కాన్ చేసి రూ.20వేలుగా మార్చి తిరిగి ప్రింట్ తీసి ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీల ఛార్జీలపై పూర్తిగా అవగాహన లేని వారి విషయంలో ఈ విధంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. దీనితో పాటు ఆధార్ కార్డులో తప్పిదాలున్నాయని, వాటిని సరిచేయాలంటే ఎక్కువ డబ్బులు కావాలంటూ అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో కొన్ని చోట్ల తహసీల్దార్ల పేర్లు చెప్పి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారి స్లాట్ బుక్ అయితే ఆ రోజుకు రిజిస్ట్రేషన్ జరగాల్సిందే. లేనిపక్షంలో స్లాట్ రద్దవుతుంది. స్లాట్ రద్దు అయితే ఒకసారి చెల్లించిన రిజిస్ట్రేషన్ చార్జీలు తిరిగి రావు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు క్రయ విక్రయదారులను భయపెట్టి మరీ అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ ఆగుతుందన్న భయంతో అడిగినంత ఇస్తున్నారన్న ప్రచారం ఉంది. ఒక్కో డాక్యుమెంట్ బయటకు రావాలంటే కొందరు ఏకంగా రూ.3000 వరకు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**అధికారుల అండతోనే దందా?**

జిల్లాలో ఆయా మండలాల తహసీల్దార్లు, అధికారుల అండతోనే స్లాట్ బుకింగ్ ఏజెంట్ల దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్లాట్ బుకింగ్ ఏజెంట్ల ద్వారా వెళ్తేనే రిజిస్ట్రేషన్ సాఫీగా జరుగుతుందన్న ప్రచారం ఉంది. పాసు పుస్తకాల్లో తప్పిదాలు, సరైన పత్రాలు లేకపోవడం వంటి కారణాలను చూపుతూ చేసిన వసూళ్లలో అధికారులకు సైతం వాటాలు పోతున్నాయన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మీసేవా కేంద్రాల్లో అదనపు వసూళ్లపై అధికారుల పర్యవేక్షణ ఉండగా ప్రైవేటు స్లాట్ బుకింగ్ ఏజెంట్లపై పూర్తిగా లేదు. వీరిపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో వీరు ఆడిందే ఆటగా సాగిందన్న చర్చ జరుగుతోంది. జిల్లాలో భూ భారతి పోర్టల్ ద్వారా జరిగిన స్కామ్ బయటపడడంతో స్లాట్ బుకింగ్ కేంద్రాల్లో అధిక వసూళ్లపై కూడా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. కాగా.. స్లాట్ బుకింగ్ కేంద్రాల్లో అధిక వసూళ్ల వ్యవహారంపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను వివరణ కోరగా.. అధిక వసూళ్లు చేసినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

-మొదటిపేజీ తరువాయి

పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

**బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ముఖ్యమైన అంశాలు:**

తెలంగాణ ప్రభుత్వం తరపున, నా తరపున.. రాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ఒక దేశం కేంద్ర–రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బడ్జెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నేను నమ్ముతున్నాను.

2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నాను.

ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం.

మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము.

మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది.

రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి.

రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము.

విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఖీ=దీవీ పరిమితుల నుంచి మినహాయించాలి.

తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము.

కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము.

ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది.

దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.

తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము.

హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి.

విద్య: హైదరాబాద్‌లో ××వీ ఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి.

**విమానాశ్రయాలు:** పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి.

**పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం :** దీనిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి.

**ఇతర నిధులు:** మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలి.

సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ఆ ఐదుగురు ఎవరు...

**హైదరాబాద్ :** తెలంగాణ క్యాబినెట్లో..ఇప్పుడు ఒకటే చర్చ. అమాత్యులపై ఆరోపణలు..వివాదాలతో..ఎవరి సీటుకు ఎసరు వస్తుందనేది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటిదాకా ఖాళీగా ఉన్న రెండు బెర్తులపైనే ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలకు..ఇప్పుడు ఖాళీ కాబోయే బెర్తులూ కూడా ఊరిస్తున్నాయట. దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్ మంత్రి ఓ మహిళా అధికారితో నడిపిన..నడుపుతున్న వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎక్కడ చూసినా ఆ మంత్రెవరు..? ఆ అధికారెవరన్న చర్చే. ఆయన తెరచాటు వ్యవహారాలు..సర్కార్‌కు బ్యాడ్ నేమ్ తెచ్చిపెడుతున్నాయట. సదరు మంత్రి కారణంగా ఇద్దరు మహిళా అధికారుల బదిలీలు కూడా జరిగాయటపార్టీలో అందరికన్నా తానే సీనియర్ అని చెప్పుకునే ఆ సదరు అమాత్యుల వారికి సంబంధించిన పూర్తి డేటా..ఇంటలిజెన్స్ రిపోర్టు ఢిల్లీకి కూడా చేరిపోయిందట. దీంతో గత అసెంబ్లీ సమావేశాల్లో ఒంటికాలిపై లేచిన ఆ అమాత్యుడు..ఈ సెషన్‌లో పూర్తిగా సైలెంట్ అయిపోయారట. ఈ నేపథ్యంలోనే ఆయన కుర్చీకి ఎసరు తప్పదనే ప్రచారం జరుగుతోంది.ఇక దక్షిణ తెలంగాణకే చెందిన మరో సీనియర్ మంత్రిది ఇదే పరిస్థితి అంటున్నారు. ఎన్నికల ముందే హస్తం గూటికి చేరి..ఇప్పుడు అమాత్యులుగా ఉన్న ఆ మంత్రిగారికి కూడా ఉద్వాసన తప్పదంటున్నారు. ఆర్టీఐ ద్వారా తన శాఖలోని అధికారుల దందాలను ఆ మంత్రే బయట పెట్టడమే కారణమనే టాక్ నడుస్తోంది. వీరిద్దరూ తెలంగాణ ఉద్యమానికి తామే బ్రాండ్ అంబాసిడర్లం అని కూడా చెప్పుకునే నేతలే కావడం మరో విశేషం.ఇక మరో ఉత్తర తెలంగాణ మంత్రిది ఇంకో కథ. హైదరాబాద్‌లో అంతా తానై చక్రం తిప్పుతున్న సదరు మంత్రి చేష్టలు..సర్కార్‌కు హెడెక్‌గా మారాయట. మహిళా అధికారులు, నేతలతో జోక్‌లు..వింత పలుకులతో ఆయన తీరు చర్చనీయాంశంగా మారిందంటున్నారు. సదరు మంత్రి తీరుపై ఇప్పటికే కొందరు అధికారులు.. సీఎంవో దృష్టికి తీసుకెళ్లారట. ఇది చాలదన్నట్లు.. ఇటీవల ఒకరిద్దరు మహిళా జర్నలిస్ట్‌లతో కూడా ఆయన సన్నిహితంగా ఉంటూ..వాట్సప్ కాల్స్..ఇన్‌స్టాలో మెస్సేజ్‌లు పెడుతూ టీనేజర్‌గా మారిపోయారన్న గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారంతో సదరు అమాత్యులవారికి ఉద్వాసన తప్పదన్న గుసగుసలు సెక్రటేరియట్లో రచ్చ రంబోలా చేస్తున్నాయి. ఇంకో సీనియర్ మంత్రిపై కూడా?చిలిపి చేష్టలు, కరప్షన్ అలిగేషన్స్‌తో గందరగోళం నెలకొందట. సమైఖ్య రాష్ట్రంలోనే..సీనియర్ మోస్ట్ నేతగా ఉన్న ఆయనకు ఓ టైప్ ఆఫ్ డ్యాషింగ్ లీడర్‌గా పేరుంది. ఈ సదరు మంత్రితో సూటిగా మాట్లాడాలంటే..అధికారులే కాదు..తోటి లీడర్స్ కూడా జంకుతుంటారు. తన అనుకున్న వారిపై ట్రాన్స్‌ఫర్స్ గాలి సోకకుండా.. ప్రొటెక్టర్‌గా ఉంటుంటడం వెనుక ఏవో మతలబులున్నాయనే టాక్ నడుస్తోంది. అవినీతి ఆరోపణలు పెరిగిపోవడంతో ఆయనపై కూడా రిపోర్టులు రెడీ అయ్యాయని తెలుస్తోంది.ఉత్తర తెంగాణకు చెందిన మరో సీనియర్ మహిళా మంత్రి పదవి కూడా..క్యాబినెట్ విస్తరణలో గల్లంతు అవడం పక్కా అంటున్నారు. సర్కార్ ఏర్పడిన కొత్తలో ఈ సీనియర్ మంత్రి నోటి మాటతో రేవంత్ సర్కార్‌కు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడగా..తన ఇంటి మనిషి అవినీతి వ్యవహారాన్ని వెనుకేసుకుని రావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అది ఇప్పటికీ విపక్షాలకు అస్త్రంగా ఉంటూనే వస్తోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఆ మహిళా మంత్రిని క్యాబినెట్ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు మహిళా మంత్రికి విస్తరణ మాట వింటే చాలు కంటి మీద కునుకు రావడం లేదట.ఐదుగురు మంత్రులకు ఉద్వాసన పలికితే..అప్పుడు కేబినెట్ లో ఖాళీ బెర్తుల సంఖ్య ఆరుకు చేరనుంది. అటు అజారుద్దీన్ స్థానం కూడా ఊగిసలాటలోనే ఉండటంతో కేబినెట్ లో బెర్తుల కోసం దాదాపు డజన్ మంది కాపు కాసుకుని కూర్చున్నారట. ఇప్పటికే ఈ లిస్ట్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు తొలిసారి ఎన్నికై అసెంబ్లీ లోపలా, బయట.. ఫైర్ బ్రాండ్ లీడర్లుగా ఎస్టాబ్లిష్ అవుతున్న మరికొందరు యువ ఎమ్మెల్యేలకు కూడా అదృష్టం కలిసి రావచ్చని టాక్ నడుస్తోంది.

# అఘోరీ ఆదాయం 30 వేల రూపాయిలు

**హైదరాబాద్ :** శవ్యాప్తంగా సంచలనం రేపిన 'అఘోరీ శ్రీనివాస్' ని అంత తేలికగా మర్చిపోగలమా?..మగవాడు అయినప్పటికీ లేడీ అఘోరీ గా మారి, మాయ మాటలు చెప్పి, అమాయకులను మోసం చేసి కోట్ల రూపాయిల సంపాదన అతి తక్కువ సమయం లోనే సంపాదించాడు. అంతే కాదు, ఇతను ఆడవాళ్లను లొంగదీసుకోవడం లో కూడా నేర్పరి. శ్రీ వర్షిణి అనే అందమైన అమ్మాయిని మాయ మాటలు చెప్పి తన వెంట తిరిగేలా చేసాడు. రెండు నెలల పాటు ఆ అమ్మాయి అతనితో కలిసి ప్రయాణం చేసింది. కుటుంబ సభ్యులు వర్షిణి కోసం వెతకాని ప్రదేశం అంటూ లేదు. అంతలా మాయ చేసి తన వెంట తీసుకొని వెళ్ళిపోయాడు. అయితే ఎట్టకేలకు అఘోరి శ్రీనివాస్ దుర్మార్గాలను గమనించిన పోలీసులు అతన్ని అదుపులో తీసుకున్నారు. అయితే రెండు నెలల పాటు అతనితో కలిసి తిరిగి శ్రీ వర్షిణి అనే అమ్మాయి, రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ ఇంటర్వ్యూ లో ఆమె మాట్లాడిన మాటలు చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. ఆమె మాట్లాడుతూ 'రెండు నెలల పాటు నేను



అతనితోనే ఉన్నాను. దేవాలయాలకు బాగా తిప్పేవాడు, అక్కడ ప్రసాదాలు తీసుకోవడం, పడుకోవాలని అనుకుంటే ఎక్కడైనా పెట్రోల్ బంక్ వద్ద కారు ఆపేసి నిద్రపోవడం వంటివి చేసేవాడు. మంచి ఫేమ్ ఉన్న వ్యక్తి కాబట్టి, భక్తులు ఆయన కారు స్టిక్కరింగ్ ని చూసే వచ్చేవాళ్ళు. ఒక్కొక్కరు 500 , లేదా వెయ్యి రూపాయిలు ఇవ్వడం, కారు కి పెట్రోల్ ఫుల్ ట్యాంక్ చేయించడం, ఫుడ్ తినిపించడం, ఖరీదైన బట్టలు పెట్టడం వంటివి చేసేవారు. అలా రోడ్డు మీద వెళు _న్న సమయం లో అతనికి ఎవరో ఒకరు ఎంతో కొంత డబ్బులు ఇస్తూనే ఉండేవాళ్ళు. అలా రోజుకి అతను పాతిక నుండి 30 వేల రూపాయిలు సంపాదించేవాడు. పెట్రోల్ ఫ్రీనే, డబ్బు ఫ్రీనే, ఆహారం ఫ్రీనే, ఇంకేమి ఉంది చల్లగా ంఅ పెట్టుకొని పాడుకోవడమే అతను చేసే పని' అంటూ చెప్పుకొచ్చింది. ఇంత జరుగుతుంటే మీకు అతన్ని ఎప్పుడు ప్రశ్నించాలని అనిపించలేదా అని యాంకర్ అడిగిన ప్రశ్నకు, వర్షిణి సమాధానం చెప్తూ 'ఆశ్రమాన్ని నిర్మించాలని అనేవాడు. నేను అతన్ని అప్పట్లో గుడ్డిగా నమ్మేసాను, ఒక ట్రాన్స్ లోకి వెళ్ళిపోయాను. అతనే లోకం అంటూ తిరిగాను కదా, అందుకే అన్నీ నమ్మేదాన్ని' అంటూ చెప్పుకొచ్చింది. మీ కుటుంబ సభ్యులు నిన్ను అతి కష్టం మీద వెతికి మూడు వారాల తర్వాత ఇంటికి తిరిగి తీసుకొచ్చారు కదా, అప్పుడు మళ్ళీ మీరెందుకు పారిపోయారు అని యాంకర్ అడగ్గా 'దాదాపుగా పారిపోయాను అనే అనుకోండి, కానీ మధ్యలో కొంతమంది ఉన్నారు. వాళ్ళ వల్లే నేను వెళ్లాల్సి వచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది.

## పురపాలక ఎన్నికలపై ప్రధాన పార్టీల ఫోకస్

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పురపాలక, కార్పొరేషన్ల కమిషనర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన తుది ఓటర్ల జాబితా, 13న పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదా జాబితాను ప్రచురించి, వాటిని ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టి–పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని రాణి కుముదిని ఆదేశించారు. 16వ తేదీన పోలింగ్ స్టేషన్ల వివరాలతో పాటు ఫొటోతో కూడిన ఓటర్ల తుది జాబితా ఆయా వార్డుల్లోని పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రచురించాలని ఆమె సూచించారు.

మరోవైపు పురపాలిక ఎన్నికలపై ప్రధాన పార్టీలు గురి పెట్టాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను విశ్లేషించుకున్న ఆయా పార్టీల నాయకులు పుర బరిలో సమర్థులను నిలిపేందుకు సమాయత్తమవుతున్నారు. ఎలాగైనా అధ్యక్ష పీఠం దక్కించుకోవాలని వ్యూహాలు రచిస్తున్నాయి. ఇందుకోసం పార్టీలో మంచి పేరు, వ్యక్తిత్వం కలిగిన వారిని ఎంపిక చేసే పనిలో ఆయా పార్టీల నాయకులు బిజీగా ఉన్నారు. పార్టీ బలం కొంత తోడైతే వ్యక్తిగతం కలిసి వస్తే గెలుపునకు బాటలు పడతాయని చాలా మంది భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే పార్టీ సమావేశాలను నిర్వహిస్తూ ఆశావహుల అభిప్రాయాలను కోరుతున్నాయి. ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటే పట్టణ ప్రాంతాలపై మరింత పట్టు ఉంటుందని, రానున్న ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు అవకాశముంటుందని నాయకులు చెబుతున్నారు.

**ఖర్చుల విషయంలో :** ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు మిగతా సభ్యుల ఎన్నికకు కొంత ఆర్థికంగా సాయపడాలని చెబుతుండడంతో ఆశావహుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు మారుతోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీగా సమావేశాలు నిర్వహిస్తూ తమ నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నాయి. పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో బీజేపీ పట్టు లేకపోవడంతో తాండూరు, వికారాబాద్ ప్రాంతాల్లో కనీసం కొన్ని వార్డు స్థానాల్లోనైనా పోటీ చేయాలని ప్రణాళిక రచిస్తోంది. ఎవరికి వారు ఖర్చులు పెట్టుకుంటే భారం ఉండదని భావిస్తున్నప్పటికీ ఛైర్మన్ పదవి ఎంపిక విషయంలో తేడాలొస్తే ఇబ్బందికరమని అంతర్గతంగా ఆలోచనలో పడ్డారు.

**రంగంలోకి తాజా మాజీలు :** ఎన్నికల రంగంలోకి తాజా మాజీలు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం రిజర్వేషన్ల పరిస్థితి ఎలా ఉంటుందోనని వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏ ప్రాంతంలో తమకు అనుకూల ఓటర్లు ఉన్నారు అనే దానిపై ఆరా తీస్తున్నారు. ఎక్కడ అవకాశం వచ్చినా పోటీకి సై అనే విధంగా సిద్ధమవుతున్నారు.

**భిన్న ఫలితాలతో మరింత అప్రమత్తం :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో పలు మండలాల్లో భిన్నమైన ఫలితాలొచ్చాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఈసారి అభ్యర్థులను ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. కౌన్సిలర్ అభ్యర్థులు అన్ని స్థానాల్లో విజయం సాధించడంతోపాటు ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ఎమ్మెల్యేలు బుయ్యని మనోహర్‌రెడ్డి, తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ నాయకులను పిలుపునిచ్చారు.

## మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు

-మొదటిపేజీ తరువాయి

శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నించారాయన. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు మహేశ్ కుమార్ గౌడ్.

**శ్వేతపత్రం విడుదల చేయాలి..**

'కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణా యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలి. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తాం, పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు గెలిచాం. కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచాం. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోంది. పేర్లు మార్చడం వల్ల ప్రజలకు వచ్చేదేమీ లేదు. పేర్ల మార్పునకు ముందు ఆయా జిల్లాలకు ఏమేం చేశారో చెప్పాలి. ప్రజల దృష్టి మళ్లించేందుకే పేరు మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారు' అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## కవితను టార్గెట్ చేసిన కేటీఆర్ టీమ్



**హైదరాబాద్ :** శాసనమండలిలో మొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భావోద్వేగంతో మాట్లాడింది కదా.. తమ కుటుంబ దైవం లక్ష్మీనరసింహస్వామి, తన ఇద్దరు కొడుకుల పై ఒట్టు వేసి.. తనది ఆస్తికోసం పోరాటం కాదని.. ఆత్మగౌరవం కోసం పోరాటమని చెప్పింది కదా.. పదేళ్లలో ఏం పీకి కట్టలు కట్టిన మని జాతీయస్థాయికి పోయినమని.. తన తండ్రి పరిపాలనను ఉద్దేశించి విమర్శించింది కదా.. ఇక ఎప్పుడైతే కవిత ఆ మాటలు మాట్లాడిందో.. అప్పటినుంచి కేటీఆర్ కాంపౌండ్ లో పనిచేసే వ్యక్తులు రెచ్చిపోవడం మొదలుపెట్టారు.సోషల్ మీడియాలో కవితను ఉద్దేశించి పిచ్చిపిచ్చిగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అసలు ఆమె ఉంటే ఎంత.. చస్తే ఎంత అన్నట్టుగా పోస్టులు పెడుతున్నారు. వాస్తవానికి ఇటీవల కాలంలో కవిత మీద కాంగ్రెస్ పార్టీ కంటే, కాషాయం పార్టీ కంటే గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియానే యుద్ధం చేస్తోంది. కవిత వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా పోస్టులు పెడుతోంది. ఇక కిరాయి యూట్యూబ్ ఛానల్స్ అయితే పిచ్చిపిచ్చిగా వార్తలను ప్రసారం చేస్తున్నాయి. కెసిఆర్ లాంటి మహానుభావుడి కడుపులో కవిత అనవసరంగా పుట్టిందని.. ఇప్పుడు తండ్రికి తలంపులు తెచ్చే దుర్మార్గానికి శ్రీకారం చుట్టిందని ఆరోపిస్తున్నారు. చెత్త అని, చెదలు అని, కేసుల మాఫీ కోసం కాంగ్రెస్ పార్టీ, బిజెపి నాయకులతో చేయి కలిపిందని ఆరోపిస్తున్నారు.త్వరలో కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతుందని.. ఇప్పటికే రేవంత్ రెడ్డి తో మంతనాలు జరిపిందని.. అందువల్లే భారత రాష్ట్ర సమితి మీద తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తోందని.. కొంతమంది నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక మిగతా నాయకులైతే కవితను దారుణంగా తిడుతున్నారు. సోషల్ మీడియాలో.. ప్రధాన మీడియాలో కవితను ప్రశ్నిస్తూ గులాబీ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారంటే వారు ఏ స్థాయిలో అసహనంతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి కవిత లేవనెత్తుతున్నది తనకు జరిగిన అన్యాయం పైన.. తనది ఆస్తుల కోసం పోరాటం కాదని చెబుతూనే ఉంది. అలాంటప్పుడు కేటీఆర్ అనుకూల వ్యక్తులు ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం ఏంటి. కవిత సంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత అయితే కేసీఆర్ లేకుంటే కేటీఆర్ మీద ఉంటుంది. మధ్యలో ఈ కిరాయి యూట్యూబర్లకు ఏం అవసరం. ఈరోజు బిస్కెట్లు పడేస్తున్నారు కాబట్టి కుక్కల మాదిరిగా తోకలు

ఊపుతారు. ఆ తదుపరి ఏం చేస్తారని కవిత వర్గం నాయకులు ప్రశ్నిస్తున్నారు.కవిత కూడా తన సోషల్ మీడియాను బలోపేతం చేసింది. ట్విట్టర్లో కవితక్క అప్డేట్స్ పేరుతో ఒక ఎకౌంటు ఓపెన్ అయింది. అందులో ప్రధానంగా సంతోష్ రావు చేసిన అక్రమాలు.. హరీష్ రావు చేసిన దుర్మార్గాలు ప్రస్తావిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి అధికారంలో 10 సంవత్సరాలలో తెలంగాణలో ఏం జరిగింది.. ఏ పథకంలో ఎంత నొక్కారు.. అనే విషయాలను కవితక్క అప్డేట్స్ అనే అకౌంట్ ద్వారా బయటపెడుతున్నారు. దీంతో గులాబీ పార్టీకి. ఆ పార్టీ అనుకూల కిరాయి సోషల్ మీడియాకు బలమైన సమాధానం చెబుతున్నారు. త్వరలో కవిత రాజకీయ పార్టీ పెడుతుంది కాబట్టి.. అది కూడా లాంచనమే కాబట్టి.. కవితక్క వర్సెస్ గులాబీ పార్టీ అన్నట్టుగా పొలిటికల్ వ్యవహారం సాగుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# శక్తి తరగకుండా ఉండాలంటే ఈ డైట్ పాటించండి!



నలభై ఏళ్లు దాటిన మహిళల శరీరంలో అనేక ముఖ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. హార్మోన్ల సమతుల్యతలో మార్పులు, జీవక్రియ (మెటబాలిజం) మందగించడం, ఎముకల సాంద్రత తగ్గడం వంటి కారణాల వల్ల గతంలో ఉన్నంత ఉత్సాహం, శక్తి తరచుగా తగ్గిపోతుంటాయి. ఎంత సమయానికి తింటున్నా కొన్నిసార్లు నీరసం, అలసట చుట్టుముట్టవచ్చు. ఈ దశలో, కేవలం ఆహారం తీసుకోవడం సరిపోదు. శరీరానికి తగిన పోషకాలు అంది, శక్తిని కాపాడుకోవడానికి సమతుల్యమైన (బ్యాలెన్స్డ్) ఆహార విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. నిపుణులు కూడా దీనినే గట్టిగా సూచిస్తున్నారు. శరీరానికి అవసరమైన అన్ని రకాల విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా అందాలంటే, ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వివిధ రంగుల్లో ఉండే పండ్లు, ఆకుకూరలు యాంటీఆక్సిడెంట్లను అందించి కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ముఖ్యంగా, ఎముకల బలం కోసం కాల్షియం, విటమిన్ డి అవసరం. వీటితో పాటు రక్తహీనతను నివారించేందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను కూడా డైట్‌లో చేర్చుకోవాలి. ఈ పవర్‌హౌస్ లాంటి ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. 40 ఏళ్లు పైబడిన తర్వాత, కండరాల క్షీణతను నివారించడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం తప్పనిసరి. అందుకే, ఆహారంలో పాల ఉత్పత్తులు (పాలు, పెరుగు, పన్నీర్), అలాగే మాంసాహారం, గుడ్లు వంటి వాటిని తగిన మోతాదులో చేర్చుకోవాలి. పాల ఉత్పత్తులు కాల్షియంను అందిస్తే, మాంసాహారం, గుడ్లు నాణ్యమైన ప్రోటీన్‌ను అందిస్తాయి. శాఖాహారులు పప్పులు, చిక్కుళ్లు, సోయా వంటి వాటిని తీసుకోవడం ద్వారా ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవచ్చు. ఈ కీలకమైన పోషకాలు శరీరాన్ని దృఢంగా ఉంచి, రోజంతా శక్తివంతంగా ఉండేలా చేస్తాయి. శక్తి స్థాయిలను మెరుగుపరచుకోవడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పీచు పదార్థాలు (ఫైబర్) ఉన్న ఆహారాన్ని డైట్‌లో పెంచాలి. తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని నివారిస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా, ఎంత మంచి ఆహారం తీసుకున్నా, శరీరం హైడ్రేటెడ్‌గా (సరిపడా నీటితో) ఉండటం చాలా అవసరం. అందుకే, తరచుగా, సరిపడా నీటిని తాగాలి. తగినంత నీరు తాగడం వల్ల నీరసం తగ్గుతుంది, జీవక్రియ సక్రమంగా పనిచేస్తుంది. ఈ మార్పులను పాటించడం ద్వారా 40 ప్లస్ మహిళలు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండగలుగుతారు.

# పాదాల తిమ్మిర్లు ఉంటే అనారోగ్యానికి సంకేతం

పాదాల వాపులు వస్తున్నాయంటే తప్పనిసరిగా జాగ్రత్తపడాల్సి ఉంటుంది. నిజానికి చాలా మంది ఈ లక్షణాలను పెద్దగా పట్టించుకోరు. వాపులు, తిమ్మిర్లు తగ్గడానికి తాత్కాలికంగా మందులు వేసుకుని అక్కడితో వదిలేస్తారు. కానీ ఈ చిన్న సమస్యలే చాలా పెద్ద ముప్పుగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే..వీలైనంత త్వరగా స్పందించాలి. మరి ఇలా పాదాల్లో జరిగే మార్పులు ఏయే రోగాలకు సంకేతాలు.

పాదాల ఆరోగ్యాన్ని చాలా మంది పట్టించుకోరు. నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇవే క్రమంగా పెద్దవై ముప్పు తెచ్చి పెడతాయి. చర్మం రంగు మారడం నుంచి తిమ్మిర్లు ఎక్కడం వరకూ ఎన్నో రకాలుగా సమస్యలు వస్తాయి. నడిచేటప్పుడు కూడా ఈ మార్పులు స్పష్టంగా కనబడతాయి. అలాంటప్పుడే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించడం మంచిది. ఏ మాత్రం ఆలస్యం చేసినా కండీషన్ సీరియస్ అయ్యే ముప్పు ఉంటుంది. నిజానికి పాదాల్లో ఇలాంటి మార్పులు వస్తున్నాయంటే ఎన్నో తీవ్ర అనారోగ్యాలకు ఇవి సంకేతాలు కావచ్చు అని పలు అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. ముఖ్యంగా దయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలు ఇదే విధంగా ఉంటాయి. పాదాల్లో మంట, కురుపులు రావడం లాంటి లక్షణాలు రక్త సరఫరా సరిగ్గా లేనప్పుడు కనబడతాయి. ముఖ్యంగా నరాలు డ్యామేజ్ అయినప్పుడు కూడా పాదాల్లో ఇలాంటి మార్పులు కనిపించే అవకాశాలున్నాయి. ఇలాంటప్పుడు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.



పాదాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చినప్పుడు కూడా రంగు మారేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాపులను మాత్రం తప్పనిసరిగా గమనించాలి. ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినప్పుడు, వీటి ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు ఇలా పాదాల్లో వాపులు వస్తాయి. సరైన సమయానికి సరైన వైద్యం అందించకపోతే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. తరచూ తిమ్మిరిగా ఉండడం, దురద లాంటి లక్షణాలు కనిపించాయంటే అది దయాబెటిస్ లక్షణం కావచ్చు. లేదా నరం డ్యామేజ్ అయినప్పుడు కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ అసలు కంట్రోల్ లో లేనప్పుడు ఇలా జరుగుతుంది. నరాలు ఒత్తిడికి గురైనప్పుడు లేదా ఇంకేదైనా న్యూరో సమస్యలు తలెత్తినప్పుడు ఇలా పాదాల్లో తిమ్మిర్లు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే..ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు చాలా త్వరగా స్పందించాల్సి ఉంటుంది. లేదంటే ఈ సమస్య కాస్త తీవ్ర ఇన్ఫెక్షన్ కి దారి తీసే ప్రమాదం ఉంది. పాదాల్లో విపరీతమైన నొప్పి, వాపులు వస్తుంటాయి. పాదాలు చాలా బరువెక్కినట్టుగా అనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపించాయంటే గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు లెక్క. దీన్నే ఎడిమా అంటారు. ముఖ్యంగా హార్ట్ ఫెయిల్యూర్ కండీషన్స్ లో ఈ సమస్య తలెత్తుతుంది. గుండె కండరాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ఇలాగే పాదాల్లో వాపులు కనిపిస్తాయి. పాదాల్లో ఎక్కువగా కదలికలు వచ్చే కొద్దీ ఈ వాపులు ఎక్కువవుతుంటాయి. ఎక్కువ సమయం పాటు నిలబడినా, ఎక్కువ సేపు కూర్చున్నా వాపులు మరీ ఎక్కువవుతాయి. ఇలాంటి సమయంలో సరైన చికిత్స తీసుకోకపోతే లక్షణాలు మరీ తీవ్రమవుతాయి. పాదాలపై చర్మం పొడిగా మారడం, చర్మం రంగు మారిపోవడం లాంటి లక్షణాలు కనబడతాయి. ఏదైనా గాయం అయినప్పుడు ఎక్కువ రోజుల పాటు మానకుండా అలాగే ఉన్నా అది దయాబెటిస్ లక్షణం కావచ్చు. కొన్ని సార్లు ఈ అల్సర్స్ చాలా తీవ్రమవుతాయి. త్వరగా చికిత్స తీసుకుంటే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

# గంధం ఆ చర్మ సమస్యలకు వరం..



ఆయుర్వేదంలో గంధాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. మొఖంపై మొటిమలను నివారించడానికి, తళతళ మెరిసేందుకు గంధాన్ని ఉపయోగిస్తారు. గంధం పొడి, పేస్ట్ లేదా నూనె రూపంలో ఉపయోగించవచ్చు. ఈ ప్రకృతి సహజసిద్ధమైన పదార్థం చర్మాన్ని సంరక్షించి మెరిసేలా చేస్తుందని నిపుణులు అంటుంటారు. ఈ గంధం ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మొటిమలను దూరం చేస్తుంది: గంధం చర్మ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. చర్మాన్ని అలర్జీల నుంచి రక్షించి మొటిమలను దూరం చేస్తుంది. ఒక టీస్పూన్ గంధం నూనె, చిటికెడు పసుపు, కర్పూరం కలిపి ముఖానికి ప్యాక్ లాగా రాసుకోవాలి. రాత్రాంత అలాగే ఉంచి ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేస్తే మొటిమలు, నల్లమచ్చలు పోతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది: తేలికపాటి ఎక్స్‌ఫోలియేటింగ్ లక్షణాల వల్ల చందనం.. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. ఇది మీ చర్మంపై నల్ల మచ్చలను పోగొట్టడానికి సహాయపడుతుంది. టాన్ తొలగించడానికి ఇది సమర్థవంతమైనది. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ గంధం పొడి, కొబ్బరి నూనె కలపాలి. దీన్ని ముఖానికి పూసుకుని.. మసాజ్ చేసి రాత్రంతా అలాగే ఉంచాలి. డార్క్ స్పాట్స్ వదిలించుకోవడానికి, రెగ్యులర్ టాన్ పొందడానికి దీన్ని రెగ్యులర్‌గా ఉపయోగిస్తే మచ్చలు పోయి.. ముఖం తళతళ మెరుస్తుంది. వృద్ధాప్యానికి చెక్: గంధపు చెక్కలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఇది చర్మ ముడుతలను నివారించి వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. దీంతోపాటు చర్మాన్ని కాంతివంతంగా యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. దీని కోసం, 2 టేబుల్ స్పూన్ల ముల్తానీ మట్టి, 2 టేబుల్ స్పూన్ల గంధం కలపి రాయాలి. 15-20 నిమిషాలు అలాగే ఉంచి నీటితో కడిగితే చాలు. పొడి చర్మం నివారణ: చాలా మంది పొడి, నిర్జీవమైన చర్మంతో బాధపడుతుంటారు. అలాంటివారు చందనం ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల పొడి, నిర్జీవమైన చర్మానికి చెక్ పెట్టవచ్చు. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ పాలపొడి, కొన్ని చుక్కల గంధం నూనె, రోజ్ వాటర్ కలిపి ముఖానికి రాయాలి. 15 నిమిషాలు ఉంచి నీటితో కడిగితే చర్మం నిగారింపుగా మారుతుంది. జిడ్డుగల చర్మం: జిడ్డుగల చర్మంపై తరచుగా ధుమ్ము, ధూళి పేరుకుపోతుంది. అలాంటివారికి చందనం దివ్య ఔషధంలా పనిచేస్తుంది. ఒక గిన్నెలో అర టీస్పూన్ గంధం పొడి, కొంచెం టమోటా రసం, అర టీస్పూన్ ముల్తానీ మట్టి వేసి బాగా కలపాలి. ఈ పేస్ట్‌ని ముఖంపై పూసుకొని..15 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం మెరుస్తూ ఉంటుంది.

# మిగిలిన అన్నం లాభాలు తెలిస్తే నోరెళ్లబెడతారు!



చద్దన్నం (చలి అన్నం లేదా మిగిలిపోయిన అన్నం) తినడం చాలా మందికి ఇష్టం ఉండదు. కొందరు చద్దన్నాన్ని ఇష్టంగా తింటే మరికొంత మంది మాత్రం అస్సలే దానిని తినడానికి ఆసక్తి చూపరు. కానీ చద్దన్నం తినడం వలన కూడా బోలెడు లాభాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. భారతీయుల్లో చాలా మంది తమ ఇంట్లో అప్పటికప్పుడు వండిన వేడి వేడి అన్నం తినడానికే ఎక్కువ ఇంట్రస్ట్ చూపిస్తుంటారు. ఎందుకంటే ఇది రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి మంచిది. అయితే వేడి వేడి అన్నమే కాదండోయ్, మిగిలిపోయిన అన్నం తినడం వలన కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయంట. చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఎలా అంటే? బియ్యాన్ని ఉడికించి, దానిని చల్లబరిచినప్పుడు అందులో ఉండే కొంత పిండి పదార్థం, స్టార్చ్ రిట్రోగ్రేడేషన్ అనే ప్రక్రియ ద్వారా నిరోధక పిండి పదార్థంగా మారి, జీర్ణక్రియ నిరోధకతను కలిగి ఉంటుందంట. అందువలన ఇది రక్తంలోకి గ్లూకోజ్‌ను చాలా మెల్లగా విడుదల చేయడం వలన అప్పటికప్పుడు వండిన అన్నం కంటే, చలి అన్నం తినడం వలన దయాబెటీస్ కంట్రోల్‌లో ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. దీనిపై పరిశోధకులు తాజాగా ఓ సర్వే కూడా జరపగా, చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తున్నట్లు వారు కనుగొన్నారు. 15 మంది ఆరోగ్యకరమైన పెద్ద వారిని తీసుకొని, తెల్ల బియ్యాన్ని ఉడికించి, 4ీ%జ% వద్ద 24 గంటలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచి, ఆపై మళ్లీ వేడి చేసి తినడం వలన, అప్పటికప్పుడే వండి తినే అన్నం కంటే, చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గేలా చేసిందంట. అందువలన చద్దన్నం తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా ఇది ప్రీ బయోటిక్‌గా పని చేయడమే కాకుండా, గట్ బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. పెద్ద పేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అదే విధంగా ఇన్సులిన్ సెన్సిటివిటీకి సంబంధించిన హార్మోన్స్‌ను ప్రభావితం చేస్తుందంట. ఆకలిని తగ్గించి, పొట్టలోని బ్యాడ్ కొలెస్ట్రాల్ తగ్గేలా చేస్తుంది. బరువు తగ్గాలి అనుకునే వారికి, మధుమేహం సమస్యతో బాధపడే వారికి ఇది మంచి ప్రయోజనం. చల్లగా మిగిలిపోయిన అన్నం తినడం మంచిది ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది, ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర పెరుగుదలను తగ్గించడంలో,కడుపు నిండిన అనుభూతిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

# తెల్లజుట్టు సమస్యకు వంటింటి చిట్కా

జుట్టు తెల్లబడటం అనేది నేటి కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని బాధిస్తున్న ఒక సాధారణ సమస్య. మార్కెట్లో లభించే రసాయనాలతో కూడిన ఉత్పత్తులు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తున్నప్పటికీ, వాటి దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఆందోళనలు ఉన్నాయి. అయితే, ఈ సమస్యకు మన వంటింట్లోనే ఒక అద్భుతమైన మరియు సహజసిద్ధమైన పరిష్కారం ఉందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అదే, సొరకాయ ఉపయోగించి తయారుచేసే ప్రత్యేకమైన నూనె. ఈ పురాతన చిట్కా జుట్టుకు పోషణనిచ్చి, దాని సహజసిద్ధమైన నలుపు రంగును తిరిగి తీసుకురావడానికి సహాయపడుతుంది. జుట్టు నల్లబడటానికి సొరకాయ నూనెను తయారుచేసే పద్ధతి చాలా సులభం. ముందుగా, సొరకాయను చిన్న ముక్కలుగా కత్తిరించుకోవాలి. ఈ ముక్కలను కనీసం వారం రోజుల పాటు బాగా ఎండబెట్టుకోవాలి. ఈ ప్రక్రియ వల్ల సొరకాయలోని తేమ పూర్తిగా తొలగిపోయి, దాని పోషక విలువలు నూనెలోకి చేరడానికి సిద్ధమవుతాయి. ఇలా ఎండిన ముక్కలను ఒక మందపాటి పాత్రలో తీసుకోవాలి. తరువాత, ఈ ఎండిన సొరకాయ ముక్కలకు సరిపడా మంచి నాణ్యత గల కొబ్బరి నూనెను (ఎఱతీస్త్రఱఅ జశీఔశీఅబ్ ాఱశ్రీను వాడటం ఉత్తమం) జోడించాలి. ఈ మిశ్రమాన్ని మంటపై ఉంచి, సొరకాయ ముక్కలు రంగు మారే వరకు లేదా ముక్కలు పూర్తిగా నూనెలో కలిసిపోయినట్లు అయ్యే వరకు తక్కువ మంటపై బాగా మరిగించాలి. ఇలా మరిగించడం వల్ల సొరకాయలోని కీలకమైన పోషకాలు మరియు సహజ వర్ణకాలు నూనెలోకి పూర్తిగా విడుదలవుతాయి. అనంతరం, ఆ నూనెను చల్లార్చి, ఒక శుభ్రమైన వడపోత గుడ్డ సహాయంతో వడబోసి, గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ ఇంట్లో తయారుచేసిన సొరకాయ నూనెను వారానికి కనీసం ఒకసారి తలకు పట్టించి, వేళ్ళతో



సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. రాత్రంతా ఉంచి, మరుసటి రోజు ఉదయం మైల్డ్ షాంపూతో తలస్నానం చేయడం వల్ల ఉత్తమ ఫలితం ఉంటుంది. ఇలా తరచుగా చేయడం వలన జుట్టు కుదుళ్ళు బలం పుంజుకుంటాయి, జుట్టు నల్లబడటం ప్రారంభమవుతుంది. రసాయనాలు లేని ఈ సహజసిద్ధమైన చికిత్స జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, తెల్లజుట్టు సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపడంలో సహాయపడుతుంది.

# ప్రేమాయణం కథనాలపై ఐఏఎస్ అధికారుల ఆగ్రహం

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో, అధికార వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న ఓ టీవీ వార్తా కథనంపై అటు ఐఏఎస్ అధికారుల సంఘం, ఇటు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రంగా స్పందించారు. ఒక రాష్ట్ర మంత్రికి , ఒక మహిళా ఐఏఎస్ అధికారికి మధ్య ప్రేమాయణం సాగుతోందంటూ ప్రముఖ వార్తా సంస్థ ప్రసారం చేసిన కథనంపై తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ మేరకు సంఘం ఒక బహిరంగ లేఖను విడుదల చేస్తూ, సదరు వార్తా సంస్థ యాజమాన్యం తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఎంతో కష్టపడి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన మహిళా అధికారుల పట్ల ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని, ఇది అత్యంత గర్హనీయమని సంఘం పేర్కొంది. మంత్రి సిఫార్సుతోనే సదరు మహిళా అధికారికి ప్రత్యేక పోస్టింగ్‌లు లభించాయన్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఐఏఎస్ అధికారుల సంఘం స్పష్టం చేసింది. అధికారుల బదిలీలు మరియు పోస్టింగ్‌లు పూర్తిగా పరిపాలనాపరమైన నిర్ణయాలని, వాటికి వ్యక్తిగత సంబంధాలను ఆపాదించడం జర్నలిజం నైతికతకే విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేసింది. నైతికత లేని ఇలాంటి జర్నలిజం వల్ల సివిల్ సర్వెంట్లకు మరియు సమాజానికి చెడ్డ పేరు వస్తుందని, వెంటనే ఆ కథనాన్ని వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని ఆ చానల్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఆరోపణలు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కూడా ఇబ్బంది పెట్టాయి. ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నన్ను ఏమైనా అనండి, నాపై రాజకీయ విమర్శలు చేయండి.. కానీ ఒక మహిళా అధికారిని ఈ వివాదంలోకి లాగి ఆమె పరువు తీయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారులను బదిలీ చేసే అధికారం కేవలం ముఖ్యమంత్రికి మాత్రమే ఉంటుందని గుర్తు చేస్తూ, తన కొడుకుని కోల్పోయిన బాధలో ఉన్న తనను , తన కుటుంబాన్ని ఇలాంటి అసత్య కథనాలతో మరింత వేదనకు గురిచేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారుతెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన చరిత్ర తనదని, అద్దె ఇంట్లో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న తనపై ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయడం దురదృష్టకరమని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయాను.. ఇప్పటికైనా ఇలాంటి రాతలు ఆపండి, పైన దేవుడు ఉన్నాడు అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన



ముఖ్యమంత్రిని కోరారు. ఈ వివాదం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

**వైరల్ కథనాలపై చర్యలు తప్పవు**

తెలంగాణలోని పలువురు ఐఏఎస్‌లపై వస్తున్న వార్తలను ఐఏఎస్‌ల అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. నిరాధారమైన వాటిని ప్రసారం చేయడం సరికాదని దీని వల్ల అధికారుల ఆత్మ గౌరవానికి భంగం వాటిల్లుతుందని అభిప్రాయపడింది. మహిళా అధికారుల పోస్టింగ్స్, వారి వ్యక్తిగత జీవితాలపై వస్తున్న కథనాలను పూర్తిగా ఖండిస్తున్నట్టు పేర్కొంది. ఇలాంటి వాటిని ప్రసారం చేసినవారిపై, సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం సర్క్యులేట్ అవుతున్న వాటిని తొలగించాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణారావు, కార్యదర్శి జయేష్ రంజన్ పేరుతో ఓ ప్రకటన విడుదలైంది. ఇందులో చాలా అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో ఐఏఎస్ అధికారులను టార్గెట్ చేస్తూ వస్తున్న వార్తలు తీవ్రంగా బాధిస్తున్నాయని వెల్లడించారు. అధికారుల వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చేస్తున్న తప్పుడు ప్రసారం కారణంగా ప్రజల్లో చులకనభావన ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అధికారుల పని తీరుపై కూడా ప్రభావం చూపుతుందనే ఆందోళన ఈ ప్రెస్‌నోట్‌లో కనిపిస్తోంది. మహిళా అధికారులను కావాలనే టార్గెట్ చేస్తున్నట్టు అనిపిస్తోందని ఇది మంచిది కాదని హితవుపలికారు. తమ విధి నిర్వాహణలో చాలా నిబద్ధతో పని చేస్తున్నారని ప్రజలకు మేలు చేయాలని ఆలోచనతో ఉన్నారని స్పష్టం చేశారు. అలాంటి వారిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ వార్తలు రాయడం , వార్టి పోస్టింగ్స్‌పై అపోహలు సృష్టించడం సరికాదన్నారు. ఇలాంటి వ్యక్తిగత ఉల్లంఘన కిందికి వస్తాయని హెచ్చరించారు. ఇందులో మహిళలను కించపరిచేలా నెరేషన్ ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటివి రాసేటప్పుడు వారి వాదన కూడా వినకుండానే ఇష్టం వచ్చినట్టు ప్రసారం చేస్తున్నారని దీన్ని అసోషియేషన్ ఖండిస్తుందని అన్నారు. ఇలాంటివి తప్పుడు వార్తల ప్రసారం చేయడం, వాటిని వైరల్ చేయడం వల్ల సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్తాయని అసోసియేషన్ అభిప్రాయపడింది. అందుకే వెంటనే వాటిని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఇప్పుడు ఈ కంటెంట్‌ను ప్రసారం చేసిన వారిపై, వైరల్ చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. న్యాయపోరాటం చేస్తామని అన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటివి ప్రసారం చేసిన వాళ్లు షేర్ చేసిన వాళ్లకు న్యాయపరమైన చిక్కులు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.

# రష్..రష్‌గా బస్టాండ్లు, రైల్వేస్టేషన్

**హైదరాబాద్ :** తెలుగు వారికి పెద్ద పండగ సంక్రాంతి. ఎంత దూరంలో ఉన్నాసరే సంక్రాంతికి ఊరు వెళ్లాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉంటుంది. అందుకే సొంతూళ్లకు బయల్దేరే వారితో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రోడ్లు జామ్ అయ్యాయి. బతుకుదెరువు కోసం వచ్చి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఏదో వాహనం పట్టుకొని ఊరికి వెళ్దామని బయల్దేరడంతో ఆర్టీసీ బస్‌లు, ట్రైన్స్, ప్రైవేటు వాహనాలు అన్నీ కూడా కిటకిటలాడుతున్నాయి. ఇలా పట్టణాల నుంచి పల్లెలకు వెళ్తున్న జనంతో రోడ్లు కిక్కిరిసి పోగా, రైల్వేస్టేషన్లు, బస్టాండ్, విమానాశ్రయాలు కూడా రద్దీగా మారాయి. ఏటా కనిపించిన దృశ్యాలే సీన్లే రిపీట్ అయ్యాయి. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో వాహనాలు బారులు తీరాయి. సంక్రాంతికి వెళ్లే వాహనాలతో టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్లు కొద్ది వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నా రద్దీని నియంత్రించడం అధికారుల వల్ల కాలేదు. టోల్ ప్లాజాల వద్దే కాకుండా హైదరాబాద్ శివారు ప్రాంతాలు, బెంగళూరు శివార్లలో ట్రాఫిక్ జామ్ జనాలకు చుక్కలు చూపిస్తోంది. ప్రస్తుతం ఈ ట్రాఫిక్ క్లియర్ అవ్వడానికి గంటల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి రద్దీని తట్టుకునేందుకు రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రెగ్యులర్‌గా నడిచే రైళ్లకు అదనంగా ట్రైన్స్ కలిపి మొత్తంగా 800లకుపైగా ట్రైన్స్‌ను నడుపుతోంది. వీటిలో కేవలం సంక్రాంతికి వెళ్లే వారి కోసమే 150కిపైగా ట్రైన్స్ రన్ చేస్తోంది. ఎన్ని ట్రైన్స్ నడుపుతున్నా ఊరికి వెళ్లే ప్రయాణికులకు మాత్రమే సీట్లు లభించడం లేదు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్లు పెట్టిన క్షణాల్లోనే ఫుల్ అవుతన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బెంగాల్, కర్ణాటక వెళ్లే ట్రైన్స్ కిటకిటలాడుతున్నాయి. ట్రైన్స్ ఏర్పాటు చేయడమే కాకుండా రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి తోడు ఆన్‌లైన్‌లో కూడా సాధారణ టికెట్ తీసుకునే ఫెసిలిటీ



తీసుకొచ్చింది రైల్వే శాఖ. వీటిపై రాయితీ కూడా ఇస్తోంది. ట్రైన్స్‌లో టికెట్ దొరకని వారు బస్‌లవైపు చూస్తున్నారు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రోడ్ రవాణా సంస్థలు ప్రత్యేక బస్‌లను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే తెలంగాణ ఎక్కువ స్పెషల్ బస్‌లను వేసింది. వాటికి స్పెషల్ ప్రైస్ పెట్టింది. ఆంధ్రప్రదేశ్ మాత్రం రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీస్‌లు నడుపుతోంది. గతంతో పోల్చుకుంటే ఈసారి ప్రత్యేక సర్వీస్‌లు ఎక్కువగా లేకపోవడంతో జనాలకు ప్రైవేటు ఆపరేటర్లు దిక్కు అయ్యారు. సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకొని సాధారణ ఛార్జీలే వసూలు చేయాలని ప్రైవేటు ఆపరేటర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా సరే ప్రైవేటు ఆపరేటర్లు మాత్రం ఇష్టం వచ్చిన ధరలకు టికెట్లు అమ్ముతున్నారు. రద్దీకి తగ్గట్టుగా అప్పటికప్పుడు రేట్లు ఫిక్స్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో రేటు తక్కువగా కనిపిస్తున్నా ఖాళీలు లేవన్నట్టు చూపిస్తున్నారు. సరే నేరుగా ఏదైనా బస్ దొరుకుతుందేమో అని చూస్తే అక్కడ కూడా భారీగా టికెట్ రేట్లు పెంచి అమ్ముతున్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రయత్నించి విఫలమైన మరికొందరు లాంగ్ డ్రైవ్ లాంటి యాప్ సహాయాన్ని తీసుకుంటున్నారు. అందులో వారం రోజులకు కార్లను బుక్ చేసుకుంటున్నారు. మరికొందరు షేరింగ్ ఫెసిలిటీ ఉందమో అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇలా ఏదో రకంగా ఊరుకు చేరిపోవాలని పండగను ఆనందంగా జరుపుకోవాలని చూస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం

**వనపర్తి :** నేడు ఇందిరమ్మ రాజ్యంలో సామాన్యులకు అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.ꣳఖీూ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. పెబ్బేరు మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డిలు.నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్క నిరుపేదకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెబ్బేరు పట్టణంలోని ౚ౽ఓ గార్డెన్స్ లో నిర్వహించిన మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పెబ్బేరు పట్టణంలోని 12 వార్డులకు సంబంధించిన నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ విజయభావుటను ఎగురవేయాలని వారు సూచించారు. చిన్న చిన్న మనస్పర్ధలతో ఎవరికివారు ముందుకెళ్తే నష్టపోతామని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని వారు సూచించారు. పొరపాటున ఎవరైనా గెలిస్తే వారు కుర్చీలో కూర్చొని ఉన్నప్పుడు మనం కిటికీలోంచి చూడాల్సిన పరిస్థితి వస్తుందని దానిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పెబ్బేరు మండలం ఆసియా ఖండంలోనే పేరెన్నిక మండలమని కోట్ల రూపాయల ఆదాయం వచ్చే సంత ఉందని అలాంటి సంతను కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కొందరి ప్రయత్నాలను తిప్పుకొట్టి త్వరలోనే తిప్పికొట్టి కోట్ల రూపాయ విలువచేసే సంతా భూమిని కాపాడుకుందామని వారు అన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో పెబ్బేరు మునిసిపాలిటీలోని 12 వార్డులకు 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయకేతనం ఎగురవేశాల అందరు కలిసికట్టుగా పని చేయాలని వారు సూచించారు.

## కేవలం సిఎం, సిఎస్ మాత్రమే అధికారులను మాత్రమే బదిలీ చేస్తారు

**టిక్కెట్ల ధరల పెంపు సంబంధించి ఏ ఫైల్ తన వద్దకు రాలేదు**

**బెనిఫిట్ షోల కోసం తనను ఎవరూ సంప్రదించలేదు**

**కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని మంత్రి కోమటిరెడ్డి హితవు**

**హైదరాబాద్ :** కేవలం సిఎం,సిఎస్ మాత్రమే అధికారులను మాత్రమే బదిలీ చేస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... మహిళా ఐఎస్ఎస్ పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత నల్గొండకు నలుగురు కలెక్టర్ల మారారని, తన జిల్లాలోనే కాదు..మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే బదిలీలు జరుగుతాయని తెలియజేశారు. మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని కోమటి రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్ల బదిలీలు, పదోన్నతులు సర్వసాధారణం అని.. అధికారుల మీద అభాండాలు వేయటం సరికాదని అన్నారు. రేటింగ్ లు, వ్యూస్ కోసం దుష్ప్రచారం సరికాదని, అధికారుల కుటుంబాల గౌరవం గురించి కూడా ఆలోచించాలని సూచించారు. సినిమా పరిశ్రమపై ఇంకా దృష్టి పెట్టలేదని, పుష్ప సినిమా తర్వాత బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు ఉండదని చెప్పానని అన్నారు. బెనిఫిట్ షోలు, టికెట్ల పెంపు కోసం తన వద్దకు రావొద్దని చెప్పానని, సినీ పరిశ్రమ గురించి పట్టించుకోవడం మానేశానని, టిక్కెట్ల ధరల పెంపు సంబంధించి ఏ ఫైల్ తన వద్దకు రాలేదని చెప్పారు. బెనిఫిట్ షోల కోసం తనను ఎవరూ సంప్రదించలేదని, సంధ్య థియేటర్ బాధిత కుటుంబానికి రూ. 25 లక్షలు అందించానని తెలియజేశారు. బాధిత బాలుడిని చదివిస్తానని చెప్పానని, చిత్ర పరిశ్రమ సమస్యల కంటే ప్రజల సంక్షేమం, అభివృద్ధి పనులే తనకు ప్రాధాన్యత ఇచ్చానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

## క్యాసారం కల్వర్ట్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం

**సంగారెడ్డి :** పటాన్ చెరు నియోజకవర్గం లోని గ్రామాలు, పట్టణాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు మండలం క్యాసారం గ్రామంలో 30 లక్షల రూపాయలతో చేపట్టనున్న కల్వర్టు నిర్మాణ పనులకు, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారం గ్రామంలో 20 లక్షల రూపాయల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో చేపటనున్న అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.

## యాదవులు రాజకీయంతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలి

**వనపర్తి :** సర్వ అధికారాలు రాష్ట్రపతి తర్వాత సర్పంచులకే.....ప్రతి యాదవ సర్పంచ్ సీఎం స్థాయికి ఎదగాలి. యాదవులు రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా గొర్రెల పెంపకదారుల సహకార సంఘం మాజీ చైర్మన్ పెండెం కురుమూర్తి యాదవ్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాములు యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవులు కోరారు, వనపర్తి జిల్లాలోని 14 మండలాలలోని అన్ని గ్రామ పంచాయతీ యాదవుల సర్పంచులకు, ఉపసర్పంచులకు సన్మాన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని కొత్తకోట మండల కేంద్రం సమీపంలో గల శ్రీకృష్ణ దేవాలయం ఆవరణంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏవి ఏర్పడిన యాదవులు పెద్ద సంఖ్యలో గెలవాలని వారు కోరారు, సర్పంచ్ పదవి అంటే గ్రామానికి ప్రథమ పౌరుడు అని రాష్ట్రపతికి ఉన్న అధికారాలు సర్పంచ్కు ఉంటాయని వారన్నారు, ప్రభుత్వాలు ఏవి ఉన్న సర్పంచ్లు మాత్రం అధిక సంఖ్యలో గెలవాలని యాదవ అభివృద్ధి పథకాల సాధన కోసం తమ వంతు కృషి చేసుకోవాలని వారు కోరారు, గతంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో యాదవ జాతి అభివృద్ధికి పాటుపడ్డారని అదే తరహాలో కాంగ్రెస్ పార్టీలో ఉండే ప్రజాప్రతినిధులు కూడా యాదవుల అభివృద్ధి కోసం కృషి చేయాలని వారు కోరారు, యాదవులు జిల్లాలో దాదాపు 24 శాతం ఉన్నారని యాదవులు ఓటు వేసే యంత్రాలు కాదని ప్రజా ప్రతినిధిలుగా గెలిచే ఆయుధాలుగా ఉండాలని వారు కోరారు, జిల్లాలో ఉండే సర్పంచులు ఉపసర్పంచులు ఒకే చోటకు చేరుకొని పండగ వాతావరణం లో ఘన సన్మానం చేసుకోవడం హర్షించదగా విషయమని వారన్నారు, వనపర్తి కి చెందిన సామాజిక సేవ వేత్త వాగ్దేవి జూనియర్ కళాశాల, యజమాని ౚం ꣳజ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యాదవులకు భోజన వసతి సర్పంచి ఉప సర్పంచ్ కు శాలువాలు, డైరీలు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, ప్రజలు, శ్రీకృష్ణ కమిటీ సభ్యులు, జిల్లాలోని 14 మండలంలోని గ్రామపంచాయతీ సర్పంచులు ఉపసర్పంచ్ లతోపాటు పెద్ద సంఖ్యల వార్డు మెంబర్లు పాల్గొన్నారు

## బెట్టింగ్ ఎస్ఐ అరెస్ట్.

**హైదరాబాద్ :** సమాజంలో శాంతిభద్రతలను కాపాడవలసిన చేతులే నేరాలకు పాల్పడితే. రక్షణ కవచమే భక్షిస్తే ఏమవుతుందో అంబర్‌పేట ఎస్సై భాను ప్రకాష్ రెడ్డి ఉదయం నిరూపిస్తుంది. ఒక బాధ్యతాయుతమైన పోలీసు అధికారిగా ఉండి, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన స్థానంలో కూర్చొని, స్వయంగా దొంగతనాలకు, అక్రమాలకు పాల్పడి నేడు చంచల్‌గూడ జైలు ఊచలు లెక్క పెడుతున్న పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లోనే సంచలనంగా మారింది. ఈ కేసులో వెలుగు చూస్తున్న నిజాలు పోలీసు శాఖను సైతం విస్మయానికి గురి చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో కీలకమైన అంశం బెట్టింగ్. భాను ప్రకాష్ రెడ్డి గత కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైనట్టు ప్రాథమిక విచారణలో తేలింది. జూదం కారణంగా చేసిన అప్పులు తీర్చుకోవడానికి ఆయన ఒక అత్యంత దారుణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. వివిధ కేసుల్లో పోలీసులు రికవరీ చేసిన నగదు, బంగారాన్ని బాధితులకు లేదా కోర్టుకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ ఆయన తన సొంతానికి వాడుకున్నాడు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయకుండా లేదా తప్పుడు లెక్కలు చూపిస్తూ, వాటిని బయట తాకట్టు పెట్టి, అప్పులు తీర్చుకోవడానికి ప్రయత్నించాడు. రక్షక భటుడు దొంగగా మారిన ఈ తీరుపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. భాను ప్రకాష్ రెడ్డిపై ఉన్న మరో ప్రధాన ఆరోపణ సర్వీస్ రివాల్వర్ అదృశ్యం. పోలీసులకు ప్రభుత్వం ఇచ్చే ఆయుధం అత్యంత పవిత్రమైంది. బాధ్యతాయుతమైంది. అయితే తన రివాల్వర్‌ను భాను ప్రకాష్ రెడ్డి పోగొట్టుకున్నాడు. ఇది పోలీసుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. మొదట పోలీసు విచారణలో ఆయన పరస్పర విరుద్ధమైన స్టేట్‌మెంట్‌లు ఇచ్చినట్టు తెలుస్తోంది. రైలులో ప్రయాణిస్తున్న సమయంలో తన గన్ ఎక్కడో పడిపోయిందని ఆయన అధికారులకు చెప్పాడు. అయితే ఆ గన్ కోసం ఎంత వెతికినా ఆ ఆచూకీ లభించలేదని ఆయన స్వయంగా అంగీకరించాడు. అసలు ఆ గన్ నిజంగానే పోయిందా, లేదా దాన్ని కూడా ఎక్కడైనా తాకట్టు పెట్టారా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల విచారణలో భాను ప్రకాష్ రెడ్డి అక్రమాలు ఆధారాలతో నిరూపణ అయ్యింది. దీంతో వెంటనే పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అత్యంత విషాదకరమైన, విస్మయకరమైన మలుపు ఆయన కెరీర్, భాను ప్రకాష్ రెడ్డి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన గ్రూప్ -2 పరీక్షలల్లో ఉత్తీర్ణత సాధించి, మంచి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తెలంగాణ పోలీసు శాఖ నుంచి రిలీవ్ అయి, ఏపీలో కొత్త హోదాలో చేరాలని ఆయన ఇప్పటికే ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఒక గౌరవప్రదమైన హోదా నుంచి అంతకంటే మెరుగైన హోదాలోకి వెళ్లాల్సిన వ్యక్తి కేవలం బెట్టింగ్ వ్యసనం వల్ల జీవితాన్ని చేతులారా నాశనం చేసుకున్నాడు. ఇప్పుడు అరెస్టు కావడంతో ఆయన కొత్త ఉద్యోగం వచ్చే అవకాశం దాదాపుగా మూసుకుపోయినట్టే.

# బిజినెస్

## అమెరికాకు ఏడీహెచ్‌డీ మాత్రలు: గ్రాన్యూల్స్

**దిల్లీ:** అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) చికిత్సలో ఉపయోగించే జనరిక్ యాంఫిటమైన్ ఎక్స్‌టెండెడ్ రిలీజ్ మాత్రలకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ నుంచి తాత్కాలిక అనుమతులు దక్కినట్లు గ్రాన్యూల్స్ ఇండియా తెలిపింది. తన అనుబంధ సంస్థ గ్రాన్యూల్స్ ఫార్మాస్యూటికల్స్‌కు 180 రోజుల మార్కెటింగ్ ఎక్స్‌క్లూజివిటీ అర్హతను యూఎస్ఎఫ్‌డీఏ ఇచ్చిందని కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు. 5 ఎంజీ, 10 ఎంజీ, 15 ఎంజీ, 20 ఎమ్‌జీ డోసు మాత్రలకు సంబంధించిన అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్‌అప్లికేషన్ (ఏఎన్‌డీఏ)కు తాత్కాలిక ఆమోదం లభించినట్లు వివరించారు.

## విమాన తయారీలోకి అదానీ గ్రూప్!




బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్, మనదేశంలో విమానాల రూపకల్పనకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకవసరమైన తుది అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయడం కోసం, అదానీ గ్రూప్‌తో ఎంబ్రాయర్, ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. భారత విమాన రంగంలోని భారీ అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసం ఎంబ్రాయర్ గత అక్టోబరులో దిల్లీలో తన కార్యాలయాన్ని నెలకొల్పింది. ఎంబ్రాయర్‌తో ఒప్పందం ద్వారా భారత్‌లో విమానాల తయారీ రంగంలోకి అదానీ గ్రూప్ అడుగుపెట్టినట్లయింది. ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) ఏర్పాటు నిమిత్తం ఎంబ్రాయర్‌తో ఇటీవలే అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదానీ, ఎంబ్రాయర్‌ల నుంచి ఈ విషయంపై అధికారిక స్పందన రాలేదు. 'విమానయాన రంగంలో అతితక్కువ ప్రతిఫలం లభించే మార్కెట్లలో భారత్ ఒకటి. ఇక్కడ నిర్వహణ ఖర్చులు ఎంత తక్కువగా ఉండి, అంత ఎక్కువమందిని చేరవేయగలిగితేనే మనుగడ ఉంటుంది. 146 మంది ప్రయాణించేందుకు అనువైన తమ ఈ195-ఈ2 విమానం ఈ విపణికి ఎంతో అనువైనద'ని ఎంబ్రాయర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాల్ విలరాన్ తెలిపారు.

## సంపదలో 75% సమాజానికి ఇచ్చేస్తా

### కుమారుడి హఠాన్మరణం వేళ వేదాంతా అగర్వాల్ పునరుద్ఘాటన

వేదాంతా గ్రూప్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్, తన సంపదలో 75% కంటే ఎక్కువ మొత్తాన్ని సమాజానికి విరాళంగా ఇస్తానని పునరుద్ఘాటించారు. అమెరికాలో ఆయన కుమారుడు అగ్నివేశ్ ఆకస్మిక మరణం తర్వాత సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అనిల్ అగర్వాల్ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. భారత్ స్వయం సమృద్ధిపై తన కుమారుడు ఎంతో నమ్మకంతో ఉండేవారని అనిల్ గుర్తుచేసుకున్నారు. మన దేశానికి లోటు ఏమీ లేదని.. ఏ విషయంలోనూ వెనకబడి ఉండకూడదన్నది అగ్నివేశ్ అభిప్రాయంగా వెల్లడించారు. 'దేశంలో ఏ బిడ్డ ఆకలితో నిద్రపోకూడదు. ఏ ఒక్కరికీ విద్య నిరాకరించరాదు. ప్రతి మహిళ సొంత కాళ్లపై నిలబడాలి. ప్రతి యువ భారతీయుడు అర్థవంతమైన పనిని పొందాలి అనే కలను మేము పంచుకునేవాళ్లం. మనం సంపాదించిన దానిలో 75% కంటే ఎక్కువ మొత్తాన్ని సమాజానికి తిరిగి ఇద్దామని అగ్నితో కలిసి వాగ్దానం చేశాను. నేను ఈ రోజు ఆ వాగ్దానాన్ని పునరుద్ఘాటిస్తున్నాను. మరింత సాధారణమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నా' అని అగర్వాల్ పేర్కొన్నారు. పలువురికి అందించిన సాయంతో, వారి అభ్యున్నతి రూపంలో అగ్నివేశ్ జీవించే ఉంటారన్నది తన ఆలోచనగా అనిల్ తెలిపారు. అగ్నివేశ్ మరణించిన రోజును తన జీవితంలో 'చీకటి' దినంగా ఆయన అభివర్ణించారు. స్కీయింగ్ ప్రమాదంలో గాయపడిన అగ్నివేశ్ న్యూయార్క్‌లోని మౌంట్ సినాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రమాదం నుంచి అతను బయటపడినట్లే భావించామని అనిల్ అగర్వాల్ వివరించారు. ఈ సమయంలో కార్డియాక్ అరెస్ట్ ఆయన ప్రాణాలను బలిగొందన్నారు. 'బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధను వర్ణించడానికి పదాలు లేవు, ఒక కొడుకు తన తండ్రి కంటే ముందే చనిపోకూడదు. ఈ నష్టాన్ని మేము

# త్వరలో జియో మెగా పబ్లిక్ ఇష్యూ..

# ఈ ఏడాదే ఐపీవోకు రానున్న సంస్థ




**న్యూఢిల్లీ :** భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు రిలయన్స్ జియో సిద్ధమవుతున్నది. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఈ టెలికాం సంస్థ.. ఈ ఏడాది ఎలాగైనా పబ్లిక్ ఇష్యూకు రావాలన్న అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నది. నిజానికి 2019లోనే జియో ఐపీవోకు ముకేశ్ ప్రణాళికలు వేశారు. అయితే కంపెనీ విలువ పెరిగేదాకా ఆగితే మంచిదన్న అభిప్రాయాలతో వెనుకకు తగ్గారు. అయితే ఇదే సరైన సమయమని ఇప్పుడు భావిస్తున్న అంబానీ.. ఈ సంవత్సరం ప్రథమార్ధంలో జియో షేర్లను స్టాక్ మార్కెట్లలోకి ఎక్కించాలని చూస్తున్నారు. కాగా, పబ్లిక్ ఇష్యూలో 2.5 శాతం వాటాను విక్రయించాలని యోచిస్తున్నట్లు సమాచారం. దీని విలువ ఏకంగా రూ.40,000 కోట్లపైనే (4.5 బిలియన్ డాలర్లు) కావడం గమనార్హం. ఇప్పటిదాకా ఈ స్థాయిలో నిధుల సమీ కరణ అనేదే జరుగలేదు. దీంతో పబ్లిక్ ఇష్యూలలో జియో ఐపీవోను బాహుబలిగా అభివర్ణిస్తున్నారంతా. అన్నీ కుదిరితే జూన్‌కల్లా జియో ఐపీవో రావచ్చన్న అంచనాలైతే ఉన్నాయి.

**రూ.16.2 లక్షల కోట్లుగా..**

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫ్రీస్.. గత ఏడాది నవంబర్‌లో రిలయన్స్ జియో విలువను రూ.16.2 లక్షల కోట్లు (180 బిలియన్ డాలర్లు)గా అంచనా వేసింది. దీని ప్రకారం ఐపీవో ద్వారా అమ్మాలనుకుంటున్న 2.5 శాతం వాటా విలువ 4.5 బిలియన్ డాలర్లుగా తేలుతున్నది. డాలర్‌తో పోల్చితే ప్రస్తుతం రూపాయి మారకం విలువ ప్రకారం.. ఇది రూ.40,000 కోటపైనే. అయితే కొన్ని బ్యాంకులు జియో వ్యాపారం విలువను 200 బిలియన్ డాలర్ల నుంచి 240 బిలియన్ డాలర్ల వరకు లెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే పబ్లిక్ ఇష్యూలో నిధుల సమీకరణ ఎంత? ఉంటుందన్న దానిపై ఇప్పుడే స్పష్టత రాకుండా ఉన్నది. ఐపీవో పరిమాణానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచీ అనుమతులు రావాల్సి ఉన్నదని అంటున్నారు.

**ఇప్పటికైతే హ్యుందాయ్ టాప్**

దేశంలో ఇప్పటిదాకా భారీ ఐపీవో రికార్డు దక్షిణ కొరియా ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్ పేరిటనే ఉన్నది. గత ఏడాది వచ్చిన ఈ పబ్లిక్ ఇష్యూ విలువ 3.3 బిలియన్ డాలర్లు. జియో ఐపీవో వస్తే.. ఇది రెండో స్థానానికే పరిమితం కావాల్సి ఉంటుంది. ఇక దేశవ్యాప్తంగా జియో వినియోగదారులు 500 మిలియన్లకుపైగానే ఉన్నారు. దేశీయ టెలికాం రంగంలో అగ్రగామి సంస్థగా కూడా కొనసాగుతున్నది. ఇప్పటికే కృత్రిమ మేధలోకీ ప్రవేశించిన జియో.. కేకేఆర్, జనరల్ అట్లాంటిక్, సిల్వర్ లేక్, ది అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ వంటి ప్రముఖ విదేశీ సంస్థాగత మదుపరుల నుంచి పెట్టుబడులనూ అందుకున్నది. ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ఎన్విదియాతో కలిసి జియో పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఎలాన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్‌తో జియో

# ఇన్నోవా క్రిస్టా మరింత ప్రియం

**న్యూఢిల్లీ :** వాహన కొనుగోలుదారులకు టయోటా షాకిచ్చింది. ప్రీమియం ఎస్‌యూవీలైన ఫార్చ్యూనర్, ఇన్నోవా క్రిస్టా, హైక్రాస్ మాడళ్ల ధరలను రూ.74 వేల వరకు పెంచుతున్నట్టు తాజాగా ప్రకటించింది. వీటిలో ఇన్నోవా క్రిస్టా మాడల్ రూ.33 వేల వరకు పెంచుతుండగా దీంతో ప్రస్తుతం ఈ మాడల్ రూ.18.99 లక్షల నుంచి రూ.25.53 లక్షల లోపు దేశవ్యాప్తంగా లభిస్తున్నది. అలాగే ఇన్నోవా హైక్రాస్ మాడల్‌ను రూ.48 వేల వరకు సవరించడంతో దీని ధర రూ.19.15 లక్షల నుంచి రూ.32.38 లక్షల లోపు చేరుకున్నది. దీంతోపాటు ఫార్చ్యూనర్ రూ.74 వేలు, లెజెండరీ మాడళ్ల ధరలను రూ.71 వేలు వరకు సవరించింది. వీటి ధరలు రూ.34.16 లక్షల నుంచి రూ.49.59 లక్షల లోపు లభిస్తున్నాయి. కానీ, గ్లాంజా, టైజర్, హైరైడర్, రుమియన్, హిలక్స్, క్యామ్రీ, వెల్‌ఫైర్, ల్యాండ్ క్రూజర్ 300 మాడళ్ల ధరలను యథాతథంగా ఉంచింది. మరోవైపు, హైక్రాస్, ఫార్చ్యూనర్ మాడళ్లను నిలిపివేసేయోచనలో సంస్థ ఉన్నట్టు తెలుస్తున్నది.



# ఈ ఐదుగురు ప్లేయర్లపైనే కళ్లన్నీ..

# గొంగడి త్రిషకు మంచి రోజులు వచ్చినట్లేనా?

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2026 టోర్నమెంట్‌కు శుక్రవారం తెరలేచింది. సీజన్ ఆరంభ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. ముంబై ఇండియన్స్‌పై గెలుపొంది శుభారంభం అందుకుంది.

**ఆర్సీబీ తరఫున అరంగేట్రం**

నవీ ముంబైలో జరిగిన ఈ మ్యాచ్ ద్వారా ఆర్సీబీ తరఫున ఇంగ్లండ్ మహిళా క్రికెటర్లు లారెన్ బెల్, లిన్సీ స్మిత్ అరంగేట్రం చేశారు. ఫాస్ట్ బౌలర్ బెల్ నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసి కేవలం 14 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసింది. తద్వారా డబ్ల్యూపీఎల్‌లో తన ఆగమనాన్ని ఘనంగా చాటింది. మరోవైపు.. లెఫ్టార్మ్ పేసర్ లిన్సీ స్మిత్ మాత్రం రెండు ఓవర్లలో ఏకంగా 23 పరుగులు ఇచ్చి నిరాశపరిచింది. అయితే, అంతర్జాతీయ టీ20లలో సత్తా చాటిన ఈ ఇద్దరు ఎవరికి ఎవరూ తక్కువకారు. తొలి మ్యాచ్‌లో విఫలమైనా లిన్సీ తిరిగి పుంజుకోగలదు. ఇందుకు గణాంకాలే కారణం.

**ఎన్ని వికెట్లు తీశారంటే**

బెల్ ఇప్పటికి 36 అంతర్జాతీయత టీ20లలో 50 వికెట్లు కూల్చగా.. లిన్సీ 22 మ్యాచ్‌లు ఆడి 6.6 ఎకానమీతో 22 వికెట్లు తీసింది. వుమెన్స్ 100లో బెల్ ఖాతాలో 60 (41 మ్యాచ్‌లలో), లిన్సీ ఖాతాలో 42 (37 మ్యాచ్‌లలో) వికెట్లు ఉన్నాయి ఇక బెల్, లిన్సీలతో పాటు మరో ముగ్గురు ప్లేయర్లు కూడా ఈసారి అరంగేట్రం చేసే అవకాశం ఉంది. వారు మరెవరో కాదు లిజెలి లీ, గొంగడి త్రిష, దీయా యాదవ్.





**లిజెలి**

సౌతాఫ్రికా ఓపెనింగ్ బ్యాటర్ లిజెలి లీ అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికి 82 మ్యాచ్‌లు ఆడింది. 33 ఏళ్ల ఈ కుడిచేతి వాటం బ్యాటర్ ఖాతాలో 1896 పరుగులు ఉన్నాయి. ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి వైదొలిగినా.. తన విధ్వంసకర బ్యాటింగ్ కారణంగా గత దశాబ్దకాలంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. గతేడాది వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ లిజెలిని రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఇప్పటికి 104 మ్యాచ్‌లు ఆడి ఐదు సెంచరీలు బాది.. 2770 పరుగులు చేసిన లిజెలి డబ్ల్యూపీఎల్‌నూ వాచౌట్ ప్లేయర్.

**గొంగడి త్రిష**

తెలంగాణ ఆల్‌రౌండర్, టీమిండియా అండర్-19 స్టార్ గొంగడి త్రిష. అండర్-19 ప్రపంచకప్ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన మహిళా క్రికెటర్‌గా ఆమె చరిత్రకెక్కింది. టాపార్డర్‌లో బ్యాటింగ్ చేయడంతో పాటు.. పార్ట్‌టైమ్ లెగ్ స్పిన్నర్‌గా రాణించడం ఆమెకు ఉన్న అదనపు బలం. అయితే, గత రెండు సీజన్లలో వేలంలో పేరు నమోదు చేసుకున్నా ఫ్రాంఛైజీలు ఆమెను పట్టించుకోలేదు. ఈసారి యూపీ వారియర్స్ మాత్రం రూ. 10 లక్షల కనీస ధరకు 20 ఏళ్ల త్రిషను కొనుగోలు చేసింది. కీలక మ్యాచ్‌లలో ఫియర్‌లెస్ క్రికెట్ ఆడగల సత్తా ఉన్న త్రిషకు ఒక్క అవకాశం వచ్చినా తనను తాను నిరూపించుకోగలదు. ఇప్పటి వరకు 33 టీ20 మ్యాచ్‌లు ఆడిన త్రిష 583 పరుగులు సాధించింది.

**దీయా యాదవ్**

పదహారేళ్ల దీయా యాదవ్‌ను రూ. 10 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. తద్వారా అత్యంత పిన్న వయసులో డబ్ల్యూపీఎల్ కాంట్రాక్టు పొందిన ప్లేయర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. అండర్ 15 వన్డే కప్‌లో డబుల్ సెంచరీ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించిన దీయా.. దేశీ టీ20 క్రికెట్‌లోనూ నిలకడైన ఆటతో ఆకట్టుకుంటోంది. ఈమె కూడా ఈసారి అరంగేట్రం చేసే అవకాశం ఉంది.

## టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న యూపీ..

## అనుష్క అరంగేట్రం

డబ్ల్యూపీఎల్-2026లో భాగంగా నవీ ముంబై వేదికగా జరగుతున్న రెండో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్ జట్లు తలపడతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన యూపీ కెప్టెన్ మెగ్ లానింగ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. లానింగ్ యూపీ తరఫున ఇదే తొలి మ్యాచ్ కావడం గమనార్హం. ఇంతకుముందు ఢిల్లీ క్యాపిటల్స్‌కు లానింగ్ సారథ్యం వహించింది. కానీ డబ్ల్యూపీఎల్-2026 వేలానికి ముందు ఢిల్లీ ఆమెను విడిచిపెట్టింది. దీంతో వేలంలోకి వచ్చిన లానింగ్‌ను యూపీ వారియర్స్ సొంతం చేసుకుని తమ జట్టు బాధ్యతలు అప్పగించింది. ఇక ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్లు సోఫీ డివైన్, జార్జియా వేర్‌హామ్ గుజరాత్ జెయింట్స్ తరఫున అరంగేట్రం చేశారు. వీరిద్దరూ గత సీజన్ వరకు ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహించారు. వీరితో పాటు అనుష్క శర్మ కూడా గుజరాత్ తరఫున డెబ్యూ చేసింది.

**తుది జట్లు**



గుజరాత్ జెయింట్స్: బెత్ మూనీ (వికెట్ కీపర్), సోఫీ డివైన్, ఆష్లీ గార్డనర్ (కెప్టెన్), జార్జియా వేర్‌హామ్, అనుష్క శర్మ, కనికా అహుజా, భారతీ ఫుల్మాలి, కష్వీ గౌతమ్, తనూజా కన్వర్, రాజేశ్వరి గయక్వాడ్, రేణుకా సింగ్ ఠాకూర్ యుపీ వారియర్జ్: మెగ్ లానింగ్ (కెప్టెన్), ఫోబ్ లిచ్‌ఫీల్డ్, హర్లీన్ డియోల్, డియాండ్రా డాటిన్, కిరణ్ ప్రభు నవ్‌గిరే, దీప్తి శర్మ, శ్వేతా సెహ్రావత్ (వికెట్ కీపర్), సోఫీ ఎక్లెస్టోన్, ఆశా శోబన, క్రాంతి గౌడ్, శిఖా పాండే

# స్పోర్ట్స్

## సంజూ శాంసన్ కోసం రంగంలోకి యువీ!



టీమిండియా దిగ్గజ ఆల్‌రౌండర్‌గా యువరాజ్ సింగ్‌కు పేరుంది. టీ20 ప్రపంచకప్-2007, వన్డే వరల్డ్‌కప్-2011 టోర్నీల్లో భారత్ చాంపియన్‌గా నిలవడంలో అతడిది కీలక పాత్ర. పదిహేడేళ్లకుపైగా అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగిన యువీ.. తన కెరీర్‌లో 40 టెస్టులు, 58 టీ20 మ్యాచ్‌లు.. అత్యధికంగా 304 వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 1900, టీ20లలో 1177 పరుగులు చేసిన ఈ లెఫ్టాండర్ బ్యాటర్.. వన్డేల్లో 14 శతకాల సాయంతో 8701 పరుగులు సాధించాడు. ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఖాతాలో 9 టెస్టు, 111 వన్డే, 28 టీ20 వికెట్లు ఉన్నాయి. ఐపీఎల్‌లోనూ 132 మ్యాచ్‌లు ఆడిన యువీ.. 2750 పరుగులు చేయడంతో పాటు.. 36 వికెట్లు కూడా తీశాడు. ఇంతటి అనుభవం గల యువీ దగ్గర పంజాబీ బ్యాటర్లు, టీమిండియా స్టార్లు శుబ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ శిక్షణ తీసుకున్నారు. అతడి మార్గదర్శనంలో వీరిద్దరు రాటుదేలారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ టీమిండియా విధ్వంసకర ఓపెనర్‌గా, ప్రపంచ నంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా ఎదగడంలో యువీది కీలక పాత్ర. మరోవైపు.. గిల్ ఏకంగా టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ స్థాయికి ఎదిగాడు. ఇక యువీ శిష్యుల జాబితాలోకి తాజాగా సంజూ శాంసన్ కూడా చేరిపోయినట్లు తెలుస్తోంది. న్యూజిలాండ్‌తో స్వదేశంలో టీ20 సిరీస్‌కు ఈ కేరళ వికెట్ కీపర్ బ్యాటర్ సన్నద్ధమవుతున్నాడు. టీ20 ప్రపంచకప్-2026 టోర్నీకి సన్నాహకంగా సాగే ఈ సిరీస్‌లో సత్తా చాటి.. మెగా ఈవెంట్లోనూ మెరవాలని సంజూ పట్టుదలగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో యువరాజ్ సింగ్ మార్గదర్శనంలో నెట్స్‌లో సంజూ శ్రమిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇందులో యువీ.. సంజూకు బ్యాటింగ్ పొజిషన్, టెక్నిక్స్ గురించి సలహాలు ఇస్తుండగా.. అతడు శ్రద్ధగా వింటున్నట్లు కనిపించిది. ఇది చూసిన నెటిజన్లు.. "క్రేజీ కాంబినేషన్.. సూపర్ భయ్యా" అంటూ కామెంట్లు చేస్తున్నారు. సంజూ శాంసన్ ఫ్యాన్స్ పేజీ నుంచి వచ్చిన ఈ వీడియోపై మరికొందరు మాత్రం.. "ఏఐ" కాదు కదా అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా న్యూజిలాండ్‌తో తొలుత మూడు వన్డేలు ఆడిన తర్వాత.. టీమిండియా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. జనవరి 11- 31 వరకు ఈ సిరీస్ నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. ఆ తర్వాత ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్-2026తో భారత జట్టు బిజీ అవుతుంది.

# 'రాజా సాబ్' టీం క్రేజీ నిర్ణయం.. నేటి నుంచి సినిమాలో 8 నిమిషాల అదనపు సీన్లు!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన భారీ చిత్రం 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. తొలి రోజు ఈ సినిమాకు మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ, వసూళ్ల విషయంలో మాత్రం ప్రభాస్ స్టామినా స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా నైట్ షోల నుంచి పుంజుకున్న ఈ చిత్రం, శనివారం నాటి అడ్వాన్స్ బుకింగ్స్‌లోనూ అదరగొడుతోంది. ఫాంటసీ, హారర్ కామెడీ మరియు సైకలాజికల్ థ్రిల్లర్ అంశాల కలయికతో రూపొందిన ఈ మూవీకి ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. కేవలం అభిమానుల అంచనాల వల్లే కొంత నెగిటివిటీ వినిపించినా, సాధారణ ప్రేక్షకులు మాత్రం మారుతి మార్క్ వినోదాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నారని ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. వింటేజ్ ప్రభాస్‌ను గుర్తు చేస్తూ ఆయన పండించిన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ నేపథ్యంలో ప్రేక్షకులకు మరో సర్ప్రైజ్ ఇచ్చేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది. థియేటర్లలో నేటి నుంచి ప్రభాస్ 'ఓల్డ్ గెటప్'కు సంబంధించిన 8 నిమిషాల నిడివి గల అదనపు సన్నివేశాలను జోడిస్తున్నట్లు దర్శకుడు మారుతి ప్రకటించారు. టీజర్లలో చూసిన ఓల్డ్ లుక్ సినిమాలో లేకపోవడంతో కొంత అసంతృప్తిగా ఉన్న అభిమానుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పండుగ వాతావరణం, తోడుగా ఈ కొత్త సీన్స్ యాడ్ కావడంతో ఈ వీకెండ్‌లో 'రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్‌లు హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో సంజయ్ దత్ కీలక పాత్రలో నటించాడు.

## వెంకటేష్-త్రివిక్రమ్ మ్యాజిక్ మళ్లీ మొదలైంది.. జెట్ స్పీడ్‌తో షూటింగ్ పూర్తి



టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న కాంబోలలో విక్టరీ వెంకటేష్‌దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ జోడీ ఒకటి అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చాలా ఏళ్లుగా ఈ ఇద్దరూ కలిసి సినిమా చేస్తారని వార్తలు వినిపించినప్పటికీ, ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదు. అయితే ఇప్పుడు ఆ నిరీక్షణకు ముగింపు పలుకుతూ వెంకటేష్, త్రివిక్రమ్ కలిసి 'ఆదర్శ కుటుంబం ాూఖ47' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుండటం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కాంబోపై ప్రేక్షకుల్లో ఇంతటి అంచనాలు ఏర్పడటానికి ప్రధాన కారణం వీరి గత అనుబంధమే. వెంకటేష్ హీరోగా తెరకెక్కిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి సినిమాలకు త్రివిక్రమ్ కథ, మాటలు అందించి అవి ఎవర్‌గ్రీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్లుగా నిలిచాయి. విడుదలైన ఇన్నేళ్ల తర్వాత కూడా టీవీలో వస్తే తప్పక చూసే సినిమాలుగా అవి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయాయి. ఆ కామెడీ టైమింగ్, భావోద్వేగాలు, కుటుంబ విలువలు కలిసి వచ్చిన మ్యాజిక్ మళ్లీ తెరపై చూడాలని ఫ్యాన్స్ ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. ఇప్పుడు అదే కోరికను నెరవేర్చేలా 'ఆదర్శ కుటుంబం' ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ కూడా ప్రారంభమైంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాను దర్శకుడు త్రివిక్రమ్ అత్యంత వేగంగా పూర్తి చేయాలని గట్టి ప్లాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా త్రివిక్రమ్ సినిమాలు షూటింగ్ పూర్తవ్వడానికి ఎక్కువ సమయం పడుతాయనే అభిప్రాయం ఉన్నా, ఈ సినిమాతో ఆ ఇమేజ్‌ను మార్చాలనే ఉద్దేశంతో ఆయన ముందుకెళ్తున్నారట. మే నెల కల్లా షూటింగ్ మొత్తం పూర్తి చేసి, సమ్మర్‌లోనే సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో షెడ్యూళ్లను కట్టుదిట్టంగా ప్లాన్ చేస్తున్నారని టాక్.

## మహేశ్ ఫ్యామిలీలో మరో హీరో



సూపర్‌స్టార్ మహేశ్ బాబు కుటుంబం నుంచి మరో హీరో వస్తున్నాడు. కొన్నిరోజుల క్రితమే ఈ ప్రాజెక్టుకి సంబంధించిన అధికారిక ప్రకటన రాగా ఇప్పుడు మహేశ్ చేతుల మీదుగానే ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. అలానే చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పుకొచ్చారు. మహేశ్ కుటుంబం నుంచి త్వరలో చాలామంది వారసులు.. ఇండస్ట్రీలోకి రాబోతున్నారు. వాళ్లలో తొలుత జయకృష్ణ లాంచ్ కాబోతున్నాడు. ఇతడు మహేశ్ అన్న రమేశ్ బాబు కొడుకు. 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ అజయ్ భూపతి తీస్తున్న 'శ్రీనివాస మంగాపురం' మూవీతో జయకృష్ణ హీరోగా పరిచయం కానున్నాడు. రషా తడానీ హీరోయిన్. కొన్నాళ్ల క్రితమే షూటింగ్ మొదలు కాగా తాజాగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. బులెట్‌పై గన్ పట్టుకుని ఉన్న లుక్ బాగుంది. ఇందులోనే మోహన్ బాబు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారనే రూమర్ కొన్నిరోజుల క్రితం వచ్చింది గానీ గ్లింప్స్, టీజర్, ట్రైలర్ లాంటివి వస్తే ఆయన ఉన్నారా లేదా అనేది క్లారిటీ రానుంది. ఈ ఏడాదిలో మూవీ థియేటర్లలోకి రానుంది. ఎప్పుడు ఏంటనేది త్వరలో చెబుతారు.



# చిరంజీవి మూవీ.. ఒక్కో టికెట్ రూ.600

ప్రభాస్ 'రాజాసాబ్' చిత్రానికి తెలంగాణలో టికెట్ ధరలు పెంచినందుకే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు'కి పెంపు ఉంటుందా లేదా అని అందరూ మాట్లాడుకున్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం నుంచి జీవో వచ్చింది. ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు. 11వ తేదీన వేసే ప్రీమియర్ల ఒక్కో టికెట్ రూ.600గా నిర్ణయించారు. అలానే 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు ఒక్కో టికెట్‌పై సింగిల్ స్క్రీన్లలో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 'రాజాసాబ్'లానే దీనిపై కూడా ఎవరైనా న్యాయవాది పిటిషన్ వేసే అవకాశముంది. కాకపోతే ఈ రెండు రోజుల కోర్టు సెలవులు కాబట్టి సోమవారం నాడు ఇలాంటిది ఏమైనా ఉండే అవకాశముంది. 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాలో చిరంజీవి, నయనతార జంటగా నటించారు. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. భీమ్స్ సంగీతమందించగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తెరకెక్కించారు. ఏపీలో జారీ చేసిన జీవో విషయానికొస్తే ముందు రోజు వేసే స్పెషల్ ప్రీమియర్ టికెట్ ధరని జీఎస్టీతో కలిపి రూ.500గా నిర్ణయించారు. జనవరి 11న రాత్రి 8గంటల నుంచి 10లోపు ఈ షోలు ఉంటాయి. ఆపై తొలి పదిరోజులపాటు టికెట్ ధరలను పెంచుకోవచ్చని ప్రభుత్వం అనుమతి వచ్చింది. సింగిల్ స్క్రీన్‌లలో టికెట్ ధరపై రూ.100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 జీఎస్టీతో కలిపి పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. విడుదల మొదటిరోజు రాష్ట్రవ్యాప్తంగా 5 షోలు ప్రదర్శించవచ్చని జీఓలో పేర్కొంది.

# మలయాళ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు సిగ్గుపడిన శ్రీలీల..



టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ప్రస్తుతం తన కోలీవుడ్ డెబ్యూ మూవీ 'పరశక్తి' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన ఆమె నటించిన ఈ చిత్రం నేడు (జనవరి 10) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం కేరళలోని కొచ్చికి శ్రీలీల వెళ్లగా.. అక్కడ జరిగిన ప్రెస్ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను ఫ్లర్ట్ చేస్తూ సరదాగా అడిగిన ప్రశ్నలు, దానికి ఆమె ఇచ్చిన క్యూట్ రియాక్షన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను పలకరిస్తూ మీకు తమిళం వచ్చా అని అడగగా, ఆమె అవును వచ్చు అని సమాధానమిస్తుంది. అనంతరం ఆ రిపోర్టర్ శ్రీలీల అందాన్ని పొగుడుతూ.. మిమ్మల్ని మొదటిసారి నేరుగా చూస్తున్నాను, మీరు చాలా అందంగా ఉన్నారు అని చెప్పడంతో ఆమె ఒక్కసారిగా సిగ్గుపడుతూ నవ్వేశారు. అయితే వెంటనే ఆ రిపోర్టర్ ట్విస్ట్ ఇస్తూ.. మీరు నాకు ఒక సిస్టర్ (సోదరి) లాగా అనిపిస్తున్నారు అని అనడంతో, శ్రీలీల తనదైన శైలిలో.. తాను మెడికల్ స్టూడెంట్ అన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. నేను డాక్టర్‌ను, సిస్టర్‌ను (నర్సును) కాదు అంటూ చమత్కరించారు. శ్రీలీల ఇచ్చిన ఈ ఫన్నీ కౌంటర్‌తో అక్కడ నవ్వులు పూశాయి. ప్రస్తుతం ఈ క్యూట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# పని హక్కుపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడిని ప్రతి వ్యక్తి ఖండించాలి

**ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసే మోదీ చర్యలను వ్యతిరేకించండి**

**డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య**



**ధర్మ ఘంట జనవరి10,సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** ప్రధాని మోదీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ను రద్దు చేసి జి రాం జి 2025 పేరుతో 197 బిల్లును తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు, ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని, పని హక్కుపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడిని ప్రతి వ్యక్తి ఖండించాలని డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అన్నారు.శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్వతంత్ర పోరాటంలో అహింసా మార్గంలో పోరాటం చేసి సత్యాగ్రహమే ఆయుధంగా బ్రిటిష్ పాలనపై పోరాటం చేసిన జాతిపిత మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ పథకం నుండి తొలగించి విజి రాంజీ అనే కొత్త పేరు పెట్టడమే కాకుండా పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం దెబ్బతీసే విధంగా చేస్తూ బిజెపి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని ఆయన అన్నారు.యూపీఏ ప్రభుత్వంలో సోనియాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు వలసలు పోకుండా, వారు నివసించే గ్రామంలోనే పని కల్పించే విధంగా పార్లమెంట్లో చట్టం చేసి ప్రతి రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేసే విధంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొని వచ్చిందని ఆయన అన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం కేంద్రం 60శాతం రాష్ట్రం 40శాతం నిధులు భరించాలనే మార్పులు చేయడం వల్ల ఈ పథకాన్ని రాష్ట్రాలకు భారంగా మారి రద్దు చేసే అవకాశం ఉందని అన్నారు. కార్పొరేటు సంస్థలకు మేలు చేసే విధంగా గ్రామీణ కూలీలు పట్టణాలకు వలస పోయే విధంగా కేంద్రం పథకంలో మార్పులు చేసిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పిసిసి ఆదేశాల మేరకు జనవరి 20 నుంచి మోడి ప్రభుత్వం యొక్క కుట్రలకు వ్యతిరేకంగా సూర్యాపేట జిల్లాలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామీణ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని పథకాన్ని తిరిగి తీసుకొని వచ్చేవరకు ఈ పోరాటాన్ని కొనసాగించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అంజలి, మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, ఎస్సీ సెల్ రాష్ట్రనాయకులు చింతమల్ల రమేష్, నాగుల వాసు, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, రావుల రాంబాబు,అక్కినపల్లి జానయ్య, పిడమర్తి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం సైబర్ క్రైమ్ ఘటన ఓ హెచ్చరిక,బాధ్యత



గంట సోమన్న, సీనియర్ జర్నలిస్ట్.

ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీస్ చైల్డ్ పోర్నోగ్రఫీ కేసులో చేసిన కీలక అరెస్ట్ తో ఒక ముఖ్యమైన విజయాన్ని సాధించింది.సోషల్ మీడియాలో (ముఖ్యంగా ఫేస్‌బుక్‌లో) చిన్న పిల్లల అశ్లీల వీడియోలను (చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లయిటేటివ్ అండ్ అబ్యూస్ మెటీరియల్–జూజూఎవీ/చైల్డ్ పోర్నోగ్రఫీ) చూసి,షేర్ చేసిన కేసులో ఖమ్మం పట్టణం శ్రీనివాస నగర్ కు చెందిన వి.నిరంజన్ కుమార్ (40)ను అరెస్టు చేశారు. ఈ కేసు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ), నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పీ) మరియు నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ (ఎన్సీఎంఈసీ) ఆధ్వర్యంలో జరిగిన మానిటరింగ్ ద్వారా గుర్తించబడిందని తెలుస్తోంది. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఈ అరెస్టును స్వాగతిస్తూ సైబర్ స్పేస్‌లో ఎవరైనా చైల్డ్ పోర్నోగ్రఫీని సెర్చ్ చేసినా,చూసినా,డౌన్‌లోడ్ చేసినా,షేర్ చేసినా లేదా స్టోర్ చేసినా పోక్సో చట్టం సెక్షన్ 15 మరియు ఐటీ చట్టం సెక్షన్ 67బి కింద కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిందితుడిని ని రిమాండ్‌కు తరలించారు.ఖమ్మం నగరంలో వెలుగు చుసిన ఈ ఘటన మన సమాజానికి ఒక హెచ్చరిక మాత్రమే కాదు,ఇది మన సమాజానికి ఒక బాధ్యతగా గుర్తించాలి.

ఎందుకు ఇది చాలా ముఖ్యమైనది?

చిన్న పిల్లల అశ్లీల చిత్రాలు/వీడియోలు చూడటం లేదా షేర్ చేయడం అనేది కేవలం“పర్సనల్ వ్యవహారం“కాదు.అది పిల్లలపై జరిగిన లైంగిక దుర్వినియోగానికి మద్దతు ఇవ్వడమే అవుతుంది. ప్రతి వీక్షణ,ప్రతి షేర్ ఆ చిన్నారుల బాధను మరింత పెంచుతుంది.వారి జీవితాలను శాశ్వతంగా దెబ్బతీస్తుంది. తెలంగాణ పోలీసులు (ముఖ్యంగా టిజీసీఎస్బీ) ఇలాంటి కేసులపై గత కొన్ని నెలలుగా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. 2025లోనే వందలాది మంది రిపీట్ ఆఫెండర్లను అరెస్టు చేశారు.ఇది దేశవ్యాప్తంగా ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోంది.

మనమందరం ఏమి చేయాలి?

అలాంటి కంటెంట్ వీడియోలు చూడకండి,షేర్ చేయకండి, ఇగ్నోర్ చేయకండి.ఏదైనా అశ్లీల కంటెంట్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయండి.రిపోర్ట్ చేయడం ఎలా అనేది తెలియకుంటే తెలుసుకోండి.సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్:1930 లేదా వెబ్‌సైట్: ఎ‌ఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ కు చీజ్రా పోర్టల్ ద్వారా లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రిపోర్ట్ ఆప్షన్ ఉపయోగించండి.పిల్లలను రక్షించండి,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,స్నేహితులు పిల్లలకు ఆన్‌లైన్ సేఫ్టీ గురించి తెలియజేయండి.ఓపెన్ ఇంటర్నెట్ ఉపయోగంపై నియంత్రణ ఉంచండి.“ఒక చిన్నారి బాధను చూసి మౌనంగా ఉండటం కూడా ఒక నేరమే!“

**అవుతుందని తెలుసుకోండి.**

ఇక ఈ కేసులో బాధ్యతగా చురుకుగా పనిచేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ టీమ్ (డిఎస్పీ ఫణీందర్,ఇన్‌స్పెక్టర్ కె.నరేష్, ఎస్ఐలు రంజిత్ కుమార్, విజయకుమార్ మరియు సిబ్బంది)కి హృదయపూర్వక అభినందనలు.వీరి అవిరళ కృషి వల్ల మన పిల్లల భవిష్యత్తు కాస్త మెరుగవుతోంది.ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో భాగమవ్వండి. చస్టాప్ చైల్డ్ అబ్యూస్చరిపోర్ట్ క్సమ్ సీఎస్ఈఏఎంచప్రొటెక్షన్ అవరు చిల్డ్రన్ చసేఫ్ఇంటర్నెట్ అంటూ యాష్టాక్ లతో అవేర్ నెస్ కల్పించండి.మనం ఇచ్చే ఒక్క రిపోర్ట్ కూడా ఒక చిన్నారి జీవితాన్ని కాపాడగలదు.






## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సందడి




**ధర్మ ఘంట జనవరి 10,సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటీలో 24 వార్డు కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్ గా పోటీ చేయాలనుకునే అభ్యర్థి అన్నమయ్య రాము శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చి దరఖాస్తును అందజేసారు.దీంతో డిసిసి కార్యాలయం రెడ్ హౌస్ లో సందడి వాతావరణం నెలకొన్నది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున పోటి చేసే నాయకులు కేవలం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులోనే దరఖాస్తు చేసుకోవాలని, బయట ఎవ్వరికి ఇవ్వవద్దని అన్నారు.

## శివసాయి రైస్ మిల్ హక్కుదారులం మేమే

**- ఆర్థిక నేరస్తుడు రాజేష్ ఆరోపణలు అవాస్తవం.**

**- మాకు ప్రాణహాని ఉంది రక్షణ కల్పించాలి.**



ధర్మ ఘంట, జనవరి 10, సూర్యాపేట జిల్లా ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శివసాయి రైస్ మిల్ అసలైన హక్కుదారులం మేమేనని ఆర్థిక నేరస్థుడు రాజేష్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని రాజేష్ నుంచి మాకు ప్రాణహాని ఉంది రక్షణ కల్పించాలని శివసాయి రైస్ మిల్ హక్కుదారులు ఇస్మాయిల్, శ్రీకాంత్, మురళిలు అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణ పోలీస్టేషన్లో పిర్యాదు చేసి అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గౌని రాజేష్, గౌని వెంకటేష్ లు మిల్లుకు బినామీలుగా పేర్కొంటున్నారని వాళ్ళకు మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రాజేష్ తమను డబ్బు అడిగాడని ఇవ్వనందుకే మిల్లు మాది కాదని తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. మిల్లులో శ్రీరాంపురం మురళీధర్ 27%, పురం జ్యోతి 36%, శీల శ్రీకాంత్ 13%, శీల ఆరీఫా 24% శాతం మొత్తంగా 100శాతం మా వాటాతో పూర్తి హక్కుదారులుగా ఉన్నామన్నారు. రాజేష్, అతని తండ్రితో ఉన్న పరిచయం కొద్ది గతంలో పలుమార్లు డబ్బులు ఇచ్చామని ఇప్పుడు వారి ఆర్థిక పరిస్థితి బాగా లేక పోవడంతో వారు అడిగిన డబ్బు ఇవ్వలేదని దీంతో తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రాజేష్ చేసే ఆరోపణల్లో వాస్తవాలు ఉంటే చట్టపరంగా వెళ్ళి తేల్చుకోవాలన్నారు. ఇప్పటికే పలు కేసుల్లో ఉన్న వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని తగిన రక్షణ కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉబ్బపల్లి వేణు, షేక్ నాగుల్, సాయి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అదిరోహించాలి





ధర్మ ఘంట, జనవరి 10, సూర్యాపేట జిల్లా ప్రతినిధి

విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన దిశగా బాగా చదివి ఉన్నత శిఖరాలు అదిరోహించాలని శ్రీ భాష్యం ఒకేషనల్ జూనియర్ కళాశాల చైర్మన్ లెనిన్, కరస్పాండెంట్ శ్రీనాథలు అన్నారు. శనివారం స్థానిక జె గార్డెన్లో ఏర్పాటు చేసిన కళాశాల ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ఒకేషనల్ విద్యార్థులకు అనేక రకాల అవకాశాలున్నాయని అన్నారు. విద్యార్థులు బాగా చదివి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో రాణించాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మాన్సింగ్, నాగేశ్వర్రావు, నరేష్, వీరబాబు, లచ్చునాయక్, అనిత, రాకేష్, ఉదయ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# సంక్రాంతి సందర్బంగా రద్దీగా 65వ జాతీయ రహదారి

హైదరాబాద్-విజయవాడపై ట్రాఫిక్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ
వాహనాల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు రూట్ డైవర్శన్
డ్రోన్ కెమెరాతో హైవేపై నిరంతర నిఘా ఏర్పాటు చేశాం
వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి
రహదారి వెంట ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపవద్దు
జిల్లా పరిధిలో ఎన్ హెచ్ 65 రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి
వాహనాల డైవర్షన్ బోర్డులు గమనించాలి
సురక్షితంగా గమ్యం చేరుకోవాలని పూలు అందించి సూచనలు
రహదారి వెంట గ్రామాల రైతుల అప్రమత్తత అవసరం
సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ







**ధర్మఘంట జనవరి 10 సూర్యాపేట:**

సంక్రాంతి పండుగ సందర్భంగా సూర్యాపేట పట్టణ పరిధిలోని ఎఫ్సీఐ గోదాం వద్ద 65వ,హైవే పై వాహనాల రద్దీ శనివారం జిల్లా ఎస్పీ కె.నరసింహ సంబంధిత పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా డ్రోన్ కెమెరాతో రహదారిపై వాహనాల యొక్క వేగాన్ని,రద్దీని పర్యవేక్షణ చేసి,పండుగకు వెళ్లే వాహనదారులు,ప్రజలు సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని,సంతోషంగా పండుగ జరుపుకోవాలని తెలుపుతూ పుష్పాలు అందించి సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రా ప్రాంతానికి వెళ్ళే వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని,వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వాహనాలు నడపాలన్నారు.

అధికవేగంతో వాహనాలు నడవద్దని,నిద్ర మత్తులో వాహనాలు నడపవద్దని అన్నారు.దూర ప్రయాణం వల్ల అలసిపోవడం,నిద్ర మత్తు కారణంగా ప్రమాదాలకు జరిగే అవకాశం ఉన్నదని,తగు జాగ్రత్తలు పాటించాలని, వాహనాలు కండిషన్ లో ఉండాలని,చలి ప్రభావంతో పొగమంచు ఉంటుందని,రాత్రి సమయంలో ప్రయాణంలో డ్రైవర్ అప్రమత్తత అవసరమని కోరారు.అత్యవసర సమయంలో రహదారుల అధికారులను లేదా డయల్ 100 కు ఫొన్ చేసి సహాయం పొందాలని,రోడ్డు ప్రక్కన అనధికారికంగా ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపవద్దని విజ్ఞప్తి చేశారు.భారీ వాహనాలు ఒక క్రమంలో వెళ్ళాలని,ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని,జిల్లా పరిధిలో జాతీయ రహదారి 65 పై విస్తరణ పనులు,మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని,కాబట్టి అవసరమైన చోట పోలీసు డైవర్షన్స్ ఏర్పాటు చేసి గమనిక బోర్డులు పెట్టడం జరిగిందని, వాటిని పాటిస్తూ వాహందారులు నెమ్మదిగా వెళ్లాలన్నారు. పండగకు వెళ్లే సమయంలో, తిరుగు ప్రయాణం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తున్నట్లు వివరించారు.ముఖ్యంగా బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు సంభవించకుండా స్థానిక ప్రజలను అప్రమత్తం చేశామని సూచించారు.రోడ్డు భద్రత కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.ట్రాఫిక్ రద్దీని,వాహనాలను పునరుద్ధరించడం కోసం ముఖ్యమైన మల్లింపులు చేపట్టడం జరిగిందన్నారు.

హైదరాబాద్ నుండి గుంటూరు వెళ్లేవారు నార్కెట్పల్లి నుండి మిర్యాలగూడ మీదుగా వెళ్లాలని, రాజమండ్రి,వైజాగ్ వైపు వెళ్లేవారు నకిరేకల్ వద్ద జాతీయ రహదారి వైపు తీసుకుని అర్వపల్లి,బంగ్లా ఖమ్మం మీదుగా వెళ్లాలని, రాజమండ్రి,విజయనగరం, కాకినాడ,వైజాగ్,శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలను టేకుమట్ల వద్ద ఖమ్మం వైపు మల్లించామని, ఖమ్మం నుండి సూర్యాపేట వైపుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలు చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ వద్ద సర్వీస్ రోడ్డు నుండి సూర్యాపేట పట్టణం మార్గంలోకి మళ్లించి సూర్యాపేట పట్టణం మీదుగా హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్ళవచ్చని సూచించారు.ముఖ్యంగా జాతీయ రహదారి వెంట గల సూర్యాపేట రూరల్,చివ్వెంల, మునగాల,కోదాడ మండలాల పరిధిలో గల గ్రామాల రైతులు, ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్ళేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని,తప్పుడు మార్గంలో వాహనాలు,పశువులను తీసుకువెళ్లడం ప్రమాదమని గమనించాలన్నారు.పోలీసు సిబ్బంది రోడ్లపై 24 గంటలు గస్తీ నిర్వహిస్తారని,సీఐల పర్యవేక్షణలో ఎన్ హెచ్ 65 పై పెట్రోలింగ్ నిర్వహిస్తారని, బ్లాక్ స్పాట్స్ వద్ద వాహనాలు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నామని,రహదారి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి,తప్పుడు మార్గంలో వాహనాలు నడిపినా,రోడ్లపై న్యూసెన్స్ చేసినా,ఎక్కడపడితే అక్కడ వాహనాలు అపినా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.నిత్యం వాహనాలు తనిఖీలు చేస్తూ మైనర్ డ్రైవింగ్,డ్రంకెన్ డ్రైవ్,రాంగ్ రూట్ డ్రైవింగ్,ఓవర్ లోడింగ్ నిరోధించాలని సిబ్బందికి సూచించారు.

# జయ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు





**ధర్మ ఘంట జనవరి 10, సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

జిల్లా కేంద్రంలోని జయ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాఠశాల స్టూడెంట్స్ ఉత్సాహంగా పాల్గొని వివిధ రంగులతో విభిన్నమైన ముగ్గులను వేశారు.వందలాదిమంది విద్యార్థులు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, స్కూల్ డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మన



సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.మన పండగల గొప్పతనాన్ని, విశిష్టతను తెలుసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో




ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిసిసి వైస్ ప్రెసిడెంట్ పుట్టినరోజు వేడుకలు

**ధర్మ ఘంట జనవరి 10, సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా కేంద్రంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అన్నమయ్య రాము పుట్టినరోజు వేడుకలు అభిమానుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 25 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోడి శివ, కాసం యాదవ్, నల్లమధ సైదులు యాదవ్, సంకటి గౌతం యాదవ్, గజ్జి గోపి యాదవ్, మణికంఠ, విజయ్, దిలీప్ యాదవ్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమ కారుల హామీలను వెంటనే అమలు చేయాలి

ఉద్యమకారులు సంఘటితంగా పోరాడాలి
టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం
టి యు జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రపుల్ రాం రెడ్డి





**ధర్మ ఘంట జనవరి 10,సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధనలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమ కారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమకారులు సంఘటితంగా పోరాడాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమ కారుల జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి , ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ఉద్యమ కారుల జెఏసి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జెఏసి జిల్లా ఇంచార్జీ పిడమర్తి లింగయ్య అధ్యక్షతన రాష్ట్ర మహాసభ జరిగింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమరుల త్యాగాల పునాదులపై తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని ఏ ఒక్కరి వలనో ఏర్పాటు కాలేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమకాలకు సంక్షేమ బోర్డు ను వెంటనే ఏర్పాటు చేయాలని,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయుటకు ప్రభుత్వం కమిటీ వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో 1200 మంది అమరులైతే 400 మందినే గత ప్రభుత్వం ఆదుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట ప్రాంతం ఎంతో చైతన్యవంతమైందని పేర్కొన్నారు. ఉద్యమకారుల హామీలను అమలు చేయకపోతే అసెంబ్లీ ను ముట్టడించాలని హెచ్చరించారు.తెలంగాణ సాయుధ పోరాటం తరహాలో ఉద్యమించాలని తెలంగాణ ఉద్యమ సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను జంగు సిపాయి ఉద్యమకారులుగా గుర్తించాలని, ఉద్యమకారులపై ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిరంకుశ ఉపా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, తెలంగాణ ఉద్యమ చరిత్రను పాఠ్యాంశంను చేర్చాలని, మారోజు వీరన్న స్మృతి వనంను ఏర్పాటు చేయాలని, కేజీ నుంచి కేజీ వరకు ఉచిత విద్య, వైద్యం ను, ఖాయిలపడ్డ పరిశ్రమలను పునరుద్ధరించాలని మహాసభలో తీర్మానించారు. కార్యక్రంలో టి యు జెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి కంచర్ల బద్రి, చారువాక, జర్నలిస్ట్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ బైరాగి, తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు వేముల యాదగిరి, తెలంగాణ ఉద్యమ కారులు చెరుకు సుధాకర్, బహుజన గాయకురాలు విమలక్క, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ తాడోజు వాణి,సిఇవో తాడోజు శ్రీకాంత్ రాజు, డాక్టర్ పృథ్వి రాజ్ యాదవ్, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు కె, ధర్మార్జున్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోవర్ధన్, ఆరాధ్య పౌండేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొడుగు శ్రీధర్, ఉద్యమకారుల మహిళా వేదిక రాష్ట్ర కన్వీనర్ బాకారం లావణ్య, బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ భద్ర బోయిన సైదులు, ఉద్యమకారుల జెఏసి నాయకురాలు గోనె విజయ, కట్ట రాజన్న, యూసుఫ్ షరీఫ్, దయాకర్, ఎస్ కే సయ్యద్, గాయకులు దరువు అంజన్న,సురేష్ మహజన్,సుక్క రామనర్సయ్య,తదితరులు పాల్గొన్నారు

## హాట్ టాపిక్ గా వైసీపీ నేతల ఆస్తులు

**విజయవాడ**

గత పదేళ్ల కాలంలో ఎంపీల ఆస్తుల్లో జరిగిన మార్పులపై ఏడీఆర్ సంస్థ చేసిన తాజా అధ్యయనం దేశ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా 2014 నుంచి 2024 వరకు వరుసగా మూడు సార్లు గెలిచిన 102 మంది ఎంపీల ఆస్తుల వివరాలను ఈ సంస్థ విశ్లేషించింది. ఈ అధ్యయనంలో అత్యంత వేగంగా ఆస్తులు పెరిగిన ఎంపీల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కీలక స్థానాల్లో నిలవడం విశేషంగా మారింది.టాప్ మూడు ఎంపీల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారే కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు, ఆ ఇద్దరూ ఒకే రాజకీయ పార్టీ అయిన వైసీపీకి చెందిన వారు కావడం మరింత ఆసక్తికర అంశం. రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మిథున్ రెడ్డి ఆస్తులు పదేళ్లలో ఏకంగా 550 శాతం పెరిగినట్లు ఏడీఆర్ వెల్లడించింది. 2014లో ఆయన ఆస్తులు సుమారు రూ.22 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.66 కోట్లకు చేరాయి. 2024లో ఇవి రూ.146 కోట్లకు పెరిగినట్లు అఫిడవిట్‌లో నమోదైంది. ఈ వేగవంతమైన పెరుగుదలతో దేశవ్యాప్తంగా అత్యధికంగా ఆస్తులు పెరిగిన ఎంపీల్లో ఆయన మూడో స్థానంలో నిలిచారు.ఇక కడప లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయి. 2014లో ఆయన ప్రకటించిన ఆస్తుల విలువ రూ.7 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.18 కోట్లకు చేరింది. 2024 ఎన్నికల సమయంలో ఇవి రూ.40 కోట్లుగా నమోదయ్యాయి. ఆస్తుల పెరుగుదల పరంగా చూస్తే ఆయన దేశంలో 15వ స్థానంలో నిలిచినట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.ఈ ఇద్దరిని మించి టాప్ స్థానంలో నిలిచిన ఎంపీ జార్ఖండ్‌కు చెందిన విజయ్ కుమార్ హన్సదక్ అని అధ్యయనం స్పష్టం చేసింది. జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీకి చెందిన ఈ నేత రాజ్ మహల్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014లో ఆయన ఆస్తులు కేవలం రూ.68.63 లక్షలుగా ఉండగా, 2024 నాటికి రూ.6 కోట్లకు పెరిగాయి. ఇది దాదాపు 804 శాతం పెరుగుదలగా ఏడీఆర్ లెక్కించింది.తెలంగాణకు చెందిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆస్తులు కూడా పదేళ్లలో 488 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో ఆయన 24వ స్థానంలో నిలిచారు. ఇక ఏపీ నుంచి టీడీపీ తరఫున గెలిచిన ఏకైక ఎంపీ, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆస్తులు 177 శాతం పెరిగాయి. పెరుగుదల పరంగా ఆయన 28వ స్థానంలో ఉన్నారు.ఇదిలా ఉండగా, ఆస్తులు తగ్గిన అరుదైన ఉదంతంగా కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ పేరు

# మతోన్మాద భావజాల వ్యాప్తి సమాజానికి హానికరం






**ఎదుర్కోవడం కోసం సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక రంగంలో కృషి పెరగాలి**

**కేంద్ర బీజేపీవి ప్రభుత్వ ప్రజా,కార్మిక,విద్యార్థి,యువజన, మహిళా వ్యతిరేక విధానాలు**


**సిపి(ఐ)ఎం పొలిటి బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు**

ధర్మఘంట జనవరి 10 భువనగిరి

గ్రామాల్లో బీజేపీ మతోన్మాద భావజాల వ్యాప్తి రోజురోజుకు పెరుగుతున్నదని, దీనిని అణిచివేయడం కోసం గ్రామీణ స్థాయిలో సాంస్కృతిక రంగంలో మన కృషి పెరగాలని సిపి(ఐ)ఎం పోలిక్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద భావజాల వ్యాప్తి అడ్డు అదుపు లేకుండా పెరుగుతుందని,కులం పేరుతో మతం పేరుతో మనుషుల మధ్య విషయాన్ని నింపి చీలికలు తీసుకొస్తుందని మూడోసారి అధికారులకు వచ్చిన తర్వాత మతోన్మాద భావాజాలం గ్రామీణ స్థాయిలో పెట్రేగిపోతుందని గుర్తు చేశారు. అదేవిధంగా బడా కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా గతంలో రైతుల పొట్టగొట్టే నల్ల చట్టాలను తీసుకురావడం,అనేక పోరాటాలు చేసి సాధించుకున్న లేబర్ కోడ్ లను నాలుగు చట్టాలుగా సవరణ చేయడం, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా పేరు మార్చుతూ చట్టాన్ని పూర్తిగా వ్యవసాయ కూలీలకు దూరం చేయాలని చూస్తుందని అదేవిధంగా విత్తన చట్టాన్ని తీసుకురావడం,విద్యుత్ సవరణ బిల్లును తీసుకురావడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయాలని ఆలోచనలు చేయడంతో పాటు అనేక రకాల ప్రజా వ్యతిరేక విధానాలను తీసుకురావాలనే కుట్ర చేస్తుందని,బీజేపీ విధానాలు రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని గ్రామీణ స్థాయిలో రాష్ట్రాల హక్కులను కేంద్రం గుప్పిట్లో పెట్టుకుని పరిపాలన సాగిస్తుందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ చేస్తున్న మతోన్మాద రాజకీయాలను ఎండగడుతూ ఎప్పటికప్పుడు సాంస్కృతిక రంగంలో కృషి పెరిగి బీజేపీ మతోన్మాద భావజాల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మతోన్మాద భావజాలాన్ని పెంచుతూ మరొకవైపు కార్మిక ప్రజా,రైతు వ్యతిరేక విధానాలను తీసుకొస్తూ పరిపాలన సాగిస్తుందని,రానున్న కాలంలో బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ మతం పేరుతో కులం పేరుతో బీజేపీ చేస్తున్న రాజకీయాలను సిపిఐ(ఎం) గ్రామీణ స్థాయిలో ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్,సేవా,మహనీయుల జయంతులు,పండుగల ముసుగులో చాపకింద నీరుల గ్రామాల్లో పాకుతూ,ప్రజల ఆలోచన మార్చి మతోన్మాద భావజాలాన్ని పెంచుతుందని,ఇది దేశానికి ప్రమాదకరంగా మారుతుందని,మతోన్మాద భావజాలాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు,కల్లూరి మల్లేశం,దాసరి పాండు,బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాసాచారి,జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి,సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ,మాయ కృష్ణ,బొల్లు యాదగిరీ,ఎండి పాష, బొడ్డుపల్లి వెంకటేష్,గుండు వెంకటనర్సు,దోడ యాదిరెడ్డి, మద్దేపూరం రాజు,బోలగాని జయరాములు,అవ్వారు రామేశ్వరి,రాచకొండ రాములమ్మ,ఎంఎ ఇక్బాల్, వనం ఉపేందర్,గడ్డం వెంకటేష్, మల్లేపల్లి లలిత,బల్గూరి అంజయ్య,కోట రామచంద్రారెడ్డి, గోశిక కరుణాకర్ మండల కార్యదర్శులు ధూపటి వెంకటేష్, పల్లెర్ల అంజయ్య పోతరాజు జహంగీర్,వేముల భిక్షం,ర్యాకల శ్రీశైలం,ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కాలుష్య నివారణకు 7 నిరూపితమైన వ్యూహాలు..!



ప్రభుదాస్ గండమళ్ళ,
ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ మరియు
ప్రపంచ బ్యాంకు సివిల్ సొసైటీ పాలసీ ఫోరమ్ సభ్యుడు, వాషింగ్టన్ డి.సి,యూఎస్ఏ.
9441464767, 9390381267

నగరాల్లో వాయు కాలుష్యం ఒక నిశ్శబ్ద శత్రువు లాంటిది. ఇది మన ఆరోగ్యాన్ని,పర్యావరణాన్ని మరియు ఆర్థిక వ్యవస్థను నిరంతరం దెబ్బతీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలు ఈ సమస్యతో పోరాడుతున్నారు. ముఖ్యంగా భారతదేశం వంటి దేశాల్లోని పట్టణాల్లో ఇది మరింత తీవ్రంగా ఉంది. అయితే,సమస్య ఉన్న చోటే పరిష్కారాలు కూడా ఉన్నాయి. నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరచడానికి 7 నిరూపితమైన వ్యూహాలను పరిచయం చేస్తున్నాము. ఇవి సరళమైనవి,ఆచరణాత్మకమైనవి మరియు ప్రపంచవ్యాప్తంగా అనేక నగరాల్లో విజయవంతంగా అమలు చేయబడినవి. ఈ వ్యూహాలు మన నగరాలను మరింత ఆరోగ్యకరమైన, సుస్థిరమైన మరియు జీవించడానికి అనుకూలమైన ప్రదేశాలుగా మార్చడానికి సహాయపడతాయి. మరి ఆ వ్యూహాలు ఏమిటో చూద్దాం.

**మొదటగా తెలివిగా ప్లాన్ చేయండి మెరుగ్గా నిర్మించండి**

ఇళ్ళు,దుకాణాలు మరియు సేవలు అన్నీ దగ్గరగా ఉండే కాంపాక్ట్,మిశ్రమ-వినియోగ పరిసరాలపై దృష్టి సారించే నగరాలు (ఇళ్ళు,దుకాణాలు మరియు సేవలు అన్నీ దగ్గరగా ఉండేవి) ప్రజలు నడవడానికి, సైకిల్ తొక్కడానికి లేదా ప్రజా రవాణాను ఉపయోగించడానికి సులభతరం చేస్తాయి. ఇది భారీ ప్రభావంతో కూడిన సరళమైన మార్పు,తక్కువ కాలుష్యం, పరిశుభ్రమైన గాలిని ఇస్తుంది.

**రెండవది శుభ్రమైన,నమ్మదగిన ప్రజా రవాణాలో పెట్టుబడి పెట్టండి**

ఎలక్ట్రిక్ బస్సులు,మెట్రో వ్యవస్థలు మరియు బాగా అనుసంధానించబడిన,రవాణా నెట్‌వర్క్‌లు కాలుష్యాన్ని తగ్గించడమే కాదు,అవి నగరాలను మరింత జీవించడానికి అనుకూలంగా మారుస్తాయి. రవాణా-ఆధారిత అభివృద్ధిని జోడించండి. రవాణా స్టాప్‌ల దగ్గర కొత్త గృహాలు నిర్మించబడిన చోట ఇది ప్రయోజనకరమైనది.

**మూడవది మరిన్ని ఆకుపచ్చ మరియు నీలం రంగు ప్రదేశాలను తీసుకురండి**

పార్కులు,చెట్లు,ఆకుపచ్చ పైకప్పులు,చిత్తడి నేలలు ఇవన్నీ వాయు కాలుష్య కారకాలను ఫిల్టర్ చేయడానికి మరియు నగరాలను చల్లబరచడానికి సహాయపడతాయి. అవి కూడా గొప్ప ప్రదేశాలుగా వెలుగొందుతాయి. ప్రకృతి ఆధారిత పరిష్కారాలు కేవలం అందంగా ఉండవు,అవి ఆచరణాత్మకమైనవి.

**నాలుగవది భవనాలు మరియు ఇంధన వ్యవస్థలను పరిశుభ్రంగా చేయండి**

పట్టణ మౌలిక సదుపాయాలలో భవన నియమాలను కఠినతరం చేయడం మరియు పునరుత్పాదక శక్తికి మారడం వల్ల మూలం వద్ద ఉద్గారాలను తగ్గిస్తుంది. ఇంధన-సమర్థవంతమైన భవనాలు వాతావరణానికి మంచివి మాత్రమే కాదు,అవి డబ్బును ఆదా చేస్తాయి మరియు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

**ఐదవది వ్యర్థ వ్యవస్థలను సరిచేయండి**

చాలా చోట్ల వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం ఇప్పటికీ ఒక ప్రధాన సమస్య. సేకరణను మెరుగుపరచడం,రీసైక్లింగ్‌ను పెంచడం మరియు వృత్తాకార ఆర్థిక వ్యవస్థ వైపు మారడం వల్ల హానికరమైన ఉద్గారాలను నాటకీయంగా తగ్గించవచ్చు.

**ఆరవది పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించండి**

కఠినమైన ప్రమాణాలు మరియు మెరుగైన జోనింగ్ నివాస ప్రాంతాలను కలుషితం చేయకుండా భారీ పరిశ్రమను నిరోధించవచ్చు. ఇది కర్మాగారాలను తరలించడం గురించి మాత్రమే కాదు,ఇది క్లీనర్ టెక్,స్మార్ట్ ప్లానింగ్ మరియు మెరుగైన అమలు గురించి.

**ఏడవది వాతావరణ కార్యాచరణ ప్రణాళికలలో గాలి నాణ్యతను చేర్చండి**

చాలా నగరాలు ఇప్పుడు తమ విస్తృత వాతావరణ వ్యూహాలలో క్లీన్ ఎయిర్ లక్ష్యాలను కలుపుతున్నాయి. ఉదాహరణకు అమ్మన్,దాని క్లైమేట్ యాక్షన్ ప్లాన్‌లో వాయు కాలుష్యాన్ని కీలక భాగంగా చేసింది. ఇక బోనస్ చిట్కా ఏమిటంటే దానిని అంటిపెట్టుకునేలా విధానాన్ని ఉపయోగించండి. చట్టపరమైన సాధనాలు ముఖ్యమైనవి. రద్దీ ధర మరియు తక్కువ-ఉద్గార మండలాల నుండి అధిక- కాలుష్య వాహనాలను నియంత్రించడం వరకు,నగరాలు సుదీర్ఘకాలం క్లీనర్ గాలిని లాక్ చేయడానికి పాలనను ఉపయోగించవచ్చు. చివరగా చెప్పొచ్చేదేమిటంటే నగరాల్లో వాయు కాలుష్యాన్ని తగ్గించడం కేవలం ఒక లక్ష్యం మాత్రమే కాదు. అది మన భవిష్యత్తు తరాలకు మనం ఇవ్వగలిగే అతి పెద్ద బహుమతి. ప్రపంచ వ్యాప్తంగా బీజింగ్,న్యూయార్క్ వంటి నగరాలు ఈ 7వ్యూహాలను అమలు చేసి ౹వీ2.5 స్థాయిలను 50% వరకు తగ్గించాయి. బొగోటాలో ఎలక్ట్రిక్ బస్సులు,గ్రీన్ స్పేస్‌లు పెంచడం వల్ల రవాణా కాలుష్యం గణనీయంగా తగ్గింది. సింగపూర్,ఓస్లో వంటి నగరాలు మిశ్రమ-వినియోగ ప్లానింగ్, పునరుత్పాదక శక్తి,కఠిన చట్టాలతో పరిశుభ్రమైన గాలిని సాధించాయి. మన దేశంలోనూ మార్పు సాధ్యమే. ముంబై వంటి మహానగరాలు ఈ వ్యూహాలను స్థానికంగా అనుసరిస్తే,మెట్రో విస్తరణ,ఎక్కువ పచ్చదనం, వ్యర్థాల నిర్వహణ మెరుగుపరచడం ద్వారా మన పిల్లలు శుభ్రమైన గాలిని పీల్చుకునే రోజు దూరంలో లేదు. "పర్యావరణం ఎవరి ఆస్తి కాదు అది అందరి బాధ్యత"మరో మాటలో చెప్పాలంటే "శుభ్రమైన గాలి లేకుండా ఏ జీవితమూ పూర్తి కాదు."అందుకే ఇప్పుడే మార్పు ప్రారంభించండి. మన నగరాలను మళ్లీ ఊపిరి పీల్చుకోగలిగేలా చేయడానికి మనమందరం కలిసి పనిచేద్దాం. ఎందుకంటే,శుభ్రమైన గాలి కేవలం హక్కు కాదు అది మన జీవన హక్కు.

## వైసీపీలో అమరావతి రచ్చ

అమరావతి

ఏపీ రాజధాని. కోటాది మంది ఆంధ్రుల ఆశల నగరం..అమరావతి చుట్టే ఏపీ రాజకీయం. అప్పటి నుంచి అదే చర్చ. ఇప్పటికీ అదే రచ్చ. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన కామెంట్స్..మరోసారి అమరావతిపై హాట్ డిబేట్‌కు దారితీశాయి. ఏపీ రాజధాని ప్రాంతంగా అమరావతి అనుకూలమైంది కాదన్న జగన్..రాజధానికి మౌలిక సదుపాయాల కొరత ఉందని అన్నారు. లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అని కూడా చెప్పుకొచ్చారు. రాజధాని పేరుతో చంద్రబాబు వేలాది ఎకరాల సేకరణ పేరుతో చేస్తున్నది సరైందని కాదని కూడా జగన్ హాట్ కామెంట్స్ చేశారు. సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మరోసారి రాజధాని అంశాన్ని గెలకడంతో అమరావతి విషయంలో మళ్లీ చర్చ నడుస్తోంది. జగన్ వ్యాఖ్యలు కాస్త పొలిటికల్ డైలాగ్‌వార్‌కు దారితీశాయ్. సీఎం చంద్రబాబుతో సహా మంత్రి నారాయణ..వైసీపీ అధినేత వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడంతో కాక మొదలైంది. అమరావతి రాజధాని విషయంలో వైసీపీ ఆలోచనలు మారుతున్నాయా? లేక మూడు రాజధానుల లైన్‌కే కట్టుబడి ఉన్నారా అనే చర్చ జరుగుతోంది. ఒక్కోసారి ఒక్కో తీరుగా వైసీపీ నేతలు స్పందిస్తున్న తీరు గందరగోళానికి దారితీస్తోందని మండిపడుతున్నాయి కూటమి పార్టీలు. ఓసారి మూడు రాజధానుల ముచ్చటే లేదంటారు. మరోసారి సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటారు. అమరావతే రాజధాని కానీ..విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే డెవలప్‌మెంట్‌కు స్కోప్ ఉంటుందని మరో వైసీపీ నేత వాయిస్ వినిపిస్తుంటారు. ఇంతకు ఏపీ రాజధాని అమరావతిపై వైసీపీ స్టాండ్ ఏంటో క్లారిటీ ఇవ్వాలని..జగన్ మాటల్లో కూడా ఈ క్లారిటీ మిస్ అయిందని అంటున్నారు. రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని వ్యతిరేకిస్తున్నారా? రాజధాని నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలను ప్రస్తావిస్తున్నారా? లేక మూడు రాజధానుల నినాదానికే కట్టుబడి ఉన్నారా? ఇదేది స్పష్టత లేదని అంటోంది టీడీపీ. ఓవైపు రాజధాని రైతుల సమస్యలను ప్రస్తావిస్తారు..మరోవైపు లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అంటారు. ఇంతకు జగన్ ఉద్దేశమేంటనేది ఎవరికి అంతు చిక్కడం లేదంటున్నారు టీడీపీ నేతలు. ఏపీకి అంటూ ఓ రాజధాని ఉండాలని ప్రజలు కోరుకుంటుంటే..జగన్ మాత్రం ఏదో ఒక ట్విస్ట్ ఇస్తూ చర్చకు..రచ్చకు ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా..అమరావతి రైతుల కోరిక ప్రకారం రాజధానికి చట్టబద్ధత కోసం..గెజిట్ తెచ్చేందుకు ఏపీ సర్కార్ ప్రయత్నిస్తోంది. ఇలాంటి టైమ్‌లో మాజీ సీఎం జగన్ మరోసారి కన్ఫ్యూజన్ క్రియేట్ చేసేలా..మాట్లాడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు టీడీపీ నేతలు. మూడు రాజధానుల నినాదంతో ఎన్నికలకు వెళ్లిన వైసీపీ దారుణంగా ఓడిపోయిందని మర్చిపోయారా అంటూ గుర్తు చేస్తున్నారు. విశాఖ ఆర్థిక రాజధాని అంటూ ఉత్తరాంధ్రలో..కనీసం కూటమి అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వలేకపోయిందని విమర్శిస్తున్నారు. వైసీపీ ఘోర పరాజయానికి రాజధాని అంశం కూడా ప్రధాన కారణమనే విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు. గుంటూరు జిల్లా నుంచి విజయవాడ వరకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయిందని..అమరావతిని కాదనుకుని..మూడు రాజధానులు అంటూ కొత్త నివాదం ఎత్తుకోవడమే అందుకు కారణమంటూ వైసీపీపై అటాక్‌కు దిగుతున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా..ప్రజల అభిప్రాయం..ఆకాంక్షలకు విరుద్ధంగా జగన్ మాట్లాడాల్సిన తీరు ఇది కాదంటూ తప్పుబడుతోంది టీడీపీ. రాజధాని విషయంలో వైసీపీనే కన్ఫ్యూజన్‌లో ఉందో..లేక ప్రజలనే కన్ఫ్యూజన్‌లో పెట్టి..హిడెన్ ఎజెండాతో ముందుకు వెళ్తుందో తెలియదు కానీ..ఈ గందరగోళానికి చెక్ పెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్.

**రైతులకు మద్దతుగా**

అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన పై ఒక క్లారిటీ వస్తోంది. ఆ పార్టీకి అమరావతి రాజధాని అనేది శాపంగా మారింది. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చే క్రమంలో.. ఒక్క అమరావతి ప్రజలే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతాల ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎంత మాత్రం మార్పు కనిపించడం లేదు. గత కొద్ది రోజులుగా అమరావతి విషయంలో మళ్లీ కలుగజేసుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే అమరావతి రైతులు ఇప్పుడు భయపడుతున్నారు. రెండో విడత భూ సమీకరణకు రకరకాల షరతులు పెడుతున్నారు. అయితే దీని వెనుక ఉన్న కారణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే 2019 నుంచి 2024 మధ్య వారికి చుక్కలు చూపించింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. అందుకే ఇప్పుడు అమరావతి రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచన చేస్తున్నారు. ఇంకా కూటమి ప్రభుత్వానికి మూడేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడు తీసుకున్న భూములకు బదులు రిటర్నబుల్ ఫ్లాట్స్ అభివృద్ధి చేయాలన్నది ఈ షరతు. అలా చేయకపోతే మూడు సంవత్సరాల్లో ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే ఎన్నికలు జరుగుతాయి. పొరపాటున మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి వారికి తెలుసు. అందుకే కూటమి ప్రభుత్వం ఎదుట ఈ కీలక ప్రతిపాదన పెడుతున్నారు. ఒకటి కూటమి ప్రభుత్వానికి హెచ్చరించినట్లు అవుతుంది. ముందే జాగ్రత్త పడినట్లు అవుతుంది. అమరావతి రైతుల్లో భయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక కారణం. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ కొత్త పల్లవి అందుకుంటుంది. అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి అమరావతి రైతులకు ఎంతలా ఇబ్బంది పెట్టాలో అంతలా పెట్టారు. ఇప్పుడు రైతుల భయాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్వాన్స్ గా తీసుకుంటుంది. గత ఎన్నికల్లో ఓటమి ఎదురైన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి ప్రస్తావన తెచ్చేందుకు భయపడేది. కానీ అదనపు భూ సమీకరణకు ప్రభుత్వం దిగడంతో రైతుల నుంచి ఒక రకమైన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అయితే దానిని అసంతృప్తిగా భావిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది అసంతృప్తి కాదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై భయం అన్న విషయం మరిచిపోతోంది. అమరావతి ప్రాంత రైతులు ప్రత్యామ్నాయంగా జగన్మోహన్ రెడ్డిని చూడరు. అవసరం అనుకుంటే ఏ చిన్న పార్టీ కైనా అక్కడ అవకాశం ఇస్తారే కానీ.. అమరావతి రైతులపై ఎంత ప్రేమ వలకబోసినా వారు మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంత మాత్రం ఛాన్స్ ఇవ్వరు. ఇది ముమ్మాటికి వాస్తవం.

## ఏపీలో కారవాన్ టూరిజం ప్రారంభం.. ఎంచక్కా 4 మార్గాల్లో ప్రయాణం

విజయవాడ

ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా కారవాన్ టూరిజం ప్రారంభమైంది. ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా వీటిని బుక్ చేసుకుని టీవీ, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి సదుపాయాలతో ప్రయాణించవచ్చు. మీకు కారవాన్ అనగానే సెలబ్రిటీలు, ముఖ్యంగా సినీ ప్రముఖులు గుర్తుకొస్తారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం పర్యారక రంగానికి ఊతమిచ్చేందుకు కారవాన్ టూరిజాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు కూటమి ప్రభుత్వం మొదటిసారిగా కారవాన్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గోవాల వంటి రాష్ట్రాల తరహాలోనే ఏపీలో కూడా పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఓజీ డ్రీమ్ లైనర్స్, ఇండియా లక్ష్మీ కారవాన్ ఒఖఖ అనే రెండు సంస్థలను ఎంప్యానల్ చేసింది. ప్రస్తుతం ఈ సంస్థలు 5, 6 సీట్లు, 10-12 సీట్ల సామర్థ్యం కలిగిన నాలుగు వాహనాలను నాలుగు ప్రధాన మార్గాల్లో నడుపుతున్నాయి. ఆసక్తి గల పర్యాటకులు వీటిని నేరుగా ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

ధర్మఘంట

# రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల మూసివేతకు కుట్ర

**టేకులపల్లి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కుట్ర పన్నుతున్నదని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ అధ్యక్షతన జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ కౌన్సిల్ సమావేశమునకు ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగానికి నిధుల కేటాయింపులో కోత పెడుతూ, ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులను నింపకుండా, పాఠశాలల భౌతిక పరిస్థితులు మెరుగుపరచకుండా,ప్రభుత్వ విద్యను ప్రభుత్వం ప్రజలకు దూరం చేస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా వికసిత్ భారత్ శిక్షా అధిస్టాన్ 2025 బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టిందని, సిలబస్లో మతాన్ని చొప్పించి విద్యను కాషాయీకరణ చేయుటకు పూనుకున్నదని, దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దేశంలో విద్యను ప్రైవేటు శక్తులకు అప్పగిస్తూ, బడుగు బలహీనవర్గాలకు విద్యను



అందకుండా చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని, అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను సాధించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.అశోక్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎం.సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవిచంద్ర, కార్యవర్గ సభ్యులు వి.మనోహర్ రాజు, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు, పివైఎల్ జిల్లా అధ్యక్షులు పి.మంగయ్య, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శిలు డి.ప్రణయ్ కుమార్, ఎం.శివ



ప్రశాంత్, డి.ప్రణయ్ కుమార్, టీపీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.ప్రశాంత్ తదితరులు ప్రసంగించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎం.రామాచారి, అధ్యక్షులుగా జి.హరిలాల్, అసోసియేట్ అధ్యక్షులుగా డి.శ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా పహీం బాయ్, పి.మంగయ్య, పి.రవి, ఎం.అంతోని, పి.సత్యనారాయణ, ఎండి.మౌలానా, సిహెచ్.వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా వి.వినోదిని, అసోసియేట్ ప్రధాన కార్యదర్శిగా బి.బ్రహ్మాచారి, కార్యదర్శులుగా ఎం.శివ ప్రశాంత్, డి.ప్రణయ్ కుమార్, సిహెచ్.రమేష్, కె.వెంకటేశ్వర్లు, పి.నాగభూషణం తదితరులు ఎన్నికయ్యారు.

## సేవాలాల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నూతన సర్పంచ్‌లకు సన్మానం





**టేకులపల్లి**

టేకులపల్లి మండలంలో నూతనంగా ఎన్నికైన పలు పంచాయతీల సర్పంచులకు శనివారం జగదాంబ దేవి సేవాలాల్ ఆలయ ప్రాంగణంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశాభివృద్ధి గ్రామాల అభివృద్ధితోనే సాధ్యం కావునా నూతన సర్పంచులు ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి, అలాగే అర్హులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమం అందేలా కృషి చేయాలని కోరారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సర్పంచ్ అభ్యర్థుల పని చేయాలని సేవలాల్ కమిటీ వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ, లక్ష్మణ్ నాయక్, పుణ్యా నాయక్, ప్రేమ్ చంద్ నాయక్, కిషోర్ సింగ్, లాలు నాయక్, హుస్సేన్ నాయక్, రవి రాథోడ్, మరియు టేకులపల్లి మండల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సేవే మా మార్గం..!

**నారీ శక్తి సేవా సంఘం అధ్యక్షురాలు పద్మ**
**కీకారణ్య గొత్తి కోయలకు నిత్యవసరాలు పంపిణీ**



**చర్ల**

సేవ చేయడమే తమ మార్గమని కొత్తగూడెనికి చెందిన నారీ శక్తి సేవా సంఘం అధ్యక్షురాలు పద్మ పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఛత్తీస్గడ్ సరిహద్దుల్లోని చర్ల మండలం, రామచంద్రపురం గ్రామంలో ఆదివాసీలకు శనివారం రూ .20 వేల విలువైన నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో తమ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. జీవితంలో సేవ చేయడం ద్వారానే సార్థకత చేకూరుతుందన్నారు. తమ సంఘంలో 600 మంది మహిళలే గ్రూపుగా ఏర్పడి సమాజ సేవ కోసం పునరంకితంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షులు గుంజి పురుషోత్తం, లత , మంజు, మాధవి, మడకం చందు, ప్రశాంత్, మణికంఠ, లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను వెలికితీయటంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**సమాజానికి మార్గదర్శకులుగా జర్నలిస్టులు ఉండాలి**
**మన తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐ రాజువర్మ వెల్లడి.**

**చర్ల**

ప్రజా సమస్యలను వెలికి తీస్తూ, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న జర్నలిస్టులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని చర్ల సిఐ ఏ రాజువర్మ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో మన తెలంగాణ దినపత్రిక నూతన సంవత్సర (2026) క్యాలెండర్ ను ఎస్సైలు ఆర్ నర్సిరెడ్డి, పి కేశవ్ లతో కలిసి సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ రాజువర్మ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ శ్రేయస్సు కోసం కృషిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారాలలో ప్రభుత్వాలను జవాబుదారీగా చేయడం, అవినీతిని బయట పెట్టడం ద్వారా సమాజానికి మార్గదర్శకులుగా ఉంటారని అన్నారు. ప్రజలకు ముఖ్యమైన వార్తలు సంక్లిష్ట సమస్యలను అర్థమయ్యేలా వివరించి సరైన నిర్ణయాలు తీసుకునేలా సమాచారం అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని అన్నారు. అలాగే ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడం, ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయడం ద్వారా సమాజంలో జర్నలిస్టులు ప్రత్యేక గుర్తింపు పొందుతారని గుర్తు చేశారు. ప్రభుత్వ పనితీరును పరిశీలిస్తూ, అవినీతి అక్రమాలను బయటపెట్టి అధికారం దుర్వినియోగం కాకుండా కాపాడడంలో జర్నలిస్టులు ఎనలేని కృషి చేస్తారని తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన జర్నలిజంలో జర్నలిస్టులుగా బాధ్యతలు చేపట్టిన వ్యక్తులు చక్కటి రచనా నైపుణ్యం కలిగి, పరిశోధన చేయగల సామర్థ్యం, వాస్తవ నిర్ధారణతో సమాజానికి సరైన దిశా నిర్దేశం చేయగల సామర్థ్యం కలిగి ఉండాలని, వీటితో పాటు జర్నలిస్టులు రాసే వార్తలు నిజరూపంలో ఉండాలని, అప్పుడే ప్రజలకు ఉపయోగపడటంతో పాటు ప్రజలు జర్నలిస్టులను గుర్తించడం జరుగుతుందని, తద్వారా సమాజంలో మంచి గౌరవ లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు,చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు,మన తెలంగాణ రిపోర్టర్ తోటమల్ల రమణమూర్తి, సీనియర్ జర్నలిస్టులు ఏడెల్లి గణపతి,మండలోజు వేణుగోపాల చారి, పఠాన్ మహబూబ్ ఖాన్, కొంగూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## డ్రైవర్ల పోరాట ఫలితమే సీఎం పీఎఫ్ చిట్టీలు




**ఇల్లందు**

ఇల్లందు సింగరేణి కన్వేయన్స్ 79 మంది డ్రైవర్ల సీఎం పిఎఫ్, సుమారు ఒక కోటి పాతిక లక్షలు, రూపాయలు ప్రతి నెల జీతం నుండి కట్ చేసిన పైసలను వారి అకౌంట్లో యాజమాన్యం జమ చేయకపోవడం వలన, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ టియుసిఐ ఆధ్వర్యంలో, అనేక దఫాలుగా వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం కాకపోగా సెప్టెంబర్ 22న, డ్రైవర్లు విధులు బహిష్కరించి సమ్మె చేయడం జరిగిందన్నారు.

ఈ పోరాటం వల్లనే శనివారం వారి యొక్క సీఎం పిఎఫ్ చిట్టీలను అందజేయడం జరిగిందని, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి అన్నారు. శనివారం జిఎం ఆఫీస్ వద్ద జరిగిన డ్రైవర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. ఇల్లందు జిఎం ఆఫీస్, హాస్పటల్స్, సిఎస్పి, వర్క్ షాప్ జెకె ఫై ఓసి కె ఓసి లో పనిచేస్తున్న డ్రైవర్ల సీఎంపీఎఫ్ సమస్య ఏట్టకేలకు పరిష్కారం అయిందని అన్నారు. 2023, 24 ఒక సంవత్సరం సీఎం పిఎఫ్ యాజమాన్యం చేసిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్స్ డ్రైవర్లు అస్లాం మహేష్, వెంకట్, వేణు, రవి, నాగరాజు, కిషోర్, గని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా రేషన్ బియ్యం పట్టివేత..!

**సుమారుగా 200 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులు**



**టేకులపల్లి**

టేకులపల్లి మండలంలోని దాస్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మంగళ్ తండా గ్రామం పాయం వారి గుంపులో సుమారుగా 200 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ అధికారి జి వెంకటకృష్ణ తన బృందంతో పట్టుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి రేషన్ బియ్యాన్ని తరలించడం జరుగుతుందని, ఈ రేషన్ బియ్యం ఎవరిది అనేది తెలియాల్సి ఉందని పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నామని తెలియపరిచారు. పేద ప్రజలకు అందించవలసిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ఆర్ఐ ఎన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## లాండ్రీ స్టూడియోస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

**నూతన ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్స్ దంపతులు**

అనపర్తి మండలం అనపర్తి గ్రామంలో +దీ= కాలేజీదగ్గర, ఖ౦= హోమ్‌టౌన్ ఎదురుగా అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తేతలి బుల్లిరెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన లాండ్రీ స్టూడియోస్ వ్యాపార సుముదాయం ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు, తేతలి సత్యనారాయణ రెడ్డి శ్రీమతి మస్తానమ్మ హాజరయ్యారు.

# ఇంజనీర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా డా సంజయ్ నాయక్





**టేకులపల్లి**

డా. బాబాసాహెబ్ అంబేద్కర్ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఇంజనీర్స్ బిఏఎన్ఏఈ జాతీయ ఉపాధ్యక్షుడిగా టేకులపల్లి మండలం బోడు గ్రామానికి చెందిన డా . బానోత్ సంజయ్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నవీ ముంబై లోని బిఏఎన్ఏఈ భవనంలో జాతీయ అధ్యక్షుడు , ఓ ఎన్ జి సి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్ కే సోనార్జి అద్వర్యం లో జరిగిన జాతీయ కమిటీ ఎన్నికల్లో మొత్తం 36 మందితో వేసిన కమిటీలో దక్షిణ భారత్ ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు నుంచి డా. సంజయ్ ని ఎన్నిక చేయడం విశేషం. ఈ మేరకు శనివారం అయన వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని ఏ ఐ ఎం ఎల్ వొక్సెన్ యూనివర్సిటీ లో అధ్యాపక విభాగాధిపతి హెచ్ ఓ డి గా పనిచేస్తున్న సంజయ్ ఐఐటీ ధన్‌బాద్ నుండి కంప్యూటర్ సైన్స్ , ఇంజినీరింగ్‌లో పి హెచ్ డి , ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎం టెక్ , జే ఎన్ టీ యూ హైదరాబాద్ నుండి బీ టెక్ పూర్తిచేసిన ఆయన, విద్యా రంగంలో ప్రతిభను సామాజిక న్యాయ ఉద్యమంతో మేళవించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన ప్రొఫెసర్, సామాజిక సంస్కర్త , గిరిజన నాయకుడు, విద్యార్థులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం చురుకైన పాత్ర పోషిస్తున్నారు. 2023 లో తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఇల్లందు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రజాసేవను ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లారు. డా. సంజయ్ నాయక్ తండ్రి బానోత్ బాలాజీరావు నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా విశిష్ట సేవలు అందించారు. అకడమిక్ సాంకేతిక విద్య బోధన నుంచి రాజకీయ, సామాజిక సేవల వరకు సాగిన డా. సంజయ్ నాయక్ ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకం. ఐక్యత, సమానత్వం, రాజ్యాంగ నిబద్ధతే మా మార్గం అని ఈ సందర్భంగా డా. బానోత్ సంజయ్ నాయక్ స్పష్టం చేశారు.